అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

సోమవారం 06-05-2024 సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 10 సంచిక : 126 Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar 12 పేజీలు వెల : 6.50

హానికరంగా పదేండ్ల బీజేపీ ట్రైలర్

మళ్లీ మోడీ గెలిచి.. సినిమా చూపిస్తే ఘోరమే



- తెలంగాణలో కమలంపార్టీకి ఒక్క సీటూ రానివ్వం
- 200 సీట్లు వచ్చే పరిస్థితి లేక ఆ పార్టీ ఆశలు సన్నగిల్లాయి
- కాళేశ్వరం అక్రమాల్లో కేంద్రానిది ప్రధాన పాత్ర
- ప్రజా సమస్యలు విస్మరిస్తే రాష్ట్ర ప్రభుత్వంపై ఉద్యమిస్తాం
- జాతీయ పార్టీ నిర్ణయం మేరకే భువనగిరిలో పోటీ : సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు

విభజన హామీల అమలులో నిర్లక్ష్యం

నవతెలంగాణ-రంగారెడ్డి ప్రతినిధి

పదేండ్ల బీజేపీ పాలన ట్రైలరే ఇట్లుంటే.. ఇక మళ్లీ గెలిస్తే సినిమా ప్రమాదకరంగా ఉంటుందని, దేశ ప్రజలకు భంగపాటు తప్పదని సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు అన్నారు. అందుకే తెలంగాణలో ఒక్క సీటు కూడా బీజేపీని గెలవనీయబోమని స్పష్టం చేశారు. తాము బలంగా ...11లో

ఇండియా బ్లాక్ పావులుగా ముస్లింలు

ప్రధాని మోడీ



సీతాపూర్ (యూపీ) : కాంగ్రెస్, ఇండియా బ్లాక్‌లు తమను పావులుగా వాడుకుంటున్నాయని ముస్లింలు ఇప్పుడు అర్థం చేసుకున్నారని ప్రధాని నరేంద్ర మోడీ ఆదివారం వ్యాఖ్యానించారు. బీజేపీ చేస్తున్న అభివృద్ధిని చూసిన తర్వాత వారు ఆ రెండింటికీ దూరంగా వుంటున్నారని అన్నారు. దౌరహరలో బీజేపీ అభ్యర్థికి మద్దతుగా ఎన్నికల సభలో ఆయన ప్రసంగిస్తూ, నిరుపేదలు, ...11లో



తెలంగాణలో పదికిపైగా స్థానాలు గెలుస్తాం

- 400పైగా సీట్లతో మళ్లీ కేంద్రంలో అధికారంలోకి బీజేపీ : కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా


నవతెలంగాణ-కాగజ్‌నగర్

రాష్ట్రంలో పదికిపైగా ఎంపీ స్థానాలు, కేంద్రంలో 400 స్థానాలు బీజేపీ దక్కించుకోవడం ఖాయమని, మూడోసారీ మోడీ సర్కార్ ఏర్పాటు కాబోతోందని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ధీమా వ్యక్తం చేశారు. ఆదిలాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి గొడం నగేష్‌కు మద్దతుగా ఆదివారం కుమురం భీం జిల్లా కాగజ్‌నగర్‌లోని ఎస్పీఎం క్రీడామైదానంలో ఏర్పాటు చేసిన జనసభలో అమిత్ షా పాల్గొని మాట్లాడారు. తెలంగాణలో బీజేపీ క్రమక్రమంగా తమ ఓటుశాతాన్ని పెంచుకుంటూ వస్తోందని, విజయం సాధించనున్న పదిస్థానాల్లో ఆదిలాబాద్ ఎంపీ స్థానం ఉంటుందన్నారు. దేశ ఔన్నత్యాన్ని కాపాడాలనే ఆకాంక్షతో ప్రధాని మోడీ పండుగ రోజుల్లో సైతం విరామం ...11లో

జూన్ 6 తర్వాత సర్దుకోవాల్సిందే

- రేవంత్‌రెడ్డి చెవులు నిక్కరించి విను
- కేసులకు భయపడను...హైకోర్టుకెళ్లి ఎదుర్కొంటా
- ఈటల బలమైన బీసీ నేత : అమిత్‌షా

వివరాలు 2లో



రాజ్యాంగాన్ని మార్చే కుట్ర

రిజర్వేషన్లు తొలగించేందుకు బీజేపీ ప్రయత్నం

- బడుగు, బలహీనవర్గాల హక్కులు లాక్కొంటోంది
- ధనికులకు రూ.16లక్షల కోట్లను మోడీ మాఫీ చేశారు
- తెలంగాణ పథకాలు దేశవ్యాప్తంగా అమలు
- ప్రతి మహిళా ఖాతాలో ఏటా రూ.లక్ష జమ : నిర్మల్, గద్వాల జనజాతర సభల్లో.. ఏఐసీసీ నాయకులు రాహుల్‌గాంధీ

దేశంలో అభద్రతలో మైనార్టీలు

నవతెలంగాణ- ఆదిలాబాద్, మహబూబ్‌నగర్ ప్రాంతీయ ప్రతినిధులు

దేశంలో బడుగు, బలహీన వర్గాలకు హక్కులు కల్పిస్తున్న రాజ్యాంగాన్ని మార్చేందుకు కుట్ర జరుగుతోందని, ఇదే జరిగితే రిజర్వేషన్లు తొలగిపోతాయని ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ అన్నారు. వెనుకబడిన తరగతులు, దళితులు, గిరిజనులు, మైనార్టీల హక్కులను బీజేపీ లాక్కొనే ప్రయత్నం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం దేశంలో రాజ్యాంగ విధ్వంసానికి, ప్రజల హక్కుల పరిరక్షణకూ మధ్య యుద్ధం జరుగుతోందని చెప్పారు. కొద్ది మంది ధనికులకు లాభం చేసేందుకే మోడీ పనిచేస్తున్నారని, 22 కార్పొరేట్ కుటుంబాలకు రూ.16లక్షల కోట్ల రుణాలు మాఫీ చేశారని, అదే తాము రైతులకు రుణమాఫీ చేస్తామంటే రైతులను సోమరిపోతులను ...11లో

ఫెయిల్యూర్ ఎన్‌డీఏ



- ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించండి : విశాఖలో సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు బృందా కరత్

విశాఖ : దేశంలోని అత్యధిక రాష్ట్రాల్లో బీజేపీ వ్యతిరేక గాలి వీస్తోందని, గడచిన పదేండ్లలో ఎన్‌డీఏ పాలనలో అధిక ధరలు, ప్రభుత్వ రంగ సంస్థల విధ్వంసానికి పాల్పడుతూ దేశాన్ని ప్రమాదంలో పడేసిందని, దేశ రక్షణ, ప్రజల అజెండాతో ఇండియా వేదిక 2024 ఎన్నికల్లో అధికారంలోకి రానుందని సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు బృందా కరత్ వెల్లడించారు. ఉత్తరాంధ్రలో ఇండియా వేదిక తరపున ప్రచారానికి విచ్చేసిన ఆమె ఆదివారం ఉదయం విశాఖలోని సీపీఐ(ఎం) కార్యాలయం (ఎన్‌పిఆర్ భవన్)లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ప్రసంగించారు. సీపీఐ విశాఖ జిల్లా కార్యదర్శి, గాజువాక అభ్యర్థి ఎం.జగ్గునాయుడు, కాంగ్రెస్ పార్టీ తరపున విశాఖ పార్లమెంట్ బరిలో దిగిన సత్యారెడ్డి, పశ్చిమ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి సీపీఐ అభ్యర్థి విమల అభ్యర్థిత్వాలకు మద్దతుగా తాను విచ్చేశానన్నారు.

ఏపీకి విభజన హామీలైన ప్రత్యేక హెూదా, విశాఖకు రైల్వేజోన్, పోలవరం ప్రాజెక్టు అమలులో బీజేపీ విఫలమైందని బృందా ఎద్దేవా చేశారు. 2018లో రాష్ట్రానికి ప్రత్యేక హెూదా కోసమే తాను బయటకొస్తున్నానని చెప్పి , ఏపీకి హెూదా ఇవ్వని బీజేపీతో 2024 ఎన్నికల్లో కూటమి ...2లో

9 లోపు అందరికీ రైతుభరోసా

- రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



రాష్ట్రంలో రైతు భరోసా రానివారందరికీ ఈ నెల 9లోపు రైతుల ఖాతాల్లో జమ చేస్తామని, ఇది వరకు చెప్పినట్లుగానే ఆగస్టు 15లోపు రూ.2లక్షల రుణ మాఫీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఆరు గ్యారంటీలు అమలు కావడం లేదని మాజీ మంత్రి కేటీఆర్ అంటున్నారని, ఆయన చీరకట్టుకొని ఆర్టీసీ బస్సు ఎక్కాలని, అక్కడ జీరో టికెట్ ఇస్తారని.. అప్పుడు అమలవుతున్నాయో లేదో ఆయనకు తెలుస్తుందని అన్నారు. ఆదిలాబాద్‌లో సిమెంట్ ఫ్యాక్టరీని తెరిపిస్తామని, ప్రాజెక్టులు నిర్మించి సస్యశ్యామలం చేస్తామని ...11లో

ఇండియా కూటమిని గెలిపించాలి

సీపీఐ(ఎం) ఎన్నికల సభలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

- ఇండియా కూటమి పేరు వింటేనే మోడీకి చెమటలు : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య



నవతెలంగాణ-మహబూబాబాద్

దేశ సమైక్యత, సమగ్రత కోసం దేశంలో జరుగుతున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని బాలాజీ గార్డెన్‌లో కాంగ్రెస్ అభ్యర్థి బలరాం నాయక్ గెలిపించాలని కోరుతూ సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన ఎన్నికల సభలో మంత్రితో పాటు పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు జి.నాగయ్య రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.వీరయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. తప్పు చేసిన వారిని ఎండగట్టి నిలదీసేది సీపీఐ(ఎం)యేనని అన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ తప్పు చేసినా నిలదీసి ప్రజల కోసం నిలబడగలిగేది వామపక్షాలేనని అన్నారు. వామపక్ష పార్టీల మొదటి తరం నాయకులతో కలిసి పనిచేసిన రోజులు, అనుభవాలు తనకు ఉన్నాయని గుర్తు చేశారు. దేశం కోసం, దేశ రక్షణ కోసం, దేశ భవిష్యత్తు కోసం ఇండియా కూటమిని ఐక్యం చేసి ఈరోజు ఎన్నికల్లో ముందుకు దూసుకుపోవటంలో సీపీఐ(ఎం) పాత్ర ఎంతో ఉందని కొనియాడారు. కులాలు, మతాల పేరుతో ప్రజలను విచ్ఛిన్నం చేస్తూ వారి ...12లో



ఆరు గ్యారంటీలేమాయే?

కరువు తెచ్చిన కాంగ్రెస్‌కు ఓటుతో బుద్ధి చెప్పాలి

- మోడీ పనితనం బాగుంటే.. రూపాయి విలువ ఎందుకు పడిపోయింది
- గోదావరి నీళ్లు తరలించుకుపోయేందుకు మోడీ కుట్ర
- తెలంగాణ హక్కులపై పోరాడాలంటే పార్లమెంట్‌లో బీఆర్ఎస్ ఎంపీలుండాలి: కేసీఆర్

వివరాలు 12లో

కష్టంగా నీట్ కెమిస్ట్రీ ప్రశ్నలు

ప్రశాంతంగా ముగిసిన నీట్ 2024పరీక్షలు

- 557 కేంద్రాల్లో పరీక్షల నిర్వహణ
- మధ్యాహ్నా 2నుంచి 5:20వరకు కొనసాగిన పరీక్ష
- 24లక్షల మందికి పైగా దరఖాస్తులు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

దేశ వ్యాప్తంగా మెడికల్ ఎంబీబీఎస్, బీడీఎస్ వంటి మెడికల్ కోర్సుల్లో ప్రవేశాల కోసం జాతీయ స్థాయిలో నిర్వహించే నేషనల్ ఎల్జిబులిటీ కమ్ ఎంట్రెన్స్ టెస్ట్(నీట్- 2024) ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. పరీక్షను నేషనల్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) నిర్వహించింది. కెమిస్ట్రీకి సంబంధించిన ప్రశ్నలు కొంచెం కష్టంగా వచ్చినట్టు పరీక్షకు హాజరైన విద్యార్థులు వాపోయారు. బోటనీ, జువాలజీ, ఫిజిక్స్ ప్రశ్నలు సాధారణంగా ఉన్నాయని చెప్పారు.అయితే ఒకటీ రెండు ప్రశ్నలు అవుటాఫ్ సబ్జెక్ట్ నుంచి వచ్చినట్టు విద్యార్థులు భావిస్తున్నందున వాటిపై ఎన్‌టీఏ వివరణ ఇవ్వాల్సి ఉంటుంది. భారత దేశంతో పాటు ఇతర దేశాల్లో నీట్ పరీక్షను ...11లో



(ఫైల్)

ఏపీ డీజీపీపై బదిలీ వేటు

- తక్షణమే విధులనుంచి వైదొలగాలని ఎన్నికల సంఘం ఆదేశం

అమరావతి: జగన్‌కు అనుంగఅధికారిగా ముద్రపడిన డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డిపై ఎన్నికల సంఘం ఎట్టకేలకు బదిలీ వేటు వేసింది. తక్షణమే విధుల నుంచి వైదొలగాలని పేర్కొంటూ ఉత్తర్వులు జారీ చేసింది. సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఆయనకు ఎలాంటి బాధ్యతలు అప్పగించొద్దని పేర్కొంటూ సీఎస్ జవహర్‌రెడ్డికి ఆదేశాలిచ్చింది. సోమవారం ఉదయం 11గంటల్లోగా సీనియర్ ఐపీఎస్ అధికారులతో కూడిన ముగ్గురి పేర్లను పంపించాల్సిందిగా ఈసీ ఉత్తర్వుల్లో పేర్కొంది. వీరందరికీ సంబంధించిన ఐదేళ్ల పనితీరు నివేదిక, విజిలెన్స్ క్లియరెన్స్ నివేదికల్ని కూడా కమిషన్‌కు పంపించాల్సిందిగా సూచించింది. గత కొంతకాలంగా విపక్షాల నుంచి పెద్ద సంఖ్యలో ఫిర్యాదులు రావడంతో ఈసీ చర్యలకు ఉపక్రమించింది.


డీజీపీ కేవీ రాజేంద్రనాథరెడ్డి తొలి నుంచి వైసీపీ కార్యకర్తలా పనిచేస్తున్నారన్న ...11లో

సిట్ కస్టడీకి హెచ్‌డి రేవణ్ణ

హసన్‌లో మహిళలపై అఘాయిత్యాల కేసులో అరెస్టు



బెంగళూరు : హసన్‌లో మహిళలపై అఘాయిత్యాలకు సంబంధించిన దర్యాప్తు కోసం జేడీ(ఎస్) నేత, మాజీమంత్రి హెచ్‌డీ రేవణ్ణను మూడు రోజుల పాటు సిట్ కస్టడీకి పంపారు. శనివారం సాయంత్రం ఆయనను సిట్ అధికారులు అరెస్టు చేశారు. ఆదివారం సాయంత్రం కోరమంగళలోని మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచారు. అంతకుముందు ఆయనకు బౌరింగ్ అండ్ లేడీ కర్జన్ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈనెల 8 వరకు దర్యాప్తు బృందం కస్టడీలో వుంటారు. మైసూరులో పనిమనిషి కిడ్నాపింగ్ కేసులో ఆయనను అరెస్టుచేశారు.



కల్తీలకు కాదేదీ అనర్హం అన్నట్టుగా దందా సాగుతోంది. మనం పైసలు పెట్టి కొనే ఉప్పు,పప్పులే కాదు నూనెలు, సుగంధ ద్రవ్యాలన్నింట్లోనూ కల్తీ యథేచ్ఛగా పారుతోంది. అక్రమార్కులకు కోట్లు కూడబెడుతోంది. జనం ప్రాణాలతో వ్యాపారులు చెలగాటమాడుతున్నా.. మోడీ సర్కార్ మాత్రం కిమ్మన్నాస్తిగా ఉండిపోతోంది. విదేశాలకు పంపిన దేశీయ ఉత్పత్తుల్లో క్రిమిసంహారక మందులు మోతాదుకు మించి ఉన్నాయని తిరస్కరిస్తూంటే.. దేశీయ ప్రజలు మాత్రం ఆ విషాహారాన్ని తిని ప్రాణాలమీదకు తెచ్చుకుంటున్నారు. అయితే కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన ఎఫ్ఎస్ఎస్ఏఐ కూడా పెస్టిసైడ్ మోతాదు పెంచమని ఉత్తర్వులు ఇస్తే..జనం ప్రాణాలకు బాధ్యులెవరని పౌర సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

విషాహార భోజనం...

సుగంధ ద్రవ్యాల్లో మోతాదుకు మించి క్రిమిసంహారక మందులు

- పది రెట్లు పెంపునకు ఎఫ్ఎస్ఎస్ఏఐ గ్రీన్‌సిగ్నల్
- ప్రజల ప్రాణాలతో చెలగాటమే..పౌర సంఘాలు




న్యూఢిల్లీ : దశాబ్దకాలంగా దేశంలో ఎటు చూసినా కల్తీనే. అక్రమార్కుల భరతం పడతానంటూ అధికారంలోకి వచ్చిన మోడీ సర్కార్..దేశ ప్రజల ఆరోగ్యాల కన్నా..అక్రమ వ్యాపారులకు అండగా నిలుస్తోందన్న వాదనలు బలంగా వినిపిస్తున్నాయి.

పేద,మధ్య తరగతి ప్రజల ఆరోగ్యాలను బేఖాతరు చేస్తున్నదనటానికి తాజా నిదర్శనలే సాక్ష్యంగా నిలుస్తున్నాయి. తినే వస్తువుల్లో కల్తీ కలిపేసుకుని..దండుకోండి..అన్నట్టుగా కేంద్ర వ్యవహరిస్తోంది. ఆ కోణంలోనే.. సుగంధ ద్రవ్యాల్లో పెస్టిసైడ్స్ పరిమాణాన్ని పెంచుతూ ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. గరిష్ట అవశేష పరిమితి (ఎంఆర్ఎల్)ని పది రెట్ల వరకు పెంచింది. ఈ పెరుగుదల కిలో(గ్రాము(కేజీ)కు 0.01 మిల్లి(గ్రాము(ఎంజీ)ల నుంచి 0.1 ఎంజీకి పెంచింది. ఇది గతంలో అనుమతించిన స్థాయి, పరిమాణం కంటే అధికం కావటం గమనార్హం. ఈ పెరుగుదలపై పలువురు మార్కెట్, ఆరోగ్య నిపుణులు ఆందోళనలు వ్యక్తం చేస్తున్నారు. అధిక మొత్తంలో పెస్టిసైడ్‌ల వినియోగం కారణంగా అది క్యాన్సర్‌కు దారి తీయొచ్చని హెచ్చరిస్తున్నారు.

ఎగుమతులు, దిగుమతులపై ప్రభావం

ఈ సడలింపు కారణంగా కొన్ని పెద్ద మార్కెట్లలో భారత సుగంధ ద్రవ్యాల ఎగుమతులు ఎక్కువగా తిరస్కరణకు గురవుతాయని పెస్టిసైడ్ ...11లో



రేపే పోలింగ్

ముగిసిన మూడో దశ ప్రచార పర్వం

- 12 రాష్ట్రాల్లో 95 స్థానాలకు పోలింగ్
- మొత్తం 1,351 మంది అభ్యర్థులు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

సార్వత్రిక ఎన్నికల్లో మూడో దశ పోలింగ్ రేపు (మంగళవారం) జరగనుంది. ఈ నేపథ్యంలో ఆ యా ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం ఆదివారం సాయంత్రంతో ముగిసింది. ఈ దశలో మొత్తం 12 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని మొత్తం 95 లోక్‌సభ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో మొత్తం 1,351 మంది అభ్యర్థులు బరిలో దిగారు. ఈ దశలో బరిలో నిలిచిన ప్రముఖులు కేంద్ర మంత్రులు అమిత్ షా (గాంధీనగర్), జ్యోతిరాదిత్య సింధియా (గుణ), బీజేపీ తిరుగుబాటు నాయకుడు కెఎస్ ఈశ్వరప్ప(షిమోగా), డింపుల్ యాదవ్ (మెయిన్‌పురి), శివరాజ్ సింగ్ చౌహాన్ (విదిశ), సుప్రియా సులే (బారమతి) తదితరులు ...2లో

జూన్ 6 తర్వాత సర్దుకోవాల్సిందే



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రేవంత్‌రెడ్డి ఇప్పుడిప్పుడే ముఖ్యమంత్రి అయ్యాడు. ఈ మధ్య నాపై కేసు ఫైల్ చేయించాడు. నేను ఆయనలా ఏడవను. కేసును హైకోర్టుకెళ్లి ఎదుర్కొంటా. రేవంత్‌రెడ్డీ చెవులు నిక్కరించి విను. తెలంగాణలో అవినీతి చేస్తున్న వారంతా జూన్ ఆరో తేదీ తర్వాత సర్దుకోవాల్సిందే' అని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా అన్నారు. తెలంగాణలో రేవంత్‌రెడ్డి, రాహుల్‌గాంధీ పేరిట ఆర్ఆర్ ట్యాక్స్ వసూలు చేస్తున్నారనీ, తెలంగాణ కాంగ్రెస్‌కు ఎన్నికల కోసం డబ్బులు సమకూర్చే ఏటీఎంగా మారిందని ఆరోపించారు. మల్కాజిగిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్, కంటోన్మెంట్ ఎమ్మెల్యే అభ్యర్థి టీ.ఎన్.వంశీతిలక్‌ను గెలిపించాలని కోరుతూ ఆదివారం సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో ఎన్నికల సభను నిర్వహించారు. ఈ సందర్భంగా అమిత్‌షా మాట్లాడుతూ..ఎన్డీఏ కూటమికి ప్రధాని అభ్యర్థిగా మోడీ ఉన్నారనీ, ఇండియా కూటమికి ప్రధాని అభ్యర్థి ఎవరు? అని ప్రశ్నించారు. శరద్‌పవార్, మమతాబెనర్జీ, స్టాలిన్, ఉద్ధవ్‌ఠాక్రే, రాహుల్‌గాంధీలలో ఎవరు ప్రధాని అవుతారు? అని ప్రశ్నలు సంధించారు. ఇండియా కూటమి వస్తే ఒక్కొక్కరు ఒక్కో ఏడాది ప్రధానిగా ఉంటారన్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వాలు అవినీతి పాలనను అందిస్తే మోడీ మచ్చలేని పాలన అందించారని చెప్పారు. పదేండ్ల కాలంలో మోడీ ప్రభుత్వం పేదలకు ఇండ్లు, రేషన్, తదితరాలను ఇచ్చిందని గుర్తుచేశారు. బీఆర్ఎస్, ఎంఐఎం, కాంగ్రెస్ ఒక్కటేననీ, ముస్లిం ఓట్ల కోసం శ్రీరామనవమి ర్యాలీని కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డుకున్నదని ఆరోపించారు. తెలంగాణ అభివృద్ధికి మోడీ ప్రభుత్వం ఎంతో చేసిందనీ, జాతీయరహదారులు, రీజినల్ రింగురోడ్డు, కొత్త రైల్వేలైన్లను ఇచ్చిందని గుర్తుచేశారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ముస్లింలకు రిజర్వేషన్లు తెచ్చిందనీ, ఇది రాజ్యాంగ విరుద్ధమని చెప్పారు. తాము అధికారంలోకి వస్తే వాటిని రద్దు చేస్తామన్నారు. మల్కాజిగిరి నుంచి తమ పార్టీ తరపున పోటీచేస్తున్న ఈటల రాజేందర్ బలమైన బీసీ నేత అనీ, ఆయన్ను గెలిపించాలని ప్రజల్ని కోరారు. దేశంలో ఏమూలకెళ్లినా మోడీ తిరిగి ప్రధాని కావాలని కోరుకుంటున్నారన్నారు. ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు డాక్టర్ కె.లక్ష్మణ్ మాట్లాడుతూ..ఇవి దేశ భవిష్యత్తును నిర్దేశించే ఎన్నికలన్నారు. వయనాడ్‌లో ఓటమి తేలిపోయింది కాబట్టే రాహుల్‌గాంధీ రాయబరేలీలో నామినేషన్ వేశారని విమర్శించారు. రాహుల్‌గాంధీ ప్రధాని అయ్యేది లేదు..రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేసేది లేదు అని దెప్పిపొడిచారు. బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లను తొలగిస్తుందనే కాంగ్రెస్ ప్రచారాన్ని తిప్పికొట్టారు. బీజేపీ మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో సాధ్యంకాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిందనీ, మరోమారు ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి రావాలని చూస్తున్నదని విమర్శించారు. రిజర్వేషన్లు పోతాయంటూ కాంగ్రెస్ నీచమైన ప్రచారానికి పూనుకున్నదనీ, కేంద్రంలో, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఏనాడైనా రిజర్వేషన్లను తగ్గించామా? అని ప్రశ్నించారు. సభలో కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు, మాజీ ఎమ్మెల్సీ రామచందర్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు బేతి సుభాశ్‌రెడ్డి, ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, కార్పొరేటర్లు, బీజేపీ నేతలు పాల్గొన్నారు.

రేపే పోలింగ్

(మొదటిపేజీ తరువాయి)

ఉన్నారు. అలాగే ఈ దశలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీ, సమాజవాదీ పార్టీ, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీల నుంచి అభ్యర్థుల మధ్య ప్రధానంగా పోరు జరగనుంది. మరోవైపు ఇప్పటికే ఏప్రిల్ 19న తొలి దశ పోలింగ్, ఇక ఏప్రిల్ 29న రెండో దశ పోలింగ్ పూర్తి అయింది. ఓట్ల లెక్కింపు జూన్ 4న ఉంటుంది.

మధుయాష్కిగౌడ్‌కు తప్పిన ప్రమాదం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

టీపీసీసీ క్యాంపెయిన్ కమిటీ చైర్మెన్, మాజీ పార్లమెంట్ సభ్యులు మధుయాష్కిగౌడ్‌కు ప్రమాదం తృటిలో తప్పింది. అనుకోకుండా అడ్డువచ్చిన బైకును తప్పించే క్రమంలో ఆయన ప్రయాణిస్తున్న కారు డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ క్రమంలో కారు టైర్లు పేలిపోయి భారీ కుదుపునకు గురైనప్పటికీ...డ్రైవర్ ముఖేష్ అప్రమత్తతో పెను ప్రమాదం తప్పింది. మాజీ పార్లమెంట్ సభ్యులు బలరాం నాయక్ తల్లి అంత్యక్రియల్లో పాల్గొనేందుకు ఆదివారం ఉదయమే ఆయన వరంగల్ బయలుదేరారు. ఈ క్రమంలో ఆలేరు వద్దకు వెళ్లగానే బైక్‌పై ప్రయాణిస్తున్న వ్యక్తులు రోడ్డు క్రాస్ చేసే క్రమంలో అనుకోకుండా అడ్డుగా వచ్చారు. బైక్‌పై ఉన్న ఆ వ్యక్తులను కాపాడే క్రమంలో కారును డ్రైవర్ పక్కకు తిప్పగా డివైడర్‌ను ఢీ కొట్టి కారు టైర్లు పేలిపోయాయి. ఈ ఘటనలో ఆయనకు, కారులోని ఇతరులకు స్వల్ప గాయాలు మినహా ప్రాణాపాయం తప్పడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. స్వల్ప గాయాలు మినహా ఎవరికి ఏమీ కాలేదని మధుయాష్కి పేర్కొన్నారు.

జీతాలు ఎందుకివ్వలేదు?

- ఆర్టీసీ కార్మికులకు సమాధానం చెప్పండి :టీఎస్ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర కమిటీ డిమాండ్



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఆర్టీసీ కార్మికులకు ఏప్రిల్ నెల జీతాలు మే 5వ తేదీ దాటినా ఇంకా ఎందుకు చెల్లించలేదని టీఎస్ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్) రాష్ట్ర కమిటీ యాజమాన్యాన్ని ప్రశ్నించింది. జాప్యానికి గల కారణాలను కార్మికులకు తెలపాలని డిమాండ్ చేసింది. ప్రతినెలా 1వ తేదీనే జీతాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరింది. ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ సమావేశం అధ్యక్షులు వీరాంజనేయులు అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ (ఏఆర్‌టీడబ్ల్యూఎఫ్) జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్ లక్ష్మయ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జే వెంకటేష్ జాతీయ రాజకీయాలపై మాట్లాడారు. ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రవేశపెట్టిన నివేదిక, ఆర్టీసీ కార్మికులకు ప్రతినెలా 1వతేదీనే జీతాలు చెల్లించాలనే తీర్మానాన్ని రాష్ట్ర కమిటీ ఏకగ్రీవంగా ఆమోదించింది. ప్రస్తుత వేసవిలో ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున డ్రైవర్, కండక్టర్లకు హీట్ ప్రొటెక్షన్ కోసం ప్రతి డ్యూటీ రోజు రూ.100 ఇవ్వాలని సమావేశం తీర్మానించింది. ప్రస్తుతం యూనియన్ బ్యాంకులో అకౌంట్ ఉన్న వారికి కోటి రూపాయలు, రూపే కార్డు ఉన్న వారికి మరో 15 లక్షలు, మొత్తం కోటి 15 లక్షలు ప్రమాదంలో మరణించిన వారికి ఇస్తున్నారని తెలిపారు. అలాగే సహజ మరణానికి కూడా రూ.15 లక్షలు తగ్గకుండా ఇన్సూరెన్స్ స్కీంను ప్రవేశపెట్టేలా చర్యలు తీసుకోవాలని యాజమాన్యానికి లేఖ రాయాలని సమావేశంలో తీర్మానం చేశారు. హయ్యర్ పెన్షన్ కోసం గతంలో రికవరీ చేసి, 2014 నాడు రిజెక్ట్ చేయబడిన 7,373 మందికి న్యాయం జరిగేలా చూడాలనీ, వారి వద్ద నుంచి ఈపీఎఫ్ఓ రికవరీ చేసిన డబ్బులను వడ్డీతో సహా చెల్లించాలని సమావేశం తీర్మానించింది.

సమావేశంలో ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి పీ రవీందర్‌రెడ్డితో పాటు రాష్ట్ర ఆఫీస్ బేరర్లు, రాష్ట్ర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఫెయిల్యూర్ ఎన్డీఏ



(మొదటిపేజీ తరువాయి)

ఎలా కడతారని చంద్రబాబును ప్రశ్నించారు. దేశంలోని ఇండియా వేదికలో అనేక ప్రతిపక్షాలు, ప్రజా సంఘాలు, గిరిజన సంఘాలు, లెఫ్ట్ పార్టీలు సహా ప్రత్యామ్నాయంగా ఏర్పడి 2024 ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌కు రాష్ట్ర హెూదా, పోలవరం, రైల్వే జోన్ కోసం ఎన్నికల బరిలో దిగామన్నారు. 2018లో దేశ ప్రధాని మోడీ విశాఖపట్నం వచ్చి ఎన్నో హామీలు కురిపించి వెళ్లారని అందులో రైల్వేజోన్‌కు నేటికీ అతీగతి లేదన్నారు. ప్రత్యేక హెూదా ఎలాగూ కాగితాలకే పరిమితం అయిపోయిందన్నారు. పోల వరం ప్రాజెక్టును కేంద్రమే పూర్తి చేయాల్సి ఉన్నా మోడీ ప్రభుత్వం ఇన్నాళ్లూ ఏం చేసిందని ప్రశ్నించారు. పోలవరం ముంపు ప్రాంతాల్లో తాను పర్యటిస్తానని, గిరిజను లు, నిర్వాసితుల కోసం ప్రత్యామ్నా య స్థలాలు కేటాయించాలని ఆమె డిమాండ్ చేశారు.

బాక్సైట్ దోపిడీకే బీజేపీ అభ్యర్థి పోటీ

రాజ్యాంగం ద్వారా గిరిజనులకు దక్కిన హక్కులకు విశాఖపట్నం ఏజెన్సీలో రక్షణ లేదన్నారు. అనకాపల్లి ఎన్డీఏ కూటమి (బీజేపీ) అభ్యర్థి సిఎం రమేష్‌పై ఇల్లీగల్ మైనింగ్ కేసులున్నాయని ఇలాంటి వారిని గెలిపించాలని ప్రధాని నరేంద్రమోడీ విశాఖ కశింకోటలో ప్రచారానికి రావడం సిగ్గుచేటని ఎద్దేవా చేశారు. బాక్సైట్ భూముల్లో మైనింగ్ చేసేందుకే సిఎం రమేష్ అనకాపల్లి ఎంపిగా బరిలోకి దిగారని వ్యాఖ్యా నించారు.

స్టీల్‌ప్లాంట్‌పై మోడీ కుట్రలు

పోర్టులు కేంద్ర ప్రభుత్వ అధీనంలోకి వచ్చే దేశ సంపద కాగా విశాఖలోని గంగవరం పోర్టును అదానీకి కట్టబెట్టారని ప్రధానితో అదానీ స్నేహంతో దీన్ని కబ్జా చేశారని విమర్శించారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ కుట్రను గంగవరం పోర్టు అమలు చేస్తుందన్నారు. తక్షణమే కోర్టు చెప్పిన ప్రకారం కార్మికులతో యాజమాన్యం చర్చలు జరిపి సమస్యను పరిష్కరించి స్టీల్‌ప్లాంట్‌కు కోకింగ్ కోల్‌ను సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఎం నాయకులు సిహెచ్ నరసింగరావు పాల్గొన్నారు.

ఎండా..వానా..

- వెల్గటూరులో 47.1 డిగ్రీల ఉష్ణోగ్రత
- ఈ ఏడాది ఇదే అత్యధికం పలుచోట్ల మోస్తరు వర్షం..
- అక్కడక్కడా వడగండ్లు, పిడుగులు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో ఆదివారం విభిన్న వాతావరణం నెలకొంది. పొద్దస్తమానం భానుడు తన ప్రతాపాన్ని చూపితే సాయంత్రం వేళ వర్షం పలుకరించింది. నల్లగొండ, సూర్యాపేట, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, యాదాద్రి భువనగిరి, జనగాం, వరంగల్, మహబూబాబాద్, ములుగు, హన్మకొండ జిల్లాల్లో మోస్తరు నుంచి తేలికపాటి వర్షం కురిసింది. కొన్ని చోట్ల వడగండ్ల వాన పడింది.

ఒకటెండ్రు చోట్ల పిడుగులు పడ్డాయి. వచ్చే మూడ్రోజులు కూడా రాష్ట్రంలో పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ సూచించింది. ఆదివారం కరీంనగర్, జగిత్యాల, నల్లగొండ, నారాయణపేట, పెద్దపల్లి, నిజామాబాద్, మంచిర్యాల, సూర్యాపేట, కామారెడ్డి, జోగులాంబ గద్వాల, మహబూబ్‌నగర్, నిర్మల్, వికారాబాద్, వనపర్తి, యాదాద్రి భువనగిరి, సంగారెడ్డి, ఆదిలాబాద్, జనగాం, మహబూబాబాద్, సిద్ధిపేట, మెదక్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లో పలుచోట్ల వడగాడ్పులు వీచాయి. 28 జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలకుపైగా నమోద య్యాయి. ఈ నేపథ్యంలో టీఎస్‌డీపీఎస్ నివేదిక పై జిల్లాలకు రెడ్ అలర్ట్‌ను జారీ చేసింది. భానుడి ప్రతాపం రోజురోజుకీ పెరిగిపోతున్నది. ఆదివారం జగిత్యాల జిల్లా వెల్గటూరులో 47.1 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత రికార్డయింది. ఈ ఏడాది 47 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రత దాటడం ఇదే తొలిసారి. ఉక్కపోత తీవ్రత కూడా పెరిగింది. గాలిలో తేమశాతం భారీగా తగ్గింది.

అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదైన ప్రాంతాలివే.

వెల్గటూరు (జగిత్యాల)	47.1 డిగ్రీలు
గోదూరు(జగిత్యాల)	46.8 డిగ్రీలు
వీణవంక (కరీంనగర్)	46.7 డిగ్రీలు
అల్లీపూర్(జగిత్యాల)	46.7 డిగ్రీలు
బుట్టాపూర్ (నిర్మల్)	46.5 డిగ్రీలు
హాజీపూర్(మంచిర్యాల)	46.3 డిగ్రీలు
జన్నారం (మంచిర్యాల)	46.3 డిగ్రీలు
నిజామాబాద్	46.2 డిగ్రీలు
వెల్గనూరు(మంచిర్యాల)	46.2 డిగ్రీలు
కాగజ్‌నగం	46.11డిగ్రీలు

అబద్ధాలతో అరవింద్ బతుకున్నారు

- టీపీసీసీ మీడియా కమిటీ చైర్మెన్ సామ

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

నిజామాబాద్ బీజేపీ ఎంపీ అర్వింద్ అబద్ధాలతో బతుకున్నారని టీపీసీసీ మీడియా కమిటీ చైర్మెన్ సామ రామ్మోహన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. ఓటమి భయంతో బీజేపీ దేశ వ్యాప్తంగా అబద్ధపు ప్రచారాలు చేస్తున్నదని విమర్శించారు. ఆదివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు.మొన్న సీఎం రేవంత్ కాన్వాయ్ కింద పడి ఓ యువకుడు చనిపోయారని ప్రచారం చేశారనీ, నిజామాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డిపై ఫేక్ వీడియోలతో దుష్ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.లేని ప్రచారాలు చేస్తే ఆయన్ను చెప్పులతో కొట్టించుకునే పరిస్థితి వస్తోందని హెచ్చరించారు. టీపీసీసీ ఉపాధ్యక్షులు జీవి వినోద్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ సోషల్ మీడియా వారియర్స్‌ను బెదిరించడం సరైందికాదన్నారు. చట్టబద్ధంగా విచారణ చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం తలుచుకుంటే ఢిల్లీ పోలీసులు హైదరాబాద్ రాకుండా ఆపగలదని హెచ్చరించారు. కాంగ్రెస్ లీగల్ సెల్ ఇన్‌ఛార్జి రామచంద్రరెడ్డి మాట్లాడుతూ బీజేపీ అనాలోచితంగా ముందుకు పోతుందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ఢిల్లీ పోలీసుల ద్వారా అనైతిక చర్యలకు పాల్పడుతోందన్నారు.

బాల బంధువు తెలంగాణ బాలోత్సవం

కేంద్ర బాల సాహితీ వేత్త చొక్కాపు వెంకటరమణ



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బాలబంధువు తెలంగాణ బాలోత్సవం అని కేంద్ర బాలసాహితీ వేత్త చొక్కాపు వెంకటరమణ అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ బాలోత్సవం కమిటీ ఆధ్వర్యంలో బాలోత్సవం సమ్మర్ క్యాంపు ప్రారంభమైంది. 200మంది విద్యార్థులతో విజ్ఞాన శిబిరం ప్రారంభమైంది ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ హైదరాబాద్‌లో సమ్మర్ క్యాంపు అంటే రూ.10వేల నుంచి రూ.20వేల వరకు చెల్లించాల్సిందేన్నారు. కానీ.." తెలంగాణ బాలోత్సవం" ఉచిత సమ్మర్ క్యాంపు నేటి నుంచి ఈ నెల 22 వరకు నిర్వహించటం హర్షణీయమన్నారు. అందమైన, విశాలమైన హాలులో ఏకకాలంలో, ఆటలు, విజ్ఞానాన్ని అందించి, ఉత్సాహాన్ని ఉల్లాసామిచ్చే.. చక్కటి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు ఇది పోటీ ప్రపంచం సుమా..అంటూ.. చదువొక్కటే పరిష్కారం కాదన్నారు. ఏదైనా కళలలోనూ ..క్రీడల్లోనూ.. ప్రావీణ్యత సాధించాలని విజ్ఞప్తి చేశారు. ప్రావీణ్యత అంటే అదనపు అర్హతగా గుర్తిస్తున్నారని తెలిపారు. వేసవి సెలవుల్లో కాలాన్ని వృధాగా పోనీయకుండా కొత్త కళలను, సరికొత్త పనుల్లో ప్రావీణ్యాన్ని సంపాదించేందుకు పిల్లలు ఉత్సాహం చూపుతున్నారని ప్రతి పిల్లవాడిలోనూ సృజనాత్మకత దాగి ఉంటుందని చెప్పారు. దాన్ని గుర్తించి వెలికి తీయడమే తెలంగాణ బాలోత్సవం నిరంతరం పిల్లల్లో పనిచేస్తుందన్నారు. విజ్ఞానదర్శిని అధ్యక్షులు టి.రమేష్ మాట్లాడుతూ పిల్లలకు విజ్ఞాన శాస్త్ర, సామాజిక పర్యావరణ, ప్రయోగం నైపుణ్యాలు, ప్రకృతి పాఠాలు, మానవ సంబంధాలు పెంపొందించటం అవసరమన్నారు. ఇతరుల నుంచి ఎలా నేర్చుకోవాలి? స్నేహితులను ఎలా సంపాదించుకోవాలి? సెల్ ఫోనుకు ఎంత దూరం ఉండాలి? అనేక విషయాలు ఈ సమ్మర్ క్యాంపులో నేర్పిస్తామన్నారు. తెలంగాణ బాలోత్సవం అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఒకరిని అనుకరించడం కాకుండా నీ శక్తిని నువ్వు తెలుసుకోవాలని పిల్లలకు బోధించారు.

ఆంగ్ల భాష మోజులో పడి తెలుగు మరిచిపోతున్న ఈతరానికి తెలుగు మాధుర్యాన్ని పంచే బాధ్యత అమ్మభాషని తెలుగుభాషని తెలంగాణ బాలోత్సవం నేర్పిస్తుందన్నారు. ప్రధాన కార్యదర్శి ఎన్ సోమయ్య మాట్లాడుతూ మే 22 న పిల్లలు నేర్చుకున్న విషయాలను తల్లిదండ్రుల సమక్షంలో ప్రతిభోత్సవం పేరుతో ప్రదర్శన ఉంటుందని ప్రతి పిల్లవాడు సమ్మర్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ బాలోత్సవం ఉపాధ్యక్షులు మమత, కే.సుజావతి, కోశాధికారి జి బుచ్చిరెడ్డి, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు. చొక్కాపు వెంకటరమణ గారి మెజిషియన్ షో అద్భుతంగా అలరించినది పిల్లలు ఆట పాటలతో సరదా గా సందడిగా సాగింది. 17 రోజులపాటు సాగే సమ్మర్ క్యాంపు విధివిధానాలను నిర్వాహకులు వివరించారు.

ఇదేమి నిష్పాక్షికత?

ఈసీ పనితీరుపై ప్రశ్నలు, సందేహాలు



అరెస్టులతో సమానావకాశాలు ఎలా?



ఎన్నికల షెడ్యూలు ప్రకటనకు కేవలం ఒక రోజు ముందు ఇద్దరు ఎన్నికల కమిషనర్లను తొందరపాటుతో, నర్మగర్భంగా పక్షపాతపూరితంగా నియమించారు. ఏడు దశల సుదీర్ఘ ఎన్నికల ప్రక్రియ అధికార పార్టీకి, దాని స్టార్ క్యాంపెయినర్లు... ముఖ్యంగా ప్రధాని మోడీకి ప్రయోజనం చేకూర్చేలా ఉంది. ఎన్నికల సమయంలో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను అరెస్టు చేయడం అనేక అనుమానాలు రేకెత్తిస్తోంది. ప్రతిపక్షానికే చెందిన జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సొరేన్‌ను అరెస్ట్ చేసిన వెంటనే కేజ్రీవాల్‌ను కూడా అరెస్ట్ చేయడం జరిగింది. అలాంటప్పుడు ఎన్నికల ప్రక్రియలో అందరికీ సమానావకాశాలు ఎలా లభిస్తాయి?



ముఖ్యమంత్రులనూ అరెస్ట్ చేస్తున్నారు
మతం పేరుతో ఓట్లను దండుకోవాలని చూస్తున్నారు
ప్రధాని, మంత్రులు కోడ్‌ను ఉల్లంఘిస్తున్నారు
సూరత్‌లో బలవంతంగా 'ఏకగ్రీవం' చేయించారు
అయినా కళ్లు తెరవని ఎన్నికల కమిషన్

న్యూఢిల్లీ : ఎన్నికల కమిషన్‌పై ప్రజలు, రాజకీయ పార్టీలకు విశ్వాసం రానురానూ సడలిపోతోంది. 2019 సార్వత్రిక ఎన్నికల సమయంలోనే దాని విశ్వసనీయత, స్వతంత్రతను పలువురు ప్రశ్నించారు. జూలై 2న లోక్‌సభ ఎన్నికలు ముగిసిన వెంటనే 64 మంది ప్రభుత్వ మాజీ ఉన్నతోద్యోగులు, సాయుధ దళాలకు చెందిన 83 మంది మాజీ అధికారులు కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఉద్దేశిస్తూ ఘాటుగా ఓ లేఖ రాశారు. 2019 లోక్‌సభ ఎన్నికల నిర్వహణను వారు తప్పు పట్టారు. అవి స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరగలేదని, గత మూడు దశాబ్దాలలో ఇంత దారుణమైన పరిస్థితిని ఎన్నడూ చూడలేదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. అయినప్పటికీ ఈసీ పనితీరులో ఏ మాత్రం మార్పు రాలేదు. ఈసారి కూడా పక్షపాతపూరితంగా వ్యవహరిస్తూ ఎన్నికల ప్రక్రియను ఓ ఫార్సుగా మార్చేసేందుకు కంకణం కట్టుకుంది.

గత నెల 11న ప్రభుత్వ మాజీ ఉన్నతోద్యోగులు ఈసీకి ఓ లేఖ రాశారు. ఎన్నికల నిర్వహణపై ప్రజలు, రాజకీయ పార్టీల మనసులో ఉన్న అనుమానాలను నివృత్తి చేసేందుకు ఈసీ చేస్తున్నది ఏమీ లేదని మండిపడ్డారు. ఈవీఎంల పనితీరు, వీవీప్యాట్ల లెక్కింపుపై ప్రజలు అనేక సందేహాలు వ్యక్తం చేస్తున్నప్పటికీ వాటిని ఎవరూ పట్టించుకోవడం లేదని తెలిపారు. అధికార పక్షం ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘిస్తుంటే ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. ఇటీవలి కాలంలో ఈసీ చర్యలు వింతగా ఉన్నాయని వ్యాఖ్యానించారు.

పర్యవేక్షణకు స్వతంత్ర కమిటీ

ఎవరెన్ని లేఖలు రాసినా, అభ్యర్థనలు పంపినా ఎన్నికల సంఘం దున్నపోతు మీద వాన పడినట్లే వ్యవహరిస్తోంది. అంతేకాక అబద్ధాలను పదేపదే వల్లె వేస్తూ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తోంది. ఈ నేపథ్యంలో పౌర సమాజ గ్రూపులు ఒక్కటై ఎన్నికల ప్రక్రియ పర్యవేక్షణకు ఓ స్వతంత్ర కమిటీని ఏర్పాటు చేశాయి. మార్చి 15న ప్రారంభమైన ఈ కమిటీ స్వేచ్ఛాయుత ఎన్నికల నిర్వహణలో ఎదురవుతున్న సమస్యలు, కోడ్ ఉల్లంఘనలపై ఈసీకి ఎప్పటికప్పుడు నివేదికలు, వారానికి ఒక బులెటిన్ పంపుతోంది. వాటిలోని కొన్ని ముఖ్యాంశాలు....

మతం పేరుతో ఓట్ల అభ్యర్థన

స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికలపై ప్రభావం పడేలా ప్రధాన స్రవంతి మీడియాలో పక్షపాతపూరితమైన, సమతూకంగా లేని వార్తలు వస్తున్నాయి. ఓటర్ల జాబితా నుండి ఓ పద్ధతి ప్రకారం ముస్లింలు, దళితులు, ఇతర అణగారిన వర్గాల వారిని తొలగించారు. ఎన్నికల సీజన్‌లో కాంగ్రెస్ పార్టీ బ్యాంక్ ఖాతాలను స్తంభింపజేశారు. వామపక్షాలకు ఆదాయపన్ను నోటీసులు ఇచ్చారు. అధికార బీజేపీ నేతలు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించి మతాలను అభ్యర్థిస్తూ ప్రకటనలు ఇస్తున్నారు. ప్రధాని నరేంద్ర మోడీ, హోం మంత్రి అమిత్ షా, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఓట్లను అభ్యర్థిస్తూ అయోధ్య రామమందిర ప్రాణప్రతిష్ఠ, రామనవమిని ప్రస్తావిస్తున్నారు.

బీజేపీ మంత్రులు తమ ఎన్నికల సందేశాలలో సైనిక చిహ్నాలను దుర్వినియోగం చేశారు. మోడీ సైనిక యూనిఫారంలో ఉన్న వీడియోలను పోస్ట్ చేశారు. బీజేపీ సీనియర్ నాయకులు మతపరమైన భావోద్వేగాలను రెచ్చగొడుతుంటే ప్రభుత్వం ఓ పద్ధతి ప్రకారం స్వతంత్ర మీడియాను లక్ష్యంగా చేసుకుంటోంది. ప్రధాని మోడీ తన ఎన్నికల ప్రచారంలో పలు సందర్భాలలో మతపరమైన ప్రస్తావనలు తీసుకొస్తున్నారు. పౌర సమాజం పలు సందర్భాల్లో అనేక ప్రశ్నలు లేవనెత్తుతూ, ఆందోళన వ్యక్తం చేస్తున్నప్పటికీ ఈసీ మాత్రం ఈవీఎంల భద్రత, పనితీరుపై ఒక్క ప్రశ్నకూ సమాధానం ఇవ్వలేదు. దీనిపై కేంద్ర సమాచార కమిషన్ కూడా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది.

ఇంత దారుణమా?

ఎన్నికల తరుణంలో కేంద్ర దర్యాప్తు సంస్థలు ప్రతిపక్ష నేతలకు నోటీసులు జారీ చేస్తున్నప్పటికీ ఈసీ వాటిని పరిగణనలోకి తీసుకోలేదు. ప్రధాని మోడీ ఏప్రిల్ 21న తన ఎన్నికల ప్రచారంలో ముస్లింలను కించపరిచేలా ప్రసంగించారు. అయినా ఈసీలో కదలిక లేదు. ప్రధాని పేరును ప్రస్తావించకుండా బీజేపీకి నోటీసు ఇచ్చి చేతులు దులుపుకుంది. ఉత్తరప్రదేశ్‌లో ప్రభుత్వ అధికారులే ఓటర్లను పోలింగ్ కేంద్రాల వద్ద అడ్డుకున్నారు. పోలింగ్ కేంద్రాలను స్వాధీనం చేసుకున్నారన్న ఆరోపణలు కూడా వచ్చాయి. ఎన్నికల ప్రక్రియనే అపహాస్యం చేస్తూ సూరత్‌లో కాంగ్రెస్ అభ్యర్థి నామినేషన్‌ను తిరస్కరించి, స్వతంత్ర అభ్యర్థులతో బలవంతంగా ఉపసంహరింపజేసి బీజేపీ అభ్యర్థి విజయం సాధించినట్లు ప్రకటించారు. ఇండోర్‌లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన వ్యక్తి తన నామినేషన్‌ను ఉపసంహరించుకొని బీజేపీలో చేరిపోయారు.

ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలకు సంబంధించి బీజేపీ నాయకుల విషయంలో చూసీ చూడనట్లు వ్యవహరిస్తూ ప్రతిపక్ష నేతలకు మాత్రం నోటీసులు జారీ చేస్తున్నారు. తొలి దశ పోలింగ్ జరిగిన 11 రోజుల తర్వాత ఓటింగ్ శాతాన్ని వెల్లడించారు. ఇంత జరుగుతున్నా ఈసీ తనకేమీ పట్టనట్లుగానే వ్యవహరిస్తోంది.



కేంద్ర హెూం మంత్రి అమిత్ షా పోటీ చేస్తున్న గాంధీనగర్ లోక్‌సభ స్థానంపై బీజేపీ శ్రేణులు 'భారీ' ఆశలే పెట్టుకున్నాయి. అమిత్ షా గెలుపును ముందుగానే ఊహించికుంటున్న ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు.. పది లక్షల మెజారిటీని టార్గెట్‌గా పెట్టుకున్నారు. అయితే, ఎన్నికలు, రాజకీయ విశ్లేషకులు మాత్రం ఇది అసాధ్యమని కొన్ని గణాంకాలను ఉదహరిస్తున్నారు.

గాంధీనగర్ సీటుపై బీజేపీ ఆశలు

కేంద్ర హెూం మంత్రి అమిత్ షా పోటీతో ప్రతిష్టాత్మకం

- ఇక్కడ ఉన్న ఓట్లు దాదాపు 25 లక్షలు
- ఓటింగ్ శాతం సగటున 55 శాతానికి తక్కువే

గత ఎన్నికల్లో కాంగ్రెస్‌కు వచ్చిన ఓట్లు 26 శాతానికి పైనే

- కాషాయపార్టీ చెప్తున్న భారీ మెజారిటీ అసాధ్యం
- ఎన్నికలు, రాజకీయ విశ్లేషకులు

గాంధీనగర్ : గుజరాత్‌లో మొత్తం 26 లోక్‌సభ స్థానాలున్నాయి. అన్నిటితో పాటు ఈ నియోజకవర్గానికి కూడా 7న మూడో దశలో భాగంగా ఎన్నికలు జరగనున్నాయి. కాగా, గాంధీనగర్ బీజేపీకి పట్టున్న సీటే అయినప్పటికీ.. ఈసారి తమకు గతంలో కంటే ఎక్కువ మెజారిటీ వస్తుందని బీజేపీ శ్రేణులు చెప్పుకుంటున్నాయి. తమకు ఇక్కడ పోటీయే లేదనీ, పది లక్షల మెజారిటీని సునాయాసంగా సాధించి అమిత్ షా ఇక్కడి నుంచి ఘన విజయం సాధిస్తారని బీజేపీ నాయకులు చెప్తున్నారు.



ఈ స్థానం మూడు దశాబ్దాలకు పైగా కమలం పార్టీదే

గుజరాత్‌లోని గాంధీనగర్ లోక్‌సభ స్థానం బీజేపీకి చాలా కీలకం. 1989 నుంచి ఆ పార్టీ ఈ సీటును గెలుచుకుంటూ వస్తున్నది. బీజేపీ వ్యవస్థాపక సభ్యుల్లో ఒకరైన మాజీ ఉప ప్రధాని, ఆ పార్టీ కురువృద్ధుడు ఎల్.కె అద్వానీ ఇక్కడ నుంచి ఆరు సార్లు ఎంపీగా గెలిచారు. 1996-98 మధ్య భారత మాజీ ప్రధాని, బీజేపీ అగ్రనాయకుడైన వాజ్‌పేయి సైతం ఆ స్థానం నుంచి ప్రాతినిథ్యం వహించారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఇక్కడ నుంచి పోటీ చేసిన అమిత్ షా.. 5 లక్షల పైచిలుకు ఓట్ల తేడాతో విజయం సాధించారు. అయితే, ఈ సారి మెజారిటీ పది లక్షల తేడాతో ఉండనున్నదని బీజేపీ ఆశలు పెట్టుకున్నది.

ఎట్టకేలకు బరిలో 14 మంది

ప్రస్తుతం గాంధీనగర్ లోక్‌సభ స్థానానికి మొత్తం 39 మంది నామినేషన్లు వేశారు. చివరకు 16 మంది అభ్యర్థులు తమ నామినేషన్లను వెనక్కి తీసుకోగా.. 9 మంది పత్రాలు తిరస్కరణకు గురయ్యాయి. దీంతో 14 మంది బరిలో ఉన్నారు. కాగా, నామినేషన్లు వెనక్కి తీసుకున్నవారిలో పది మంది బీజేపీ నుంచి వచ్చిన ఒత్తిళ్ల మేరకే వెనక్కి తగ్గామని చెప్పటం గమనార్హం. అయినప్పటికీ.. ఇటు పోలీసు అధికారుల నుంచి కానీ, అటు ఎన్నికల అధికారి నుంచి కానీ ఎలాంటి చర్యలూ లేవు. ఇలా పోటీ నుంచి తప్పుకున్న అభ్యర్థుల్లో ఒకరైన జితేంద్ర సింగ్ చౌహాన్.. తన జీవితం ప్రమాదంలో ఉన్నదని ఒక వైరల్ వీడియోలో ఆరోపణలు వినిపంచటం తెలిసిందే. ఆలిండియా పరివార్ పార్టీ తరఫున గాంధీనగర్ నుంచి పోటీలో ఉన్న ఈయన.. బీజేపీ నాయకులు, కార్యకర్తల నుంచి వచ్చిన ఒత్తిళ్ల మేరకే పోటీ నుంచి తప్పుకున్నట్టు వివరించాడు. మధ్యప్రదేశ్‌లోని భింద్‌కు చెందిన చౌహాన్ ఒక పెయింటర్. కాగా, వీడియో వైరల్ అయినప్పటి నుంచి తనకు పని దొరకటం లేదనీ, గతంలో కలిసి పని చేసినవారు కూడా ఫోన్లు ఎత్తటం లేదని ఆయన వాపోయాడు.

బీజేపీవి అనైతిక చర్యలు : కాంగ్రెస్

ఇక్కడ కాంగ్రెస్ ఎంతో కొంత ఓట్లను రాబట్టగలిగే స్థాయిలో ఉన్నా.. మరింత పోటీ ఇవ్వకపోవటానికి గల కారణం బీజేపీ అనైతిక చర్యలేనని ఆ పార్టీ అంటున్నది. " బీజేపీకి చాలా వనరులున్నాయి. హెూర్డింగ్‌లు, బ్యానర్‌లు ఏర్పాటు చేయటానికి బీజేపీ వారు ఎవరి దగ్గరి నుంచీ అనుమతి తీసుకోరు. మేము మాత్రం అనుమతి తీసుకోవాలి. హెూర్డింగ్‌లను ఏర్పాటు చేయటానికి ప్రజలు మాత్రమే కాదు.. కాంగ్రెస్ మద్దతుదారులు కూడా జంకుతున్నారు. ఇదే పెద్ద సమస్య" అని కాంగ్రెస్ అభ్యర్థి సోనాల్ పటేల్ తెలిపారు. ఒకవేళ కాదని ఎవరైనా ధైర్యం చేస్తే పోలీసుల నుంచి వారికి బెదిరింపు కాల్స్ వస్తాయని, ఇలా చాలా మంది కాంగ్రెస్ కార్యకర్తలు దీనిని ఎదుర్కొన్నారని వివరించారు.

సమావేశాలు ఏర్పాటు చేద్దామన్నా.. 'ఒత్తిళ్లే' కాంగ్రెస్ సేవాదళ్‌కు చెందిన ముకేశ్ మరు మాట్లాడుతూ.. "గాంధీనగర్‌లోని ఒక హాల్‌లో సమావేశం ఏర్పాటు చేద్దామనుకుంటే.. ఆ హాల్‌కు చెందిన యజమానిపై ఒత్తిళ్లు వచ్చాయి. దీంతో పార్టీ సమావేశాన్ని ఏర్పాటు చేయలేకపోయింది. ఆ తర్వాత రెండు హాల్‌లను సంప్రదించినా.. భయంతో ప్రతి ఒక్కరూ నిరాకరించారు. దీంతో సమావేశాన్ని మేము పార్టీ కార్యాలయంలో నిర్వహించాల్సి వచ్చింది" అని తెలిపారు.

కాంగ్రెస్ నుంచే ప్రధాన పోటీ



ఈ స్థానం నుంచి పలు పార్టీలకు చెందినవారు 14 మంది బరిలో ఉన్నప్పటికీ.. బీజేపీకి ప్రధానంగా పోటీ ఉన్నది మాత్రం కాంగ్రెస్ నుంచే. ఇక్కడ హస్తం పార్టీ నుంచి సోనాల్ పటేల్ ఉన్నారు. 2019 ఎన్నికల్లో అప్పటి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఛతుర్‌సిన్హ్ జవాన్జీ చవ్‌డా 26 శాతానికి పైగా ఓట్లను సాధించగలిగారు. అయితే, ఇక్కడ కాంగ్రెస్ కొంత వరకు బలంగానే ఉన్నది. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో బీజేపీ చెప్తున్న 10 లక్షల మెజారిటీ మాట సాధ్యం కాని విషయమని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. పైగా నియోజకవర్గంలో ఉన్నది దాదాపు 25 లక్షల ఓటర్లనీ, సగటు ఓటింగ్ 55 శాతం కంటే తక్కువగా ఉంటుందనీ, అలాంటపుడు అంత భారీ మెజారిటీ ఆశ అనేది ఒక ప్రచారం మాత్రమేనని విశ్లేషకులు చెప్తున్నారు.

మితిమీరుతున్న విష ప్రచారాలు

సోషల్ మీడియాలో హద్దులు దాటుతున్న బీజేపీ తీరు

రిజర్వేషన్ అంశంపై ఒక వర్గాన్ని టార్గెట్ చేస్తూ వివాదాస్పద పోస్టు
ఎక్స్‌లో పోస్ట్ చేసిన బీజేపీ కర్నాటక యూనిట్
కమలం పార్టీ తీరుపై నెటిజన్ల తీవ్ర ఆగ్రహం



బెంగళూరు : లౌకిక భారతదేశంలో బీజేపీ మత పిచ్చిని రేపుతున్నది. లోక్‌సభ ఎన్నికల్లో ఒక అజెండా అంటూ లేకుండా.. కేవలం మతాల మధ్య విద్వేషాలు రగిలేలా బీజేపీ ప్రచారం చేస్తున్నది. బహిరంగ సమావేశాలైనా, బహిరంగ సభలైనా విభజనవాదాన్ని మాత్రమే ఆ పార్టీ వినిపిస్తున్నది. ప్రధాని మోడీ, కేంద్ర హెూం మంత్రి అమిత్ షా మొదలు కింది స్థాయి నాయకులు, కార్యకర్తల వరకు కూడా ఇదే తీరును పాటిస్తున్నారు. బీజేపీ చేస్తున్న ప్రచారతీరుపై ఇప్పటికే సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆ పార్టీ తీరులో మాత్రం మార్పు కనిపించటం లేదు.

కర్నాటకలో మతం ఆధారంగా ఒక వర్గాన్ని అక్కడి కాంగ్రెస్ ప్రభుత్వం ఓబీసీ కేటగిరిలో చేర్చిందని బీజేపీ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నది. ఇది అసలైన ఓబీసీల రిజర్వేషన్‌ను దెబ్బతీస్తుందని ఆరోపిస్తున్నది. అయితే, ఆ వర్గాన్ని కాంగ్రెస్ తీవ్రంగా బుజ్జగిస్తున్నదనీ, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్లకు భంగం కలిగేలా ఆ వర్గాన్ని అక్కున చేర్చుకుంటున్నదనే అర్థం వచ్చేలా కర్నాటక కాంగ్రెస్ యూనిట్ తన అధికారిక 'ఎక్స్' ఖాతాలో ఒక వీడియోను పోస్ట్ చేసింది.


వివాదాస్పద వీడియోలో ఏమున్నది?

ఈ వీడియోలో ఉన్న కంటెంట్‌ను బట్టి చూస్తే.. ఒక గూడులో మూడు గుడ్లు ఉంటాయి. ఒక్కో గుడ్డు పైన ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలు అని రాసి ఉంటుంది. అయితే, ఆ గూడులో ఉన్న మూడు గుడ్లకు అదనంగా కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ, కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యలు మరొక గుడ్డును అదనంగా తెచ్చి వేస్తారు. ఆ గుడ్డుపై ఒక మతానికి చెందిన పేరు ఉంటుంది. తర్వాత ఆ నాలుగు గుడ్ల నుంచి వచ్చిన పిల్లల్లో ఒకదానికి 'ఒక మతం'ను సూచించేలా నెత్తిన టోపీ ఉంటుంది. సిద్ధరామయ్యతో కలిసి వచ్చిన రాహుల్ గాంధీ ఆ మతానికి చెందిన పక్షికి మాత్రమే 'నిధుల'తో పోషిస్తున్నట్టు కనిపిస్తుంది. ఆ తర్వాత ఆ పక్షి ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ గుడ్ల నుంచి పొదిగిన పక్షి పిల్లలను ఆ గూడు నుంచి తోసేయటం, రాహుల్ గాంధీ, సిద్ధరామయ్య పాత్రలు నవ్వటం కనిపిస్తుంది.

వివాదాస్పద పోస్ట్‌పై కాంగ్రెస్ ఫిర్యాదు

ఇటు ఈ అంశంపై కాంగ్రెస్ కూడా స్పందించింది. బీజేపీ జాతీయాధ్యక్షుడు జె.పి నడ్డా, ఆ పార్టీ ఐటీ విభాగం ఇంఛార్జ్ అమిత్ మాల్వియా, బీజేపీ రాష్ట్రాధ్యక్షుడు బి.వై విజయేంద్రలపై కాంగ్రెస్ ఫిర్యాదు చేసింది. మతాల మధ్య విద్వేషాన్ని రగిల్చేలా, శతృత్వాన్ని పెంపొందించేలా బీజేపీ పోస్ట్ ఉన్నదని కాంగ్రెస్ ఆరోపించింది. బీజేపీ వీడియో ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించిందని తెలిపింది. మైనారిటీలను ఈ విధంగా చిత్రీకరించే బీజేపీ పోస్ట్ ఆమోదయోగ్యం కాదని కాంగ్రెస్ నాయకుడు మానిక్కం ఠాగోర్ అన్నారు.

దేశం బీజేపీకి తగిన పాఠం నేర్పుతుంది : ప్రకాశ్‌రాజ్




ఈ వివాదాస్పద పోస్టుపై పలువురు ప్రముఖులు, నెటిజన్లు సోషల్ మీడియా వేదికగా తీవ్రంగా స్పందిస్తున్నారు. ఒక మతానికి చెందినవారిపై చెడు అభిప్రాయం వచ్చేలా బీజేపీ షేర్ చేసిన వీడియో ఉన్నదనీ, ఇలాంటి చర్యలు సమాజానికి శ్రేయస్కరం కావని మేధావులు అన్నారు. అసహ్యమైన, ద్వేషాన్ని వ్యాప్తి చేస్తున్న, మత రాజకీయాలు చేస్తున్న హిందూత్వ పార్టీకి కర్నాటక, దేశం తగిన సమాధానం చెప్తుందని ప్రముఖ నటుడు ప్రకాశ్‌రాజ్ ఆరోపించారు. బీజేపీ వీడియోను 'సిగ్గులేని' పోస్ట్‌గా ఆయన అభివర్ణించారు. బీజేపీ షేర్ చేసిన వీడియో అనేది ఎన్నికల కోడ్ ఉల్లంఘన కాకపోతే కోడ్‌నే రద్దు చేయాల్సిన అవసరం ఉంటుందని విశ్లేషకులు, రాజకీయ వ్యాఖ్యాత సుమంత్ రామన్ ఆరోపించారు. బీజేపీ చర్య అవమానకరమైనదిగా అభివర్ణించారు.

ఛత్తీస్‌గఢ్‌లో ఎదురుగాలి

ఆదివాసీల అణచివేత...మావోయిస్టుల ఎన్‌కౌంటర్లు

అదానీ కోసం లక్షల చెట్ల నరికివేత
వనరులపై కార్పొరేట్ల పంజా
ఈసారి బీజేపీకి షాకే..: కాంగ్రెస్‌కు రాహుల్ జోడో యాత్ర మేలు
రేపు 7 స్థానాల్లో పోలింగ్







రాయపూర్ : ఛత్తీస్‌గఢ్‌లోని మొత్తం 11 నియోజకవర్గాల్లో దేశ వ్యాప్తంగా ఏప్రిల్ 26న జరిగిన రెండవ దశలో 4 స్థానాల్లో ఎన్నికలు జరిగాయి. మిగిలిన ఏడు సీట్లకు మూడో విడతలో మే 7న పోలింగ్ జరగనుంది. జాంజ్‌గీర్, బిలాస్‌పుర్, కోర్బా, రాయ్‌గఢ్ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ బలంగాఉంది. బీజేపీ హిందుత్వ రాజకీయాలను, కార్పొరేటీకరణకు గిరిజనులు వ్యతిరేకిస్తున్నారు. రాజధాని రాయ్‌పూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ నుంచి వికాస్ ఉపాధ్యయ్‌కు పోటీగా బిజెపి అభ్యర్థి బ్రిజ్‌మోహన్ అగర్వాల్ పోటీ పడుతున్నారు. ఈసారి బీజేపీ సిట్టింగ్ ఎంపీ సునీల్ సోనీని మార్చేసి సీనియర్ ఎంఎల్ఎ అగర్వాల్‌కు ఇచ్చింది. ఈ స్థానంలో ఏడుసార్లుగా బీజేపీ గెలుస్తోంది. స్టీల్, ఇనుము, పరిశ్రమల కార్మికులు ఎక్కువగా ఉన్నారు. మూడు లక్షల మంది ఎస్సీలు, 1,28 లక్షలమంది ఎస్టీలు ఉన్నారు. ఇక్కడ 11.29 లక్షల పట్టణ ఓటర్లే కీలకం. దుర్గ్ లోక్‌సభ స్థానంలో ఒకసారి కాంగ్రెస్, మరోసారి బిజెపి గెలుస్తున్నాయి. దుర్గ్ పరిధిలోని 9 అసెంబ్లీ స్థానాల్లో కాంగ్రెస్ 8, బీజేపీ ఒకటి గెలిచాయి. దుర్గ్ ప్రాంతానికి దగ్గరలోనే బిలాయ్ స్టీల్ ప్లాంట్ ఉంది. రాష్ట్రంలో అభివృద్ధి చెందిన నగరాల్లో దుర్గ్ ఒకటి. కాంగ్రెస్ నుంచి రాజేంద్ర సాహుకు పోటీగా బిజెపి సిట్టింగ్ ఎంపీ విజయ్ బఘెల్ పోటీపడుతున్నారు.

మతతత్వానికి బీజేపీ పదును

ఆదివాసీ ప్రాబల్యమున్న జాంజ్‌గీర్ ఎస్సీ రిజర్వుడు సీటు. కాంగ్రెస్ నుంచి శివ్‌కుమార్ డహ్రియా, బీజేపీ నుంచి కమలేశ్ జంగడే తలపడుతున్నారు. గత ఎన్నికల్లో బీజేపీ గెలుపొందింది. రాహుల్ జోడో యాత్ర ఛత్తీస్‌గఢ్‌లో జాంజ్‌గీర్ నుంచే ప్రారంభమైంది. గిరిజనులు కాంగ్రెస్ వైపు మొగ్గు చూపుతున్నారు. మోడీ పర్యటనలో భాగంగా ఏప్రిల్ 23న జంజ్‌గిర్-చంపాలో జరిగి న ర్యాలీలో రామనామి తెగ మత పెద్దలను (ముఖంపై రామనామ ం పచ్చబొట్టు వేయించుకున్నవా రు) మోడీ తన పక్కనే కూర్చోబెట్టుకోవడం, అయోధ్యలో బాలరాముని ప్రాణప్రతిష్ఠ ఆహ్వానాన్ని కాంగ్రెస్ తిరస్కరించడం రాముడి తల్లి ఇలాకా అయిన ఛత్తీస్‌గఢ్‌కు అగౌరవం కాదా అని మోడీ చేసిన వ్యాఖ్యలు మతతత్వ రాజకీయాలకు అద్దంపడుతున్నాయని విశ్లేషకులు అంటున్నారు. క్రైస్తవ మిషనరీల ముసుగులో మతమార్పిడిలకు పాల్పడుతున్నారని బిజెపి సిఎం స్వయంగా ఆరోపించారు. రాయగఢ్‌లో గోండు గిరిజనుల ప్రాబల్యమెక్కువ. ఎస్టీలకు రిజర్వ్ చేయబడిన ఈ స్థానంలో కాంగ్రెస్‌కు పట్టుంది. కాంగ్రెస్ సిట్టింగ్ ఎంపీ పుష్పాదేవికి బదులు ఆమె చెల్లి మేనకా దేవికి టిక్కెట్టు దక్కింది. మేనకా తండ్రి రాజానరేష్ చంద్రసింగ్ మధ్యప్రదేశ్ కాంగ్రెస్ సీఎంగా, మంత్రిగా పనిచేశారు. బిజెపి నుంచి రాధేశ్యాం రాఠియా పోటీ చేస్తున్నారు.

బొగ్గు కాలుష్య సమస్య

దేశంలోనే అత్యధిక బొగ్గు ఉత్పత్తి జరిగే జిల్లా కోర్బాలో మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు. పోటీ కూడా మహిళల మధ్యే నడుస్తోంది. కాంగ్రెస్ అభ్యర్థి జోత్స్న మహం త్‌కు పోటీగా బీజేపీ అభ్యర్థి సరోజ్ పాండే పోటీ పడుతున్నారు. ఈ నియోజకవర్గంపై కాంగ్రెస్‌కు పట్టుంది. 2014 మినహా ప్రతిసారీ కాంగ్రెస్ గెలుపొందుతోంది. సరోజ్‌పాండే రాజ్యసభ సభ్యురాలు, గతంలో దుర్గ్ నుంచి ఎంపిగా ఎన్నికయ్యారు. బొగ్గు గనుల నుంచి వచ్చే దుమ్ము వల్ల పర్యావరణ కాలుష్యం, గనుల కోసం భూములిచ్చిన వారికి పరిహారం, ఉద్యోగ కల్పన వంటి స్థానిక సమస్యలున్నాయి.

అదానీ చెట్ల నరికివేతపై వ్యతిరేకత

బిలాస్‌పుర్‌లో కాంగ్రెస్ నుంచి దేవేంద్ర యాదవ్‌కు పోటీగా బీజేపీ అభ్యర్థి తోఖన్‌సా హు బరిలో నిలిచారు. దేవేంద్ర యాదవ్ బిలాయ్ నగర్ ఎమ్మెల్యేగా గెలుపొందారు. అయితే ఈ టిక్కెట్ జగదీష్ కౌశిక్ తనకు కేటాయించాలని కోరినప్పటికీ దేవేంద్రకే సీటు దక్కింది. దేవేంద్ర యాదవ్ దేశంలోనే అతి చిన్న వయస్సులో 25 ఏండ్లకే మేయరుగా ఎన్నికయ్యారు. ఈ ప్రాంతంలోనూ రాహుల్ పర్యటించారు. సర్గుజా ఎస్టీ రిజర్వ్‌డ్ స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థి గోండ్ వర్గానికి చెందిన యువనాయకురాలు శశి సింగ్‌తో బిజెపి అభ్యర్థి చింతామణి మహారాజ్ పోటీ పడుతున్నారు. 2023లో చింతామణి కాంగ్రెస్ నుంచి బీజేపీ లోకి చేరడంతో ఆయనకు ఈ సీటు దక్కింది. అదానీ గ్రూపు బొగ్గు గనుల కోసం 2 లక్షలకు పైగా చెట్ల నరికివేత బిజెపి ప్రభుత్వం పట్ల స్థానిక ప్రజలు వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారు.

- గిరిజన హక్కులను కాలరాసి కార్పొరేట్ ప్రయోజనాల కోసం బీజేపీ పనిచేస్తోంది. కార్చిచ్చులు పేరిట, మైనింగ్ ప్రాజెక్టుల కోసం అరణ్యాలను కరిగించేస్తోంది. నీరు, అరణ్యం, భూముల కోసం ఆదివాసీల ఆందోళనలను రాష్ట్ర బీజేపీ ప్రభుత్వం అమానుషంగా అణచివేస్తోంది.
- రెండేండ్లలో నక్సలైట్లను ఏరిపారేస్తామన్న కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ప్రకటనను రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తోంది. ఏప్రిల్ 16న 29 మంది, 30న 10 మంది మావోయిస్టులను భద్రతా బలగాలు ఎన్‌కౌంటర్ చేశాయి. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు 91 మంది మావోయిస్టులు పోలీస్ కాల్పుల్లో చనిపోయారు. 123 మంది అరెస్టు కాగా, 250మంది లొంగిపోయారు. లోక్‌సభ ఎన్నికలపై ఈ పరిణామాల ప్రభావం పడుతుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

స్మృతి ఇరానీని ఓడించడం ఖాయం : కెఎల్ శర్మ

అమేథీ : కాంగ్రెస్ పార్టీ ఎన్నోరోజులు చర్చలు జరిపి అమేథీ, రాయ్‌బరేలీ నియోజకవర్గాలకు అభ్యర్థులను ఖరారు చేసింది. రాయ్‌బరేలీ నుంచి రాహుల్ గాంధీ, అమేథీ నుంచి కిశోరీలాల్ శర్మ పోటీ చేస్తున్నారు. అమేథీ నుంచి బరిలోకి దిగిన కెఎల్ శర్మ మీడియాతో మాట్లాడుతూ.. 'ఈ ఎన్నికల్లో స్మృతి ఇరానీని ఓడించడం ఖాయం. ఇది నేను చేస్తున్న పెద్ద ప్రకటన. నేను అమేథీ నుంచి పోటీ చేయడమనేది అధిష్టానం నిర్ణయం.' అని అన్నారు. కాగా, కెఎల్ శర్మ 1983లో రాజీవ్ గాంధీతో కలిసి పనిచేశారు. 1991లో రాజీవ్ గాంధీ తర్వాత కెప్టెన్ సతీష్ శర్మతో కలిసి అమేథీలో పనిచేశారు. ఆ తరువాత సోనియాగాంధీ 1999లో అమేథీ నుంచి పోటీ చేసినప్పుడు ఆ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌గా పనిచేశారు. ఆ తర్వాత రాయ్‌బరేలీ, అమేథీ రెండుస్థానాలకు ఆయన ఇన్‌ఛార్జిగా వ్యవహరించారు. గాంధీయేతర కుటుంబ సభ్యులు అమేథీ నియోజకవర్గం నుంచి పోటీ చేయడం ఇది రెండోసారి. గతంలో 1991లో ఈ స్థానం నుంచి సతీష్ శర్మ లోక్‌సభకు ఎన్నికయ్యారు.

లౌకిక దేవాలయం కోసం

కూలి పోయిన గోడల మధ్య
నేనూ, ప్రజాస్వామ్యం నివాసముంటున్నాం
నెత్తిన ఆకాశమే పైకప్పు
సముద్రం ఆటుపోట్ల మధ్య
తూట్లు పడ్డ పడవలో మా ఉనికి
ఒకే బోనులో పులిని,
మేకను కట్టేసినట్లుంది
ఈదురు గాలులు,
వడగాడ్పుల మధ్య
మేం కాపురంలో
వున్నాం చీకిపోయిన
నూలుపోగులతో
సమాన హక్కుల శాలువా
నేయబడుతూనే వుంది
చిరుగులపై అతుకులు,
చింపుతూ నేస్తూనే వున్నారు
అతుకుల బొంతగా మార్చే ప్రయత్నం ఆగటం లేదు
శిధిలాల మధ్య మా కాపురం!
దీపం రెపరెపల మధ్య నిండు జీవితాలు
ప్రజాస్వామ్య ఉనికి మినుకు, మినుకు మంటుంది
నిందలు, అపనిందలు వీడి
ఆరోపణ, ప్రత్యారోపణలకు స్వస్తిపలికి
వెలుగు చీకట్ల మధ్యైనా సరే రా నేస్తం
మానవ హారంగా ఓ వంతెనను నిర్మిద్దాం
అటునుంచి నువ్వు, ఇటు నుంచి నేను కదిలి
భారతీయ ఆత్మను మన కలయిక చిహ్నంగా
లౌకిక దేవాలయం నిర్మిద్దాం



- హనీఫ్, 9247580946

సాహితీ వార్తలు

ఆహ్వానం

ఈ నెల 12వ తేదీ సాయంత్రం 5 గంటలకు హైదారబాద్ జూబ్లీహిల్స్‌లోని ముప్పవరపు వెంకయ్య నాయుడు స్వగృహంలో చెన్నమనేని రంగనాయకమ్మ స్మారక విశిష్టాద్వైత జాతీయ సాహిత్య పురస్కార సభ జరుగుతుంది. ఇందులో ముప్పవరపు వెంకయ్య నాయుడు, రేవూరి అనంత పద్మనాభరావు, శ్రీదేవి మురళీధర్, డా॥వైష్ణవ వేంకటరమణమూర్తి, గార రంగనాథం పాల్గొంటారు.

పెందోట సాహిత్య పురస్కారాలు

పెందోట సాహిత్య పురస్కారాలకై 2023 సంవత్సరములు ముద్రితమైన 1. పద్య కావ్యాలు, 2. వచన కవిత సంపుటాలు 3. కథా సంపుటాలు 4. బాలకథ సంపుటాలు, 5 బాలగేయ సంపుటాలు, 6. బాల కవిత,గేయ, కథా సంకలనాలను రెండు ప్రతులను ఈ నెల 15వ తేదీలోపు 'ఇంటి నంబరు 17-128/3, శ్రీనగర్ కాలనీ, సిద్దిపేట-502103' చిరునామాకు పంపాలి. జూన్ నెలలో శ్రీ వాణి సాహిత్య పరిషత్ పదవ వార్షికోత్సవ సభలో నగదు బహుమతి, శాలువా, ప్రశంసా పత్రం ఇవ్వబడును

- పెందోట వెంకటేశ్వర్లు, 9440524546

గీతమ్ పురస్కారం కొరకు...

గీతమ్ సంస్థ పన్నెండవ వార్షికోత్సవం సందర్భంగా ఉత్తమ కవితా సంపుటాల పోటీ నిర్వహిస్తున్నారు. అత్యుత్తమ సంపుటికి 10116/- రూపాయలు, జ్ఞాపికతో పురస్కారం వుంటుంది. 2016 నుండి 2024 మధ్య కాలంలో విడుదలైన సంపుటాల 3 కాపీలు 'అధ్యక్షులు, గీతమ్ సాహితీ సంస్థ, పిఠాపురం - 533450' చిరనామాకు జూన్ నెలలోపు పంపాలి. వివరాలకు : 9848398240.

రేపటి సమాజానికి నేటి భరోసా



- ఒద్దిరాజు ప్రవీణ్ కుమార్
98490 82693

మహాకవి శ్రీశ్రీ 114వ జయంతిని, కార్మిక దినోత్సవం మేడేను పురస్కరించుకుని తెలంగాణ సాహితి ఏప్రిల్ 30న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన శ్రామిక కవి సమ్మేళనం వర్తమానంలోని మతోన్మాద చర్యలను నిరసిస్తూ, ప్రజలు కలలుకంటున్న ప్రజాతంత్ర సమాజాన్ని హామీ ఇచ్చింది. మనుషులను మనుషులుగా కాకుండా కులాలుగా, మతాలుగా చూసే రోజు వచ్చిందని విచారం వ్యక్తం చేశారు అధ్యక్షత వహించిన ఏబూషి నర్సింహ. **"చీమలకు చక్కర వేసి - పాములకు పాలుపోసిన దయగల దేశం మనదేనా!? మరి మూకదాడులతో హింసోన్మాదం సృష్టిస్తున్నం ఎందుకనీ? ఎందుకనీ?? పిల్లలూ దేవుడూ చల్లని వారని పాట పాడుకున్నోళ్ళం - మరి పిల్లల తల్లుల చెరిపి చంపుతె చూసి మాట్లాడ వెందుకనీ !? ఎందుకనీ!??"** అంటూ వారు రాసి పాడిన పాట మతోన్మాద శక్తులను గల్లాపట్టి ప్రశ్నించింది.

"రెండు రెళ్ళు నాలుగన్నందుకు/ గుండాలు గంగ్రాళ్ళు విసిరే సీమలో/ క్షేమం అవిభాజ్యం అంటే/ జైళ్ళు నోళ్ళు తెరిచే భూమిలో నే మనం ఇంకా ఉన్నాం" అంటూ - మనం నిజాలు మాట్లాడుతుంటే మన మీద నిప్పుల వర్షం కురిపిస్తున్న ఫాసిస్టు శక్తులకు వ్యతిరేకంగా మనం పెద్ద యుద్ధమే చేయాల్సి ఉందంటూ ఈ సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన కవి యాకూబ్ పిలుపు నిచ్చారు. మన చుట్టూ ఉన్న మనుషులను మనం మనుషులుగా కాకుండా వారి వేషధారణను బట్టి అనుమానించే రోజులు రావడం మన భారత రాజ్యాంగాన్ని అవహేళన చేయడమేనని నిరసించారు. ఈ సభకు విశిష్ట అతిథిగా వచ్చిన మహెజబీన్ 'పౌరసత్వం అపహాస్యం చేయబడుతున్న వేళ/ Fundamental rights ఏం చేసుకోను?' ప్రశ్నే దేశ ద్రోహమవుతున్న వేళ నేను అస్తిత్వ వేదనా కెరటమై ఎగిసిపడక తప్పదంటూ మన పాలకుల అప్రజాస్వామిక ధోరణిపై ఆగ్రహ కవిత్వమై పోయారు. తెలంగాణ సాహితి రాష్ట్ర ప్రధానకార్యదర్శి కె.ఆనందాచారి మాట్లాడుతూ.. మార్క్స్ చెప్పిన సారాంశాన్నే శ్రీశ్రీ కవిత్వంగా అందించారని తెలిపారు. ఫాసిజం ప్రపంచమంతా, ముఖ్యంగా మన దేశంలో విస్తరించేందుకు యత్నిస్తున్న తరుణంలో శ్రీశ్రీ కవిత్వం మరింత అవసరమని అన్నారు. మనుషులను విభజిస్తున్న ఈ పరిస్థితిలో వర్గ సంఘర్షణతోనే మనిషి మనిషిగా మారతాడని తెలిపారు. హిందూ ముస్లీం ఘర్షణ జరిగిన ముజఫర్‌నగర్‌లో రైతు ఉద్యమంతో వర్గ సంఘర్షణ వారిని కలిపిందని చెప్పారు. అలాంటి సంఘ ర్షణకు ఉత్సాహమిచ్చే కవిత్వం రావాలని ఆకాంక్షించారు. సంపద సృష్టికర్తలు శ్రామికులేననే విషయాన్ని జగమంతా చెప్పాలని పిలుపునిచ్చారు.

సుమారు 30 మంది కవులు పాల్గొన్న ఈ సమ్మేళనం దేశంలోని అసమానత్వాన్ని ప్రశ్నించింది. భారత రాజ్యాంగ పరిరక్షణ ఆవశ్యకతను నొక్కి చెప్పింది. మనుషుల మధ్య ఉండాల్సిన స్నేహ సంబంధాలు మతం ఎగదోస్తున్న మంటల్లో సజీవంగా ఆహుతి అవుతున్న దుఃఖ సమయానికి విచారం వ్యక్తం చేసింది. కార్మికుల, కర్షకుల స్వేద దరహాసాన్ని ఆవిష్కరించింది. ఏప్రిల్ 28న కాకతీయ యూనివర్సిటీలో సమూహ సమావేశంపై జరిగిన దాడిని సమ్మేళనం తీవ్రంగా ఖండించింది.

35 మంది కవులు పాల్గొన్న ఈ సమ్మేళనం దేశంలోని అసమానత్వాన్ని ప్రశ్నించింది. భారత రాజ్యాంగ పరిరక్షణ ఆవశ్యకతను నొక్కి చెప్పింది. మనుషుల మధ్య ఉండాల్సిన స్నేహ సంబంధాలు మతం ఎగదోస్తున్న మంటల్లో సజీవంగా ఆహుతి అవుతున్న దుఃఖ సమయానికి విచారం వ్యక్తం చేసింది. కార్మికుల, కర్షకుల స్వేద దరహాసాన్ని ఆవిష్కరించింది. ఏప్రిల్ 28న కాకతీయ యూనివర్సిటీలో సమూహ సమావేశంపై జరిగిన దాడిని సమ్మేళనం తీవ్రంగా ఖండించింది.

"ముళ్ళ మధ్య గులాబి పువ్వులాంటి సున్నితత్వం కార్మికుల నైపుణ్యం" అంటూ ఆలోచించదగిన కవిత వినిపించారు హనీఫ్. "స్వేదం అంటని పద్యాలకు పాదాలుండవు రెక్కలు తప్ప" అంటూ కోట్ల వెంకటేశ్వరరెడ్డి తన కవితలో ఉదయాస్తమయాల ఉనికిని ఎరుక చెప్పారు. "పని పొగరు నా నెత్తిమీద రుమాలుకు నెమలీక రంగులద్ది నాట్యమాడుతది" అంటూ డా. రూప్ కుమార్ డబ్బీకార్ రాసిన కవితలో ప్రభుత్వం ఇచ్చే ఉచిత పథకాల కన్నా పని చేసుకొని బతకడమే మాకు గౌరవంగా ఉందంటూ శ్రమజీవుల అంతరంగాన్ని ఆవిష్కరించారు. "ప్రపంచీకరణ చంపుడు పందెంలో కుల వృత్తుల ఉనికే తీరని ప్రశ్న" అంటూ మండల స్వామి రాసిన కవిత పనిముట్లకు పదునెక్కించిన వృత్తి కార్మికుల దైన్య స్థితికి అద్దం పట్టింది. "ఎర్రటి ఎండల్లో నక్షత్రాల్లా మెరుస్తున్నారు కార్మికులు" అంటూ భాగ్య మంచి కవిత వినిపించారు.

"అవును. అతను మళ్ళీ ఈ దారిలోనే వస్తాడు. అతనికి స్వాగతం చెప్పేందుకు కొన్ని కొత్త పిడికిళ్ళను పోగేయాలి" అంటూ రేపటికి భరోసా కలిగించే కవిత్వం డా.చెమన్ వినిపించారు. "అందమయిన వికృత ముఖ చిత్రం" ఎలా ఉందో జ్వలిత వినిపిస్తూ సమాజం కారుస్తున్న మొసలి కన్నీటిని బట్టబయలు చేశారు. "రాతి గోడలు, ముళ్ళ పొదల్లోని నిగూఢ రహస్యాలను, నిషేధించిన స్వప్నాలను" సి.హెచ్. ఉషారాణి తన కవితలో వినిపించారు. "మానవ సంబంధాలకు వ్యాపారపు రంగుపూసి/ దుఃఖపు వాకిలిలో చేరగిలపడ్డామ" అంటూ ఒద్దిరాజు ప్రవీణ్ కుమార్ మలినమైన మానవ సంబంధాల మడత పేచీని విప్పి చెప్పారు. "ప్రజాస్వామ్యం అంతా చిందర వందర గందరగోళమై శునకాలు చింపిన విస్తరి అయ్యింది" అంటూ మహేష్ దుర్గే తన కవితలో ఆవేదన వ్యక్తం చేశారు.

"మంచి మాటల నీతులు/ సమసమాజ నిర్మాణ రీతులు/ నీ కవితా జలపాతాలు/ కవీ, నీ గీతాలు" అంటూ డా. రాపోలు సుదర్శన్ శ్రీ శ్రీ పై కవిత వినిపిస్తే... "నీవెప్పుడూ/ నిప్పులు కక్కుతూ/ నింగికి ఎగిరే వాడివే/ నిప్పు కణికవై నిత్యం మాలో ప్రవహించే వాడివే" అంటూ నస్రీన్ ఖాన్ శ్రీశ్రీ ని మరోకోణంలో స్మరించుకున్నారు. ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న పరిణామాలు చూసి కవి ఎంత బలంగా ప్రభావితం అవుతాడో చెప్పడానికి ఎలాంటి సందేహం అవసరం లేదు. అలాంటి వారిలో శ్రీశ్రీ కూడా అందుకు మినహాయింపు కాదు. అలాంటి కవి అవసరం నేడే ఎక్కువగా ఉంది. నేడు దేశంలో చోటు చేసుకుంటున్న పరిణామాలను అర్థం చేసుకొని ప్రభావవంతమైన కవిత్వం రాయడం, తద్వారా సమాజాన్ని చైతన్యం చేయాల్సిన అవసరం వర్తమాన కవులపై, మరి ముఖ్యంగా యువతపై ఉందని ఈ సమ్మేళనం అభిప్రాయపడింది. ఇంకా ఈ సమ్మేళనంలో కందుకూరి శ్రీరాములు, నాంపల్లి సుజాత, దాసరి మోహన్, కుడికాల వంశీధర్, ఉప్పల పద్మ, కొండా రవీంద్ర, ముజాహిద్, అశోక్ దుర్గం వారి వారి కవితలను వినిపించారు.





నెలపొడుపును తుంచటమే

చెట్టు పుట్ట గట్టులా
మందిర్ మసీదు చర్చీలు
చెలిమెలు నదులు సముద్రాలలా
రంగురంగుల పూలసమ్మేళనంలా భిన్నత్వంలో ఏకత్వం
ఆలయాలు మతప్రబోధకులెందరున్నా
అన్నం పెట్టేది రైతన్నలే గాయమైతే అమ్మనే తలిచేది
ఓదార్చేది అమ్మనే బతుకు దారి చూపేది నాన్ననే!
లేని జన్మల కోసం పాకులాడి
స్వర్గంకోసమని చెడ్డదారులకు సున్నమేయకు
సహృదయంతో హరితగీతమై ప్రతిధ్వనించు
చేతులుంటే అశోకుడులా చెట్లు నాటు
నిందితుడు నవ్వడం కాదు
సామాన్యుడు నక్షత్రమై మెరువాలి
దేవుడు ఊరేగడము కాదు
మానవుడు మహాత్ముడై నడువాలి
దారిదప్పిన ఆలోచనలకు చరమగీతమై
సామాజిక ధర్మధ్వజం ఎగురవేయ్
ద్వేషంతో అవమానించకు
భారతప్రజల చెమటతడుల సమ్మేళనమే భారత రాజ్యాంగం
అమ్మనాన్నలు కలిసి రాసిన రాజ్యపత్రం
నిచ్చెనకెన్ని మెట్లో అన్ని అవమానాలు
భూమికెన్నీ గాయాలో అన్ని అణచివేతలు
పీడితుల కన్ని దుఃఖాలు
సమతను తలపాగగా మనవత్వాన్ని శిఖరం చేశాడు
ప్రజాస్వామ్యాన్ని ఆకాశంగా స్వేచ్ఛను
హిమాలయం చేశాడు
ఓటు సకలజనుల హక్కుగా
సామాజిక న్యాయపు బావుటాగా
అస్తిత్వ చైతన్యపు జెండను ఎగరేసినందుకేనా రాజ్యాంగంపై
బుద్ధిలేని కూతలు
పెట్టుబడుల గారడీలతో అడుగడుగు విద్వేషపు కత్తులై
ఊపిరినలిపె అరాచకాలు
భూగోళం వంటినిండా కురుపులు
గోవుమాంసపు యజమానులతో
ఎలక్టోరల్ బాండ్ల స్వైరవిహారాలు
సరిహద్దుల్లో నెత్తురు పండుగకాదు
సర్వప్రాణులపై ప్రేమను పంచు
నీ ఆశయం సూర్యుడైతే దారులన్ని వెలుగుచెయ్
పవిత్ర భూమిగ్యనదులు
అద్భుత స్వయంభూ ఆలయాలు
రుషితుల్యులు త్యాగ ధనులు నడయాడిన నేలన
రక్తాభి షేకాలేమిటి
పంట రాశుల సంకల్పాలు చెదలుపట్టి
ఢిల్లీలో రైతుల తండ్లాటలేమిటి
భక్తి ప్రబోధాలన్నీ బండల పాలా
మణిపూర్ ను మంట పెట్టడం
చందమామను కాల్చుకు తినటమే
సెక్యులరిజాన్ని చెరిపేయటం
నెలపొడుపును తుంచటమే
లౌకిక వాదమే ఈ దేశ తిలకం
భారత రాజ్యాంగమే ఈ దేశపు గుండె

- వనపట్ల సుబ్బయ్య, 9492765358

ఒక ఉద్యమకారుడి ముచ్చట

భారత విప్లవ చరిత్రలో రైతాంగ పోరాటాలతో పాటుగా కార్మిక పోరాటాలకు కూడా మహెూన్నతమైన స్థానం ఉన్నది. అలాంటి చారిత్రక ఘటనల్లో తెలుగు నేల మీద తనదంటూ ఒక పోరాటాన్ని, ధిక్కారాన్ని చరిత్రలో బదిలీపరచుకున్నది సింగరేణి.

ఉమ్మడి కరీంనగర్, వరంగల్, ఆదిలాబాద్, ఖమ్మం జిల్లాలో విస్తరించిన సింగరేణి బొగ్గుగనులోని కార్మికుల జీవితాలు దుర్భరంగా ఉండేవి కనీస హక్కులు అమలు కానీ అలాంటి యాజమాన్య నియంతత్వం నుండి కార్మికులను విముక్తి చేసే దిశగా జరిగిన పోరాటాలు చెప్పుకోదగ్గవి.

సింగరేణి కార్మికుల పోరాటం కేవలం కార్మికుల హక్కుల కోసం, హక్కుల సాధన కోసం మాత్రమే జరిగిన పోరాటంగా కాక భారతదేశ ఆర్థిక విధానాల పైన సామాజిక రుగ్మతల పైన పోరాడినటువంటి చరిత్ర సింగరేణి కార్మికులకు ఉన్నది.

సింగరేణి బొగ్గు గనుల్లో ఉద్యోగిగా చేసి కార్మికుల హక్కుల కోసం పోరుబాటను ఎంచుకొని లాకప్పులు, పోలీసు చిత్రహింసలను, జైలు జీవితాన్ని, అజ్ఞాత జీవితాన్ని అనుభవించి ఆనాటి కాలానికి, పోరాట ఘట్టాలకు సాక్షి భూతమైన ఒక ఉద్యమకారుడు రాసిన తన స్వీయ జీవితమే "బొగ్గు రవ్వలు" పుస్తకం.

ప్రపంచ పోరాటాల చరిత్రలో ఉద్యమకారుడే స్వయంగా రచయితగా మారి రాసిన అనుభవాలను పుస్తకంగా తెచ్చిన వారు చాలా తక్కువగా కనిపిస్తారు.

అలాంటి బహు అరుదైన ఉద్యమ రచయితలలో గురిజాల రవీందర్ ఒకరు. ఇక్కడ విశేషమేమంటే రవీందర్ మొదటి నుండి రచయిత కాదు. గతంలో ఎలాంటి పుస్తకాలను ఆయన రాయలేదు. కానీ తాను చూసిన తాను భాగస్వామ్యమైన ప్రజా పోరాట కాలాన్ని అక్షరబద్ధం చేయడానికి ఆయన రచయితగా మారవలసిన అనివార్య స్థితిలోంచి ఈ పుస్తకాన్ని రాసాడు.

తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లో పేరుకుపోయిన వెట్టి చాకిరి, భూస్వాముల దౌర్జన్యాలు, రైతు కూలీల సమస్యలపై విప్లవోద్యమం ప్రజలను చైతన్యపరచడంలో పూర్తి విజయాన్ని సాధించింది. ప్రజల కోసం జరుగుతున్న ఈ పోరాటం విద్యార్థులను కూడా ప్రభావితం చేసింది. దానితో అనేక మంది విద్యార్థులు పోరాటంలో భాగస్వామ్యం అయ్యేందుకు గ్రామాల్లో ప్రజలను చైతన్యపరిచే బాధ్యతను తీసుకున్నారు. అదే సమయంలో తెలంగాణ నాలుగు జిల్లాల్లో విస్తరించి ఉన్న సింగరేణి కార్మికులను కూడా ఈ పోరాటాలు ప్రభావితం చేసాయి. సింగరేణి ఉద్యోగులందరూ ఇదే జిల్లాల లోని గ్రామీణ ప్రాంతాల్లో నుండి వచ్చిన వారు కావడం వల్ల, రైతు కూలీ కుటుంబాల నుండి వచ్చిన వారైనందువలన ఈ పోరాటాలు సింగరేణి కార్మికులను సహజంగానే ప్రభావితం చేయగలిగాయి. గ్రామాల్లోని భూస్వామ్య సమస్యలు లాంటివే సింగరేణిలో ఉండటం వలన సింగరేణి యాజమాన్యం నియంతత్వాలకు వ్యతిరేకంగా కార్మిక హక్కుల కోసం సింగరేణి కార్మికులు పెద్ద ఎత్తున ఉద్యమించారు.



ప్రజలను చైతన్యపరిచే కార్యక్రమంలో భాగంగా మందమర్రి బెల్లంపల్లి ప్రాంతాల్లో ప్రజలను యువకులను చైతన్య పరుస్తున్న క్రమంలో రవీందర్ గంగారాంకు పరిచయమయ్యాడు. సమాజ స్థితిగతులు ప్రజల బాధలు అవి మార్చవలసిన అవసరాన్ని గురించి గంగారం ఆలోచనలు రవీందర్ ను బాగా ప్రభావితం చేశాయి. అలా ప్రజల కోసం పనిచేయాలనే రవీందర్ ఆలోచన ఆయనను ఉద్యమంలో భాగస్వామ్యం చేసింది. ప్రభుత్వం పోలీసులు ఉద్యమకారులను ఎక్కడికక్కడ అరెస్టులు చేయడం, పరస్పర దాడులు.. దానితో ఉద్యమకారులు అజ్ఞాతంలోకి వెళ్లడం రవీందర్ ఆయన శ్రీమతి సరళా కూడా పోలీసులకు దొరకకుండా రహస్య జీవితంలోకి వెళ్లడం ఆ తర్వాత వాళ్ళు ఎదుర్కొన్న నిర్బంధాలు, కష్టాలు పుస్తకంలో మనకు ఒక సినిమా లాగా కనిపిస్తాయి. పుస్తకం మొదటి నుండి చివరి వరకు కూడా వదిలిపెట్టకుండా చదివించే విధానంలో రవీందర్ తన మొదటి పుస్తకం తోనే విజయం సాధించాడు. సాధారణంగా మనం కాల్పనిక కథల్లో అలాంటిది చూస్తాం. కానీ పూర్తిగా యదార్ధ జీవిత సంఘటనలను మాత్రమే చెప్పిన రవీందర్ - సరళ ల ఉద్యమ జీవిత కథ అంతే ఏకబిగిన చదివించే విధంగా ఉండడం తో పాఠకుణ్ణి పూర్తిగా తనతో పాటుగా తీసుకెళుతూ ఆ సంఘటనల దశ్యాల్లో లీనం చేయడం గొప్ప విషయం.

సింగరేణి బొగ్గు గనుల్లో ఉద్యోగిగా చేసి కార్మికుల హక్కుల కోసం పోరుబాటను ఎంచుకొని లాకప్పులు, పోలీసు చిత్రహింసలను, జైలు జీవితాన్ని, అజ్ఞాత జీవితాన్ని అనుభవించి ఆనాటి కాలానికి, పోరాట ఘట్టాలకు సాక్షి భూతమైన ఒక ఉద్యమకారుడు రాసిన తన స్వీయ జీవితమే "బొగ్గు రవ్వలు" పుస్తకం.

డేవిడ్ గిల్బర్ట్ రాసిన 'లవ్ అండ్ స్ట్రగుల్' స్వీయ కథలాగా రవీందర్ తన విప్లవ జీవితాన్ని మన పక్కన కూర్చొని చెబుతున్నట్టుగా ఉంటుంది. మరింత మెరుగైన సమాజం కోసం, స్వేచ్ఛకోసం, ఉదారమైన ప్రపంచం కోసం గిల్బర్ట్ కలలు కన్నాడు. తీవ్ర నిర్బంధాలను ఎదుర్కొని జైలు జీవితంతో ఆయన ఈ పుస్తకాన్ని రాశాడు. రవీందర్ జీవితంలో కూడా జైలు జీవితం ఒక ప్రత్యేకమైన ఘట్టం. జైలు అనగానే మన అందరి దష్టిలో ఉండే ఒక నేరపూరిత వ్యక్తులు ఉండే చోటుగా కాకుండా ఒక భిన్నమైన ఆలోచనత్మకమైన, మేధోపరమైన చర్చలతో కొనసాగే వ్యక్తులు మనకు జైలులో కనిపిస్తారు. ఎవరో అన్నట్టు జైల్లో ఉండవలసిన వారు బయట ఉన్నారు బయట ఉండవలసిన వారు జైల్లో ఉన్నారని అనిపిస్తుంది మనకు ఈ పుస్తకం చదివితే. రవీందర్ - సరళలు ఉద్యమం కోసం పనిచేసే క్రమంలో వేరువేరు చోట్ల ఉండాల్సి రావడం ప్రజల కోసం పనిచేసే క్రమంలో అజ్ఞాతంగా పోలీసులకు దొరకకుండా సరళ నెలల చంటి పిల్లతో ఊరూరు తిరగడం, దగ్గర వారు కూడా వాళ్ళ ఇళ్లలో ఉంచుకోవడానికి వెనకడుగు వేయడం అన్ని సంఘటనలు మన కళ్ళ ముందు రీళ్ళు రీళ్లుగా కదులుతుంటాయి. నిజానికి అజ్ఞాత విప్లవ మహిళా జీవితాల గురించిన సాహిత్యం గాని స్వీయ చరిత్రలు గాని మనకు బహు అరుదుగా కనిపిస్తాయి.

రవీందర్ పుస్తకంలో రాసిన ఆనాటి సన్నివేశాలు చాలా ఆసక్తికరంగా నడుస్తుంది. భార్యాభర్తలిద్దరు ఉద్యమంలో పనిచేయడానికి వీలు లేకపోవటంతో ఉద్యమాన్ని వీడి బయటికి రావాలని నిర్ణయించుకోవడం, ఆ తర్వాత కోర్టులో లొంగిపోవడం వరకు పాఠకుడు ఎక్కడ ఆగకుండా చదివించే సన్నివేశాలు ఈ పుస్తకంలో మనకు కనిపిస్తాయి. చాలావరకు విప్లవ సంఘాల్లో పని చేసేవారు విప్లవనిబద్ధతను, నిర్బంధాలను తట్టుకోలేక విప్లవ పార్టీల నుండి దూరం అవ్వడం మనం చూస్తుంటాం. కానీ పనిచేయడానికి సరైన అవకాశం పార్టీ ఇవ్వలేదని పార్టీ నుండి బయటికి వచ్చిన రవీందర్ - సరళ లాంటి వారు చాలా అరుదుగా ఉంటారు. విప్లవ కార్యచరణలోని నిర్బంధాలతో పాటుగా మనుషులు నిత్య చైతన్యమవడం మనకు ఈ పుస్తకంలో చూస్తాం ఈ పుస్తకం చదువుతున్నప్పుడు ఆ కాలంలో జరిగిన అనేక సంఘటనలు పత్రికలో మనం చదివిన కొన్ని సంఘటనలు, కొంతమంది వ్యక్తుల పేర్లు, ప్రాంతాలు మనకు తారసపడతాయి. తాను రచయితను కాను అని ముందే చెప్పుకున్న గురిజాల రవీందర్ తన స్వీయ విప్లవ జీవితాన్ని మనకు చెప్పిన ఒక సంభాషణగానే భావించాడు. కానీ ఈ పుస్తకం ఒక మంచి రచన కిందనే పరిగణించవచ్చు. ఉద్యమకారుడే రచయితగా మారి రాసిన బహు అరుదైన ఒక కీలక ప్రక్రియను మనకు ఈ పుస్తకం పరిచయం చేస్తుంది. ఒక మంచి రచయితగా మారే అనేక లక్షణాలు రవీందర్ లో ఉన్నాయనే విషయాన్ని ఈ పుస్తకం మనకు చెప్పకనే చెబుతుంది.సామాజిక అంశాలు ఎత్తి చూపే పుస్తకాలను ప్రచురించే పర్స్పెక్టివ్ ప్రచురణ సంస్థ ఈ పుస్తకాన్ని ప్రచురించింది.



- చెమన్ , 9440385563

తర్జుమా తరంగిణి

ముందుకా, వెనుకకా?

నేను ముందుకు కదిలానా,
లేక వెనుకనే ఉండిపోయానా? చెప్పడం కష్టం!
మనుషుల ప్రధాన స్రవంతిలోంచి
విడివడ్డానని మాత్రమే తెలుసు నాకు
నేను ముందు ఉన్నానోక వెనుక ఉన్నానా అనేదాన్ని
పైనుంచి చూస్తున్న వ్యక్తి చెప్పగలడు బహుశా
ఒకవేళ అతనూ నేనూ కలుసుకుంటే.
ఎప్పుడో ఒకసారి నేనక్కడికి చేరుకుంటానేమో,
అప్పుడు ఇక్కడి దృశ్యం కనిపించవచ్చు
నేను ముందు ఉన్నానా వెనుక ఉన్నానా
అనేదాన్ని నిర్ధారించుకునే అవసరముండదు అప్పుడు

మరాఠీ మూలం: ప్రఫుల్ శిలేదార్
ఆంగ్లానువాదం: మాయా పండిట్
తెలుగు సేత: ఎలనాగ

రంగు



అతడు ..కురుక్షేత్ర నాటకంలో
శ్రీకృష్ణ పాత్ర వేసేడు గుర్తు పట్టేను
హరిశ్చంద్రలో నక్షత్రక పాత్ర వేసేడు గుర్తుపట్టేను
గయోపాఖ్యానంలో గయుడు పాత్ర వేసేడు గుర్తు పట్టేను!
యిలా.. అతడు ముఖానికి రంగేసుకున్నప్పుడల్లా పోల్చుకున్నాను!
యివాల.. బతుకు నాటకంలో.. అతడు యే రంగూ వేసుకోలేదు
అయినా.. పోల్చుకోలేక పోతున్నాను !
బహుశ .. ముఖానికి బదులు మనసుకు రంగేసుకున్నట్టున్నాడు !!

- సిరికి స్వామి నాయుడు

సమస్యల పరిష్కారంలో మోడీ విఫలం

- ఎమర్జెన్సీ, నియంతృత్వాన్ని తలపిస్తున్న బీజేపీ పాలన
- మల్కాజ్‌గిరి కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునితా మహేందర్‌రెడ్డిని గెలిపించండి : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.జి.నర్సింహారావు
- ఉప్పల్, మల్కాజిగిరి నియోజకవర్గాల్లో బైక్ ర్యాలీ





నవతెలంగాణ-సిటీబ్యూరో/ఉప్పల్

పదేండ్ల పాలనలో ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ప్రధాని మోడీ విఫలమయ్యారని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డిజి. నర్సింహారావు అన్నారు. బీజేపీని ఓడించండి.. కాంగ్రెస్ మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ ఆ పార్టీ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఉప్పల్‌లో ప్రారంభమైన ఈ ర్యాలీ.. నాచారం, మల్లాపూర్, మల్కాజిగిరి, నేరేడ్‌మెట్, ఏఎస్‌రావు నగర్ మీదుగా ఈసీఐఎల్‌లో ముగిసింది. ఈ సందర్భంగా జరిగిన సభలో డిజి.నర్సింహారావు మాట్లాడుతూ.. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ, దాని మిత్రపక్షాలను ఓడించాలని, హస్తం గుర్తుకు ఓటేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పదేండ్ల మోడీ పాలన ఎమర్జెన్సీని మించిన నియంతృత్వాన్ని తలపిస్తోందన్నారు. రాజ్యాంగ మౌలిక సూత్రాలైన ప్రజాస్వామ్యం, లౌకిక విలువల మీద బీజేపీ దాడి చేస్తున్నదని తెలిపారు. మతం, రాముడి పేరుతో ప్రజల దృష్టిని మరలిస్తూ, విభజన సృష్టిస్తూ, ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తున్నదని ఆరోపించారు. ఈసారి మళ్ళీ బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్నే రద్దు చేసి మత రాజ్యం స్థాపించాలని ప్రయత్నిస్తోందన్నారు. ఈ చర్యలు ప్రజల శాంతియుత జీవనానికి, దేశ సమైక్యతకు, శ్రామికుల ఐక్యతకు ప్రమాదకరమని, అందుకే మోడీని గద్దె దించి దేశాన్ని కాపాడుకుందామని పిలుపునిచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం జరుగుతున్న అన్ని పోరాటాలకూ సీపీఐ(ఎం) అండగా నిలుస్తుందని అన్నారు. ప్రత్యామ్నాయ విధానాలు అమలు చేయడం ద్వారా కేరళ వామపక్ష ప్రభుత్వం దేశానికే దిక్సూచిగా నిలిచిందన్నారు. దేశాన్ని పట్టి పీడిస్తున్న బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించడానికి వామపక్ష లౌకికవాదులందరూ ఏకమై ఇండియా కూటమిగా ఏర్పడ్డాయన్నారు. తెలంగాణలో భువనగిరి స్థానం మినహా, మిగతా 16 స్థానాల్లో కాంగ్రెస్‌కు ఓటేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ఉప్పల్ నియోజకవర్గ ఇన్‌చార్జి పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. పదేండ్ల మోడీ పాలనలో ధరలు తారా స్థాయికి చేరుకున్నాయన్నారు. 50 ఏండ్ల గరిష్ట స్థాయికి నిరుద్యోగం పెరిగిందని చెప్పారు. పెద్ద నోట్ల రద్దుతో లక్షలాది మందికి ఉన్న ఉపాధి పోయిందనీ, అయినప్పటికీ ఉపాధి హామీ చట్టాన్ని పట్టణాలకు విస్తరించకపోగా, బీజేపీ ప్రభుత్వం దీన్ని మరింత నీరుగార్చిందన్నారు. సీపీఐ(ఎం) మల్కాజిగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కోమటి రవి మాట్లాడుతూ.. దేశంలో ఆర్థిక అసమానతలు పెరిగాయన్నారు. ఇప్పటికే రూ.17.46లక్షల కోట్ల బ్యాంకుల అప్పు ఎగవేసిన బడాబాబులకు మళ్ళీ అప్పులిచ్చేందుకు మోడీ ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోందనీ, పేదల స్థితిగతులు మాత్రం మరింత దిగజారుతున్నాయన్నారు. ఆకలి సూచీలో మన దేశం 111వ స్థానంలో ఉందని చెప్పారు. దేశంలో 32శాతం పౌష్టికాహార లోపం, 44శాతం వంట గ్యాస్ కొరత ఉందన్నారు. ప్రజా సమస్యలు పరిష్కారం కావాలంటే బీజేపీని ఓడించి, సీపీఐ(ఎం) బలపర్చిన పట్నం సునీతా మహేందర్ రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జె.చంద్రశేఖర్, జిల్లా కమిటీ సభ్యులు రాథోడ్ సంతోష్, జి.శ్రీనివాసులు, ఎన్.శ్రీనివాస్, ఉప్పల్ నాయకులు జె.వెంకన్న, ఎస్.నాగరాజు, ఎండీ గౌస్, వై.వెంకటేశ్వర్లు, కాప్రా మండల నాయకులు పి.గణేష్, బీవీ.సత్యనారాయణ, డి.కొండల్ రెడ్డి, ఎం.శ్రీనివాస్‌రావు, మల్కాజిగిరి మండల కార్యదర్శి కృపాసాగర్, మండల నాయకులు బి.నర్సింగ్‌రావు, పి.మంగ, బి.కొండల్, విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

వైద్యుల సమస్యల పరిష్కారం కోసం కృషి

- డాక్టర్ కిరణ్ మాదాల



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వైద్యుల సమస్యల పరిష్కారం కోసం అందర్నీ కలుపుకుని కృషి చేస్తామని ప్రముఖ వైద్యులు డాక్టర్ కిరణ్ మాదాల తెలిపారు. ఆదివారం తెలంగాణ ప్రభుత్వ బోధనా వైద్యుల సంఘం ఎన్నికల ఫలితాలను రాష్ట్ర స్థాయి సమావేశంలో వెల్లడించారు. నూతనంగా ఎన్నికైన వారు 2024 నుంచి 2026 వరకు ఆయా పదవుల్లో ఉండనున్నారు. ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా డాక్టర్ కిరణ్ కుమార్ బొల్లేపాక, సెక్రటరీ జనరల్‌గా డాక్టర్ కిరణ్ మాదల, కోశాధికారిగా డాక్టర్ ఎల్.రమేష్, ఉపాధ్యక్షులుగా డాక్టర్ కిరణ్ ప్రకాష్‌తో పాటు ఏడు జోన్లకు ప్రాంతీయ కార్యదర్శి, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కిరణ్ మాదాల మాట్లాడుతూ తమ సంఘం ఎవరికి వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. అధ్యక్షులు డాక్టర్ కిరణ్ బొల్లేపాక మాట్లాడుతూ బోధనా వైద్యుల బదిలీలు, వైద్యుల వేతన స్థిరీకరణ తదితర సమస్యల సాధనకు కృషి చేయనున్నట్టు తెలిపారు.

మొగులయ్యకు కేటీఆర్ ఆర్థిక సాయం

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

జానపద కళాకారుడు పద్మశ్రీ దర్శనం మొగులయ్యకు మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు ఆర్థిక సహాయం చేశారు.ఆయనకు గత ప్రభుత్వం ఇచ్చిన కళాకారుల పెన్షన్ ఆపివేయడంతో, కూలి పని చేసుకుంటున్నట్టు వచ్చిన వార్తలకు స్పందించిన కేటీఆర్ ఆయనకు ఆర్థిక సహాయం చేశారు. మొగులయ్యకు గత ప్రభుత్వం ఇచ్చిన కళాకారుల పెన్షన్‌తో పాటు అన్ని రకాల హామీలు నెరవేర్చాలని ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మొగులయ్య లాంటి జానపద కళాకారులు తెలంగాణకి గర్వకారణమనీ, వారిని కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉందన్నారు. ఈ సందర్భంగా ఆర్థిక సహాయం చేసిన మాజీ మంత్రి కేటీఆర్‌కు మొగులయ్య ధన్యవాదాలు తెలిపారు.

అరచేతిలో వైకుంఠం చూపి అధికారంలోకొచ్చారు

- కాంగ్రెసోళ్లు ఎన్ని హామీలిచ్చిన మీరు నమ్మలే
- మహిళలకు రూ. 2500, వద్ధులకు 4 వేలు, తులం బంగారం, నిరుద్యోగ భృతి స్కూటీలు వచ్చినయా! : బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీమంత్రి కేటీఆర్



నవ తెలంగాణ - ముషీరాబాద్

అరచేతిలో వైకుంఠం చూపి కాంగ్రెసోళ్లు అధికారంలోకి వచ్చారని, వాళ్ల ఎన్ని హామీలిచ్చినా మీరు నమ్మలేదని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ,మాజీమంత్రి కేటీ రామారావు పేర్కొన్నారు. సికింద్రాబాద్ పార్లమెంట్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్‌ని గెలిపించాలని కేటీఆర్ ముషీరాబాద్ నియోజకవర్గం రామ్‌నగర్ చౌరస్తాలో రోడ్‌షో నిర్వహించారు. ఈ రోడ్ షోలో సికింద్రాబాద్ పార్లమెంట్ అభ్యర్థి పద్మారావు గౌడ్, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళ లకు రూ. 2500, వృద్ధులకు 4 వేలు, తులం బంగారం, నిరుద్యోగ భృతి, స్కూటీలు వచ్చాయా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ వాళ్లు ఎన్ని హామీలు ఇచ్చిన ప్రజలు నమ్మే పరిస్థితిలో లేదన్నారు. దానికి నిదర్శనం గ్రేటర్ హైదరాబాద్లో ఒక సీటు కూడా కాంగ్రెస్ గెలవలేదని ఎద్దేవా చేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేస్తామని చెప్పి ఒక్క పథకాన్ని కూడా సక్రమంగా అమలు చేయలేదని విమర్శించారు. సిగ్గు లేకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరు గ్యారెంటీలు ఐదు అమలు చేశామని హోర్డింగులు పెట్టుకొని శు నకానందం పొందుతున్నార న్నారు. పాపం రాహుల్ గాంధీకి ఏమీ తెలియదన్న విషయం కూడా ఆయనకు తెలియదన్నారు.

రాహుల్ గాంధీతో కూడా మహిళలకు 2500 రూపాయలు ఇస్తున్నట్లు అబద్ధం చెప్పించారని మండిపడ్డారు మీ చేతిలో చావు దెబ్బ తినటానికే మన పార్టీలో గెలిచిన అభ్యర్థిని మళ్లీ నిలబెట్టిన్రు మొన్న కాంగ్రెస్‌కు ఎట్ల బుద్ధి చెప్పిన్రో మళ్లీ వాళ్లకు సిగ్గు వచ్చే విధంగా ఈ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలె అని కోరారు. బీజేపీ కేంద్ర మంత్రిగా ఉండి కూడా కిషన్ రెడ్డి.. ఐదేండ్ల పాలనలో తెలంగాణకు ఒక్క పైసా అయిన తెచ్చారా.. అని ప్రశ్నించారు. కరోనా టైంలో పేదలకు పద్మారావు గౌడ్ అండగా ఉంటూ వారికి భోజనం పెడితే కేంద్ర మంత్రిగా ఉండి కిషన్ రెడ్డి ప్యాకెట్లు పంచారని విమర్శించారు. ముషీరాబాద్ టు సికింద్రాబాద్ రాలే ఒక్క సింటెక్స్ ట్యాంక్ మాత్రమే కిషన్ రెడ్డి ఓపెన్ చేసిన్రు. కేసీఆర్ ఉన్నప్పుడే బాగుండేదని అనుకుంటే వాళ్లకు ఒక ఉపాయం చెబుతాం. మాకు పది నుంచి 12 సీట్లు ఇస్తే మళ్లీ రాష్ట్ర రాజకీయాలను కేసీఆర్ శాసిస్తారని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కొత్త పెట్టుబడును తెచ్చే ముఖం లేదు. ఉన్న పెట్టుబడులు కాపాడే తెలివి లేదు. ఈ దుర్మార్గుల చేతిలో రాష్ట్రం ఆగమైపోతోంది. అన్నా అంటే మీ ముందు ఉండే నాయకుడు పద్మారావుగౌడ్. గుడి కట్టుడు ఒక్కటే. ఓటేసేందుకు కారణమైతే కేసీఆర్ కట్టలేదా యాదాద్రి అని ప్రశ్నించారు. దేవుని అడ్డుపెట్టుకొని రాజకీయాలు చేస్తున్నారు. కేసీఆర్ కాళేశ్వరం లాంటి ఆధునిక దేవాలయం కట్టారు అని గుర్తు చేశారు. రిజర్వాయర్లు చెరువులు పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పూర్తి చేసిండు అని తెలిపారు.వాటికి కూడా మల్లన్న సాగర్, రంగనాయక సాగర్, రాజరాజేశ్వర సాగర్, కొండ పోచమ్మ సాగర్ అని దేవుళ్ల పేరు పేరు పెట్టారన్నారు. అబ్ కీ బార్ 400 అంటున్నారు. మళ్లీ మోడీ గెలిస్తే పెట్రోల్ ధరలు రూ. 400 అవు డు ఖాయమన్నారు.ప్రజల ముక్కు పిండి రాష్ట్రాలకు వాటా దక్కకుండా సెస్ వేసి రూ. 30 లక్షల కోట్లు వసూలు చేశారన్నారు.రూ. 30 లక్షల కోట్ల నుంచి అదానీ, అంబానీ లాంటి పారిశ్రామిక వేత్తలకు రూ. 14 లక్షల కోట్లు రుణమాఫీ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నేను చెప్పింది తప్పని నిరూపిస్తే కిషన్ రెడ్డి మొఖం మీద నారాజీనామా విసిరి కొడుతా అన్నారు. పేదోని కొట్టి పెద్దలకు పెట్టుడే మోడీ పని అని విమర్శించారు ముస్లింలు ఎక్కువ మంది పిల్లలను కంటారని మాట్లాడుతున్నాడు. పదేండ్లు పనిచేసిన ప్రధాని ఇలా మాట్లాడొచ్చా అని అన్నారు.ఒకసారి పుల్వామా పేరుతో ఓట్లు...ఇప్పుడు శ్రీరాముడి పేరుతో ఓట్లు. రాముడు రాజధర్మం పాటించాలని చెప్పిండు. మరి రాజధర్మం పాటించినవా అని ప్రశ్నించారు.గుజరాత్ కు వరదలు వస్తే వెయ్యి కోట్లు ఇస్తవ్. హైదరాబాద్ కు ఎందుకు ఇవ్వవు అన్నారు. ప్రజలు అన్ని ఆలోచించి ఓటు వేయాలని కోరారు సికింద్రాబాద్ లో పద్మారావు గారి కన్నా గొప్ప క్యాండిడేట్ ఎవ్వరు లేరన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కార్యకర్తలు యువ నాయకులు పాల్గొన్నారు.

రేవంత్ ప్రభుత్వాన్ని పడగొడతామనే ప్రచారం అవాస్తవం

- అధికారం కోల్పోయి కేసీఆర్ ఇష్టారీతిన ప్రవర్తిస్తున్నారు
- హైదరాబాద్‌ను కేంద్ర పాలిత ప్రాంతంగా మార్చే ప్రసక్తి లేదు
- మరోసారీ మోడీ ప్రధాని కావాలని ప్రజలు కోరుకుంటున్నారు : మీట్ ది ప్రెస్‌లో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో రేవంత్ రెడ్డి సర్కార్ ఐదేండ్ల పాటు కొనసాగాలని బీజేపీ కోరుకుంటున్నదని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్(టీయూడబ్ల్యూజే) ప్రధాన కార్యదర్శి విరాసత్ అలీ అధ్యక్షతన నిర్వహించిన మీట్‌ది ప్రెస్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ "రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడగొడతామనే ప్రచారంలో వాస్తంవం లేదు. బీఆర్ఎస్, కాంగ్రెస్ కలిసి ప్రభుత్వం పడగొట్టుకుంటే మాకు సంబంధం లేదు. ప్రభుత్వం పడిపోవాలని మేము కోరుకోవడం లేదు. కేసీఆర్, కేటీఆర్, రేవంత్ రెడ్డి నోర్లకు కీ నాదగ్గర లేదు. ఒక 'కీ' ఫాం హౌజ్‌లో ఉంటే, ఒక 'కీ' సోనియా గాంధీ చేతిలో ఉంది. బీఆర్ఎస్‌కు ఈ ఎన్నికల్లో ఒక్క స్థానం వచ్చే పరిస్థితులు కనిపించడం లేదు" అని అన్నారు. ప్రజలు అవినీతి రహిత ప్రభుత్వాన్ని కోరుకున్నారని తెలిపారు. పదేండ్ల బీజేపీ పాలనలో అవినీతిపై అత్యంత కఠినంగా వ్యవహరించామని వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో దేశంలో అనేక చోట్ల ఉగ్రదాడులు, బాంబు పేలుళ్లు, కర్ఫ్యూలు సాధారణంగా ఉండే వన్నారు. మోడీ అధికారంలోకి వచ్చాక జీరో టాలరెన్స్ పద్ధతిని కొనసాగించడం వల్ల ఉగ్రవాదం పూర్తిగా తగ్గిందని చెప్పారు. రాష్ట్రంలో 25 రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేయడంతో పాటు రోడ్ వే, ఎయిర్‌లైన్లు తదితర అన్ని రంగాలకు పెద్దపీట వేసామని పేర్కొన్నారు. రిజర్వేషన్లను రద్దు చేస్తామని ఎవరన్నారో రేవంత్‌రెడ్డి చెప్పాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగాన్ని వంద సార్లకు పైగా మార్చిన కాంగ్రెస్ పార్టీ, రాజ్యాంగం గురించి నీతులు చెబుతున్నదని విమర్శించారు. మరోసారీ నరేంద్రమోడీ దేశ ప్రధాని కావాలని కోరుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమానికి సీనియర్ జర్నలిస్టు రవికాంత్ రెడ్డి సమన్వయ కర్తగా వ్యవహరించారు.

మతోన్మాదులను ఓడించండి

- సీపీఐ(ఎం)ది త్యాగాల చరిత్ర :సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు



నవతెలంగాణ-సంస్థాన్‌నారాయణపురం

బీజేపీ మతోన్మాదులను పార్లమెంట్ ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు పిలుపునిచ్చారు. ఆదివారం యాదాద్రిభువనగిరి జిల్లా సంస్థాన్‌నారాయణపురం మండల కేంద్రంలోని అమరవీరుల స్మారక భవనంలో ఆ పార్టీ సీనియర్ నాయకులు తుమ్మల నర్సిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీని ఓడించడం వల్లనే దేశ ప్రజలు ఐక్యంగా ఉంటారన్నారు. మోడీ మళ్ళీ గెలిస్తే ప్రజాస్వామిక హక్కులు లేకుండా పోతాయని తెలిపారు. రాజ్యాంగం మార్చుతామని చెబుతున్న బీజేపీని ఓడించడం ప్రజల, లౌకికవాదుల బాధ్యత అని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం మే13న జరుగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో సీపీఐ(ఎం) అభ్యర్థి ఎండీ జహంగీర్‌ను గెలిపించాలని కోరారు. డబ్బులు పంచి గెలిచే నాయకులు ప్రజల పక్షాన నిలబడరని తెలిపారు. బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు ప్రజల తరపున పోరాడిన చరిత్ర ఉందా అని ప్రశ్నించారు. భువనగిరి నియోజకవర్గంలో ఉన్న అనేక సమస్యలపై పోరాడిన చరిత్ర సీపీఐ(ఎం) అభ్యర్థికి ఉందన్నారు.ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయలేని పార్టీల అభ్యర్థులను ఓడించాల్సిన బాధ్యత ప్రజలపైనే ఉందన్నారు. మతం, కులం పేరుతో ఓట్లు దండుకోవడానికి వస్తున్న వారికి తగిన బుద్ధి చెప్పాలని తెలిపారు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థులు తమ ఆస్తులను కాపాడుకునేందుకు పోటీ చేస్తున్నారన్నారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు టి.స్కైలాబ్‌బాబు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దోనూరు నర్సిరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు గుంటోజు శ్రీనివాసాచారి, మండల కార్యదర్శి దోడయాదిరెడ్డి, సీనియర్ నాయకులు సురుకంటి శ్రీనివాస్‌రెడ్డి, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కవిత బెయిల్ పై నేడు తీర్పు



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత దాఖలు చేసిన బెయిల్ పిటిషన్ పై సోమవారం రౌస్ ఎవెన్యూ కోర్టు తీర్పును వెలువరించనుంది. లిక్కర్ కేసులో సీబీఐ, ఈడీ దర్యాప్తు సంస్థలు తనను అక్రమంగా అరెస్టు చేశాయని, తనకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ కవిత వేర్వేరుగా బెయిల్ పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై ఇటీవల వాదనలు ముగించిన ట్రయల్ కోర్టు తీర్పును నేటికి వాయిదా వేసింది. నేడు ఉదయం 10 గంటలకు స్పెషల్ జడ్జ్ కావేరి బవేజా ఈడీ, సీబీఐ కేసుల్లో కవిత బెయిల్ పిటిషన్లపై తీర్పును చదివి వినిపించనున్నారు. ప్రస్తుతం జైల్లో ఉన్న తనకు రెగ్యులర్ బెయిల్ మంజూరు చేయాలని కవిత రౌస్ ఎవెన్యూ కోర్టును ఆశ్రయించారు. ఏడేండ్లలోపు శిక్ష పడే కేసులకు అరెస్టు అవసరం లేదని కవిత తరపున న్యాయవాది విక్రమ్ చౌదరి వాదనలు వినిపించారు. అలాగే పిఎంఎల్ఏ సెక్షన్ 45 ప్రకారం కవిత మహిళ కాబట్టి బెయిల్ కు అర్హురాలని కోర్టుకు నివేదించారు.

రేపు కోర్టు ముందుకు కవిత...!

మరోవైపు కవితకు కోర్టు విధించిన జ్యుడిషియల్ కస్టడీ 7తో ముగియనుంది. దీంతో గత ఆదేశాల మేరకు ఆమెను మంగళవారం ఉదయం కోర్టులో ప్రవేశపెట్టనున్నారు. అయితే నేడు వెలువరించే తీర్పులో కవితకు బెయిల్ దక్కితే, జ్యుడీషియల్ కస్టడీ పొడగింపు ఉండదు. అలా కాదని కోర్టు ఆమెకు బెయిల్ నిరాకరిస్తే... మంగళవారం ఆమెను కోర్టు ముందు హాజరుపరచక తప్పదు. అయితే... ఈ సారి తనను నేరుగా కోర్టు ముందు హాజరుపరచాలని గతవారం కవిత ట్రయల్ కోర్టులో అప్లికేషన్ దాఖలు చేశారు. గతంలో మాదిరిగా వర్చువల్ మోడ్ లో కాకుండా, నేరుగా హాజరయ్యేందుకు అవకాశం కల్పించాలని కోరారు. ఈ అప్లికేషన్ ను బెయిల్ తీర్పు సందర్భంగా ఆమె న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకెళ్లనున్నట్టు తెలిసింది. అలాగే, ఒకవేళ ట్రయల్ కోర్టు బెయిల్ నిరాకరిస్తే... ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించాలని ఆమె తరపు న్యాయవాదులు యోచిస్తున్నారు.

ప్రజ్వల్‌పై బ్లూ కార్నర్ నోటీసు జారీ

- హాసన సెక్స్ స్కాం కేసులో..

బెంగళూరు: లోక్‌సభ ఎన్నికలవేళ హాసన సెక్స్ కుంభకోణం కన్నడ రాజకీయాలను కుదిపేస్తోంది. వందలాది మంది మహిళల్ని బెదిరించి అఘాయిత్యాలకు పాల్పడినట్టు ఆరోపణలు ఎదుర్కొంటోన్న ప్రజ్వల్ రేవణ్ణను స్వదేశానికి రప్పించేందుకు కర్నాటక సర్కారు తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. ఇందులో భాగంగా ఆయనపై బ్లూ కార్నర్ నోటీసు జారీ చేసినట్టు ఆ రాష్ట్ర హోంమంత్రి పరమేశ్వర వెల్లడించారు. విదేశాలకు పారిపోయిన ప్రజ్వల్‌ను గుర్తించి స్వదేశానికి తీసుకొచ్చేందుకు ఇంటర్ పోల్ సాయం తీసుకొంటున్నామన్నారు.

బాధితులు 500 మంది పైనే?

ఆదివారం ఆయన బెంగళూరులో విలేకర్లతో మాట్లాడుతూ.. ఇప్పటికే నోటీసులు జారీ చేశారని.. ఇంటర్ పోల్ అన్ని దేశాలకు సమాచారం అందించి ప్రజ్వల్ రేవణ్ణ ఆచూకీ తెలుసుకుంటుందన్నారు. ప్రజ్వల్‌ను ఎలా తీసుకురావాలనే అంశంపై ఈ కేసులో విచారణకు ఏర్పాటు చేసిన సిట్ నిర్ణయం తీసుకుంటుందని మంత్రి చెప్పారు. ఈ కేసులో సిట్ అధికారుల పనితీరును హోంమంత్రి ప్రశంసించారు. తమకు వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా సిట్ చర్యలు చేపడుతోందన్నారు. ఒక నేరానికి సంబంధించిన వ్యక్తిని గుర్తించేందుకు, అతడి కార్యకలాపాల గురించి దాని సభ్యదేశాల నుంచి అదనపు సమాచారం సేకరణకు అంతర్జాతీయ పోలీస్ సహకార సంస్థ బ్లూ కార్నర్ నోటీసు జారీ చేస్తుంటుంది.

ఉపాధ్యాయ పదోన్నతుల్లో 'టెట్' సంక్షోభం

- పరిష్కారానికి టీఎస్ యూటీఎఫ్ డిమాండ్
- విద్యాశాఖ కమిషనర్ దేవసేన నిర్లక్ష్యమే కారణం : చర్యలకు టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి డిమాండ్



నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

రాష్ట్రంలో ఉపాధ్యాయుల పదోన్నతుల సంక్షోభానికి కారణమైన అర్హత పరీక్ష (టెట్) వివాదం పరిష్కారంపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న విద్యాశాఖ కమిషనర్ దేవసేనను ఆ బాధ్యతల నుంచి తొలగించాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత సెప్టెంబర్‌లో అర్ధాంతరంగా నిలిచిపోయిన పదోన్నతులను కొనసాగించాలని కోరారు. దీనికి ఆటంకంగా ఉన్న టెట్‌పై ఎన్సీటీఈ వివరణ తీసుకోవాలని.. అనేక సార్లు కమిషనర్‌కు విన్నవించామని తెలిపారు. ఖమ్మం పట్టణంలోని టీఎస్ యూటీఎఫ్ భవనంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రవి మాట్లాడారు. పదోన్నతులపై స్పష్టత కోసం ఫిబ్రవరిలో ఎన్సీటీఈకి లేఖ రాసినా రహస్యంగా ఉంచారని చెప్పారు. ప్రధానోపాధ్యాయులకు పనిచేస్తున్న పాఠశాలల స్థాయిలో మార్పు లేనప్పుడు పదోన్నతులకు టెట్ అవసరం లేదని పేర్కొంటూ ఏప్రిల్ 8న స్పష్టతనిచ్చినా బయటకు వెల్లడించకుండా ఉపాధ్యాయులను మానసిక ఆందోళనకు గురిచేశారన్నారు. అంతేకాక అందరినీ టెట్‌కు దరఖాస్తు చేయించడం ద్వారా రూ.లక్షలు వృథా చేయించారని కమిషనర్ వైఖరిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడేండ్లుగా కమిషనర్ పనితీరు బాగో లేదని, ఉపాధ్యాయులు, సంఘాలు చివరికి ప్రజాప్రతినిధులతో సైతం సరిగ్గా వ్యవహరించటం లేదని ఆరోపించారు. విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించటంలో ఆమె విఫలమయ్యారని అన్నారు. ఎన్నికలు ముగిసేలోగా ఎన్సీటీఈ నుంచి మరికొన్ని అంశాలపై వివరణ తీసుకుని.. ఆ వెంటనే ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. సెప్టెంబర్‌లో బదిలీ అయిన ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలని, విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి పాఠశాలల్లో విద్యావాలంటీర్లను నియమించాలని కోరారు.

సర్వీసు పర్సన్స్‌ను నియమించాలని, గిరిజన సంక్షేమ పాఠశాలల్లో నూతన ఉపాధ్యాయ పోస్టులు మంజూరు చేయాలన్నారు. గురుకులాల్లో బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు వాయిదాల డీఏను విడుదల చేయాలని కోరారు. గత పీఆర్సీ బకాయిలతో సహా ట్రెజరీ ఆమోదం పొంది ఆర్థిక శాఖ వద్ద పెండింగ్‌లో ఉన్న బిల్లులన్నీ తక్షణమే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చావ దుర్గాభవాని, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జీవీ నాగమల్లేశ్వరరావు, పారుపల్లి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు బుర్రి వెంకన్న, కోశాధికారి వల్లంకొండ రాంబాబు, కార్యదర్శులు పి.సురేష్, ఉద్దండు షరీఫ్, డి. నాగేశ్వరరావు, ఎస్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకులపై కత్తులతో దాడి

- ఒకరు మృతి, మరొకరికి తీవ్ర గాయాలు
- పాత కక్షలే కారణం



నవతెలంగాణ-రాజేంద్రనగర్

పాత కక్షల నేపథ్యంలో ఇద్దరు కాంగ్రెస్ నాయకులపై ఒక వ్యక్తి కత్తితో దాడి చేశాడు. ఈ దాడిలో ఒకరు మృతి చెందగా.. మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సులేమాన్‌నగర్‌కు చెందిన కాంగ్రెస్ నేతలు మక్బూల్(60), మనోజ్.. శనివారం సాయంత్రం చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో అక్కడ పార్టీ ఆఫీసులో స్థానికులతో కలిసి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. మరి కొద్ది గంటల్లో రంజిత్‌రెడ్డి ఆ ప్రాంతానికి వస్తారనగా.. స్థానిక ఎంఐఎం నాయకులు అంజద్ అక్కడకు చేరుకొని మక్బూల్‌తో గొడవకు దిగాడు. దాంతో ఇద్దరి మధ్య మాటా మాటా పెరిగింది.

అంజాత్ తనతో తెచ్చుకున్న కత్తితో మక్బుల్‌పై విచక్షణ రహితంగా దాడి చేయడంతో అతను అక్కడికక్కడే కుప్పకూలి మృతిచెందారు. అక్కడే ఉన్న మనోజ్‌పై కూడా అంజద్ కత్తితో దాడి చేసి పరారయ్యాడు. ఒక్కసారిగా జరిగిన ఈ ఘటనతో స్థానికులు భయభ్రాంతులకు గురై అక్కడ నుంచి పారిపోయారు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న రాజేంద్రనగర్ డీసీపీ చింతామణి శ్రీనివాస్ తీవ్ర గాయాలపాలైన మనోజ్‌ను స్థానికం ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అతని పరిస్థితి విషమంగా ఉంది. మృతి చెందిన మక్బూల్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.

అయితే ఈ ఘటనకు పాత కక్షలు కారణమని పోలీసులు భావిస్తున్నారు. విషయం తెలుసుకున్న చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డి అక్కడ ప్రచారం చేయకుండానే వెనుతిరిగారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని నిందితుని కోసం గాలిస్తున్నారు.

ఆ యువతి ఆచూకీ దొరికింది !



బెంగళూరు : కొద్ది రోజుల క్రితం కిడ్నాపింగ్‌కు గురైన యువతి ఆచూకీని కర్నాటక పోలీసులు కనిపెట్టారు. కెనహళ్లిలోని రాష్ట్ర ఎమ్మెల్యే హెచ్‌డీ రేవణ్ణ సహాయకుడు రాజశేఖర్ ఫామ్‌హౌస్‌లో ఆ యువతి ఆచూకీ లభించింది. సస్పెన్షన్‌కు గురైన జేడీఎస్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణపై లైంగిక వేధింపుల ఆరోపణలు రావడం, ఆయన విదేశాలకు పారిపోవడం, ప్రజ్వల్ తండ్రి హెచ్‌డీ రేవణ్ణను పోలీసులు అరెస్ట్ చేయడం తెలిసిందే. కర్నాటక పోలీసులకు చెందిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) గాలింపు చర్యలు చేపట్టి యువతిని రక్షించారు.

ఈ యువతిని రేవణ్ణ బంధువు సతీష్ బాబన్న గత నెల 29న కిడ్నాప్ చేశారని వార్తలు వచ్చాయి. అప్పటి నుండి ఆమెను రాజశేఖర్ తన వ్యవసాయ క్షేత్రంలో బందీగా ఉంచారు. బాధితురాలిని సిట్ అధికారులు బెంగళూరు తీసుకొచ్చారు. వెలుగులోకి వచ్చిన ప్రజ్వల్ రేవణ్ణ రాసలీలల ఆడియో టేపుల్లో బాధితురాలు కూడా ఉన్నారు. అంతకుముందు కిడ్నాపింగ్ కేసుకు సంబంధించి హెచ్‌డీ రేవణ్ణను ఆయన తండ్రి, మాజీ ప్రధాని దేవెగౌడ నివాసంలో సిట్ అధికారులు అరెస్ట్ చేశారు. అరెస్టు నుండి తనకు రక్షణ కల్పించాల్సిందిగా రేవణ్ణ దాఖలు చేసిన పిటిషన్‌ను బెంగళూరు కోర్టు తోసిపుచ్చింది.

కాంగ్రెస్‌లోకి చేరికలు



నవతెలంగాణ - చైతన్యపురి

మహేశ్వరం నియోజకవర్గం సరూర్‌నగర్ డివిజన్ పరిధిలోని పలువురు బీఆర్ఎస్, బీజేపీ పార్టీ ముఖ్య నాయకులు హైదరాబాద్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మహేందర్ యాదవ్, డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శంకర్ యాదవ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కిచ్చేన్నగారి లక్ష్మారెడ్డి, మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, టీపీసీసీ మెంబర్ దేప భాస్కర్ రెడ్డిలు వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి, పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం గడప గడపకూ పాదయాత్ర నిర్వహించారు. తర్వాత వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చుతామని తెలిపారు. రంజిత్ రెడ్డి గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు నల్లంకి దస్ రాజ్ గౌడ్, పారుపల్లి దయాకర్ రెడ్డి, బేర బాలకిషన్, చిక్కుల్ల శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'పట్నం సునీతా మహేందర్ రెడ్డిని గెలిపించండి'



నవతెలంగాణ - హయత్‌నగర్

మల్కాజిగిరి పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్ రెడ్డిని ఈ పార్లమెంట్ ఎన్నికల్లో గెలిపించాలని ఎల్బీనగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి, టీపీసీసీ ప్రతినిధి జక్కిడి ప్రభాకర్ రెడ్డి కోరారు. ఎల్బీనగర్ నియోజకవర్గం పరిధిలోని సౌత్ అండ్ పార్క్‌లో ఆదివారం పట్నం సునీతా మహేందర్ రెడ్డి తనయురాలు మనీషా రెడ్డితో కలిసి జక్కిడి ప్రభాకర్ రెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ స్థాయి సీనియర్ నాయకులు, డివిజన్ అధ్యక్షులు, మహిళా నాయకులు, బూత్ స్థాయి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



బీఆర్ఎస్ హయాంలో అప్పులపాలైన తెలంగాణ

- ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి

నవతెలంగాణ-తుర్కయంజాల్

బీఆర్ఎస్ హయాంలో తెలంగాణ రాష్ట్రం అప్పులపాలైందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు. ఆదివారం తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని ఏవి నగర్ కాలనీలో వివిధ కాలనీ వాసులతో ఎంపీ అభ్యర్థి చామల కిరణ్ కుమార్ రెడ్డిని గెలిపించాలని కోరుతూ ఎన్నికల ప్రచార సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన కిరణ్ కుమార్ రెడ్డి, రంగారెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం నిధుల దుర్వినియోగం చేసిందని ఆరోపించారు. ప్రాజెక్టుల పేరుతో కేసీఆర్ తెలంగాణాను అప్పుల కుప్పగా మార్చారని పేర్కొన్నారు. రాష్ట్రంలో అధికారం కోల్పోయిన కేవలం మూడు నెలల్లో బీఆర్ఎస్ భూస్థాపితం అయిపోయిందన్నారు.

ఎన్నికలకు ముందు కాంగ్రెస్ చేసిన ఆరు గ్యారంటీలను రేవంత్ సర్కార్ తిరుగులేకుండా అమలు చేస్తోందన్నారు. దేశంలోనూ ఇవే గ్యారంటీలతో కాంగ్రెస్ అధికారంలోకి రాబోతోందని జోస్యం చేప్పారు. కేసీఆర్ చెప్పే కల్లబొల్లి కథలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసం కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణను కేసీఆర్ ఆగం చేశారన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని ప్రజలు నమ్మి పట్టం కట్టారన్నారు. మతాన్ని, కులాన్ని అడ్డం పెట్టుకొని కొందరు ఓట్లు అడగడానికి వస్తున్నారని, అలాంటి వారిని నమ్మొద్దన్నారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ అనురాధ రాంరెడ్డి, డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య, కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ కొశికె ఐలయ్య, పీసీసీ సభ్యులు, కౌన్సిలర్ కాకుమాను సునీల్, కౌన్సిలర్లు నారని కవితాశేఖర్ గౌడ్, బొక్క రవీందర్ రెడ్డి, సీనియర్ నాయకులు నోముల కృష్ణ గౌడ్, గుండ్లపల్లి ధనరాజ్ గౌడ్, సామ భీంరెడ్డి, కుంట గోపాల్ రెడ్డి, మర్రి మహేందర్ రెడ్డి, తాటిచెట్టు అశోక్ గౌడ్, పొలిశెట్టి ప్రేమ్ కుమార్, బారు శ్రీనివాస్ రావు, మెండే కొండల్ కొంతం వెంకట్ రెడ్డి (జానీ), పూజారి శంకరయ్య గౌడ్, కొత్తకుర్మ కుమార్, గుండా బాల్ రాజ్, కౌన్సిలర్లు కీర్తన విజయానందరెడ్డి, మేతరి అనురాధ దర్శన్, గుండా భాగ్యమ్మ ధనరాజ్, మంగమ్మ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

'కాసానిని భారీ మెజార్టీతో గెలిపిస్తాం'



నవతెలంగాణ - చైతన్యపురి

చేవెళ్ల పార్లమెంట్ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ మదిరాజ్‌ను భారీ మెజార్టీతో గెలిపిస్తామని మహేశ్వరం నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్ శర్మ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం డివిజన్ పరిధిలోని అల్కాపురిలో గడప గడపకూ ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలన్నీ అమలు చేయలేక పోయిందని మండిపడ్డారు. ఇచ్చిన వాగ్దానాలకు దిక్కులేదు కానీ.. కొత్త వాగ్దానాలతో ప్రజలను మరోసారి మోసం చేయడానికి వస్తున్నారని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో కరెంటు పోతే వార్త అయ్యేది, కాంగ్రెస్ గవర్నమెంట్ లో కరెంటు ఉంటే వార్త అవు తుందని ఎద్దేవా చేశారు. ప్రజలు ఇప్పటికైనా ఆలోచించి బీఆర్ఎస్‌ను గెలిపించాలని ప్రజ లను కోరారు. ఈ కార్యక్రమంలో మంత్రి రవీం ద్రరావు, కొండల శ్రీనివాస్, శ్రీనివాస్ గొడుగు, వెంకటేష్ గౌడ్, జహీద్, బాలుశ్రీ పాల్గొన్నారు.



నవతెలంగాణ - బడంగ్‌పేట్

చేవెళ్ల పార్లమెంట్ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ విజయం సాధించడం ఖాయమని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 4వ డివిజన్ కార్పొరేటర్ సంరెడ్డి స్వప్న వెంకట్ రెడ్డి అన్నారు. ఆదివారం మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న 4వ డివిజన్ పరిధిలో పలు కాలనీలలో మాజీ మంత్రి, మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఆదేశం మేరకు బీఆర్ఎస్ పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌కు మద్దతుగా ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహేందర్ రావు, సంరెడ్డి సంజీవ రెడ్డి, రాజేష్, రాజు, శ్రీనివాస్ రెడ్డి, అంజల్ రావు, సందీప్, శేఖర్ రెడ్డి, సత్యనారాయణ గౌడ్, శ్రీశైలం పాల్గొన్నారు.

కేటీఆర్ రోడ్ షోను విజయవంతం చేయాలి

- ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి



నవతెలంగాణ - బడంగ్‌పేట్

చేవెళ్ల పార్లమెంట్‌లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ విజయమే లక్ష్యంగా నియోజకవర్గ పరిధిలోని శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్, మహేశ్వరం నియోజకవర్గాల్లో ఈ నెల 6న జరిగే బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రోడ్ షో, కార్నర్ మీటింగ్‌లను విజయవంతం చేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి కోరారు. నేడు సాయంత్రం 5 గంటలకు శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని కొండాపూర్ ఆర్టీఏ ఆఫీస్ దగ్గర, సాయంత్రం 6 గంటలకు రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని మైలార్ దేవ్ పల్లి గణేష్ నగర్ చౌరస్తా వద్ద, మహేశ్వరం నియోజకవర్గ పరిధిలో బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో సాయంత్రం 7 గంటలకు రోడ్ షో కార్నర్ సమావేశాలను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అభ్యర్థి, కార్పొరేటర్లు, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి కేటీఆర్ రోడ్ షోన్ నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా కేసీఆర్ బస్ యాత్రలకు విశేష స్పందన వస్తుందని, గ్రేటర్ పరిధిలో కేటీఆర్ ప్రచారానికి కూడా అనూహ్యస్పందన వస్తుందని హర్షం వ్యక్తం చేశారు. చేవెళ్ల పార్లమెంట్‌లో బీఆర్ఎస్ హ్యాట్రిక్ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

మోసపూరిత వాగ్దానాలతో గద్దెనెక్కిన కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి : సుధీర్ రెడ్డి



నవతెలంగాణ - నాగోల్

గత అసెంబ్లీ ఎన్నికలలో మోసపూరిత వాగ్దానాలు చేసి గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీకి ఈ పార్లమెంట్ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని ఎల్బీనగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ప్రజలను కోరారు. పార్లమెంటు ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం మల్కాజిగిరి పార్లమెంటు నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి మద్దతుగా నాగోల్ డివిజన్లోని ఫతుల్లగూడ నుండి సాయి నగర్ వరకు ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలతో కలిసి అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి కూతురు మౌనిక భారీ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో లక్ష్మారెడ్డిని గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మోసపూరిత వాగ్దానాలు చేసి గద్దెనెక్కిన తరువాత ప్రజా సమస్యలను గాలికి వదిలేసిందన్నారు. ప్రజలు ఇప్పుడు మార్పు కోరుకుంటున్నారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఈ ర్యాలీలో మాజీ కార్పొరేటర్ చెరుకు సంగీత ప్రశాంత్ గౌడ్, సీనియర్ నాయకులు ఆనంతుల రాజిరెడ్డి, డివిజన్ అధ్యక్షులు తూర్పాటి చిరంజీవి, ఎల్బీనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు రంగేశ్వరి, శిల్ప, కవిత, పలువురు సీనియర్ నాయకులు, ఉద్యమకారులు తదితరులు పాల్గొన్నారు.

పలు చోట్ల సబితా ఇంద్రారెడ్డి జన్మదిన వేడుకలు



నవతెలంగాణ - బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న శ్రీరామ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆశ్రిత వృద్ధాశ్రమంలో మాజీ మంత్రి, మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి వారికి పండ్లు, స్వీట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు రాంబాబు, నాయకులు గట్టు మహిపాల్, బల్వంత్, చిత్రం సాయి పాల్గొన్నారు.



నవతెలంగాణ - బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 14వ డివిజన్ వెంకటాపూర్ గ్రామంలో మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని మహేశ్వరం నియోజకవర్గం సోషల్ మీడియా కన్వీనర్ సిల్వర్ సాంబశివ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం బీసీ సెల్ సెక్రెటరీ రాళ్ల బండి కుమార్ గౌడ్, నియోజకవర్గం బీసీ సెల్ జాయింట్ సెక్రెటరీ ఠాకూర్ సంజయ్ సింగ్, నాయకులు జక్కుల శ్రీకాంత్, షౌకత్, కుక్కల భాస్కర్, నరసింహ మహమ్మద్ వాజిద్, మహమ్మద్ మక్దూమ్ మహమ్మద్ రషీద్, మహమ్మద్ సలీం, కాలేద్ బాయ్ తదితరులు పాల్గొన్నారు.





నవతెలంగాణ - మీర్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత, జన హృదయ నేత మాజీ మంత్రి, ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి జన్మదినం సందర్భంగా మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు అర్కల కామేష్ రెడ్డి ఆధ్వర్యంలో జిల్లెలగూడలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తర్వాత 1001 కొబ్బరికాయలు కొట్టారు. మీర్‌పేట్ బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి జేటవత్ శ్రీనివాస్ నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ దిండు భూపేష్ గౌడ్ ఆధ్వర్యంలో అనాథ ఆశ్రమంలో పండ్ల పంపిణీ, అన్నదానం చేశారు. డిప్యూటీ మేయర్ ఆధ్వర్యంలో కర్మన్ ఘాట్ ఆంజనేయ స్వామి ఆలయంలో కార్పొరేటర్లు సిద్దాల బీరప్ప, అనిల్ కుమార్ యాదవ్, దోమలపల్లి ధనలక్ష్మి రాజ్ కుమార్ ప్రజా సేవలో నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మీర్‌పేట్ కార్పొరేషన్ పరిధిలోని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ - బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న నాదర్‌గుల్ గ్రామంలో మాజీ మంత్రి, మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి జన్మదిన వేడుకల సందర్భంగా కేక్ కట్ చేసి, స్వీట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఎల్బాల మమత సుదర్శన్ రెడ్డి, అంకంగారి మంజుల కుమార్ గౌడ్, మున్సిపల్ కార్పొరేషన్ బీసీ సెల్ అధ్యక్షులు కె.జంగయ్య, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



నవతెలంగాణ- బడంగ్‌పేట్

ఎన్నికల ప్రచారంలోనే మాజీ మంత్రి, మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డికి ప్రజలు, అభిమానులు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.





ప్రజా సమస్యలపై గలమెత్తుతుంది 'విశ్వంబర'



- చైర్మన్ డాక్టర్ కాచం సత్యనారాయణ గుప్త

నవతెలంగాణ - సంతోష్‌నగర్

ప్రజల కోసం, ప్రజా సమస్యలపై విశ్వంబర తెలుగు దినపత్రిక గలమెత్తుతుందని వీత్రి న్యూస్ ఛానల్ చైర్మన్ డాక్టర్ కాచం సత్యనారాయణ గుప్తా అన్నారు. ఆదివారం చంపాపేట్‌లోని లక్ష్మీ కన్వెన్షన్‌లో విశ్వంబర దినపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 6 సంవత్సరాల నుండి వీ3 న్యూస్ ఛానల్ ద్వారా ఎంతో మంది ప్రేక్షకుల అభిమానాలను చూరగోన్నామని, విశ్వంబర దినపత్రిక ద్వారా కూడా అత్యధిక పాఠకులకు చేరవేసే విధంగా చూస్తామని తెలిపారు. 8 పేజీలతో ఐదు రూపాయలతో మార్కెట్లోకి ఆదివారం నుండే విడుదలైందని తెలిపారు. పార్టీలకతీతంగా ప్రజా సమస్యల కోణంలోనే పాఠకులకు దగ్గరవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్ గౌడ్, రమేష్, సాయి, భరత్ రెడ్డి, కాచం సుష్మ పాల్గొన్నారు.

'కాంగ్రెస్‌ను గెలిపించుకుందాం.. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందాం..'



నవతెలంగాణ- బడంగ్‌పేట్

ఈ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించుకుందాం.. భారత రాజ్యాంగం, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందామని జల్‌పల్లి మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సయ్యద్ అబ్దుల్ రాహుఫ్, మీర్జా షాకేర్ బేగ్‌లు అన్నారు. ఈ మేరకు జల్‌పల్లి మున్సిపల్ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం సంవత్సరానికి ఇస్తానన్న 2 కోట్ల ఉద్యోగాలు ఎక్కడ అని ప్రశ్నించారు. దేశంలో ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు, కార్పొరేట్ కంపెనీలకు అప్పగించడం జరిగిందని మండిపడ్డారు. అదే విధంగా రాష్ట్రంలో పదేండ్ల బీఆర్ఎస్, బీజేపీ పాలనలో పేదోడిని దోచి పెద్దోనికి పెట్టడం తప్ప.. ఈ రెండు ప్రభుత్వాలు చేసిందేమీ లేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే పేదల పక్షాన నిలబడే ప్రభుత్వం.. మళ్లీ కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే దేశం, రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందుతుందన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు హస్తం గుర్తుకు ఓటు వేసి చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం రంజిత్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. బడుగు, బలహీన వర్గాలు బాగుపడాలంటే ఇండియా కూటమి అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలన్నారు. బీఆర్ఎస్‌కు ఓటేస్తే పరోక్షంగా బీజేపీకి వేసినట్లేనని అన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ రిజర్వేషన్ ఉండాలంటే కాంగ్రెస్‌కు ఓటు వేయాలన్నారు.

ఎల్బీనగర్‌లో 30వేల మెజార్టీ దాటేనా..!

నవతెలంగాణ - ఎల్బీనగర్

గత పార్లమెంట్ ఎన్నికల్లో ఎల్బీనగర్ నియోజకవర్గంలో 29 వేల మెజార్టీ కాంగ్రెస్‌కు రావడంతో దేశంలోని అతిపెద్ద పార్లమెంట్ నియోజకవర్గమైన మల్కాజిగిరి నియోజకవర్గం నుండి రేవంత్ రెడ్డి విజయం సాధించారు. ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజిగిరి నియోజకవర్గం నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా సునీతా మహేందర్ రెడ్డి పోటీ చేస్తున్నారు. ఇటీవల ఎల్బీనగర్‌లో ఎన్నికల ప్రచారం కోసం వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎల్బీనగర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థికి 30 వేల ఓట్ల మెజార్టీ దాటాలని కాంగ్రెస్ నాయకులకు టార్గెట్ పెట్టారు. ఈ టార్గెట్ రీచ్ కావాలంటే కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కలిసి ప్రణాళిక బద్ధంగా ఎన్నికల్లో పని చేయాల్సి ఉంటుంది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి మూడవ స్థానంలో నిలిచారు. రెండవ స్థానంలో బీజేపీ అభ్యర్థి నిలిచారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో నియోజకవర్గంలో 5 లక్షల 99 వేల 28 ఓట్లు ఉంటే, 2 లక్షల 95, వేల 131 ఓట్లు పోల్ అయినాయి. బీఆర్ఎస్ అభ్యర్థికి ఒక లక్ష 11 వేల 380 ఓట్లు రావడంతో 17 363 ఓట్ల మెజార్టీతో సుధీర్ రెడ్డి విజయం సాధించారు. బీజేపీ అభ్యర్థి సామ రంగారెడ్డికి 89వేల 75 ఓట్లు రావడంతో రెండో స్థానంలో నిలిచారు. కాంగ్రెస్ అభ్యర్థి మధు యాష్కీ గౌడ్ కు 83 వేల 773 ఓట్ల తో మూడో స్థానంలో నిలిచారు.

ఇప్పుడు పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 30 వేల మెజార్టీ రావాలంటే దాదాపు ఒక లక్ష 20 వేల ఓట్లు రావాల్సి ఉంటుంది. ఈ ఓట్లను సాధించలేకపోతే రేవంత్ రెడ్డి ఇచ్చిన టార్గెట్‌ను కాంగ్రెస్ సాధించలేక పోయే అవకాశాలు ఉన్నాయి. ఇటీవల ఎల్బీనగర్ నియోజకవర్గంలో కాంగ్రెస్‌లో జోష్ కనిపిస్తుంది. ఎల్బీనగర్ నియోజకవర్గం నుండి బీఆర్ఎస్ అభ్యర్థిగా ఎల్బీనగర్ నుండి ఎమ్మెల్యేగా పోటీ చేసిన రామ్మోహన్ గౌడ్ కాంగ్రెస్‌లో చేరారు. లింగోజిగూడ డివిజన్ మాజీ కార్పొరేటర్ ముద్రబోయిన శ్రీనివాసరావు బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరారు. వనస్థలిపురం డివిజన్ కార్పొరేటర్ వెంకటేశ్వర్ రెడ్డి బీజేపీకి రాజీనామా చేసి కాంగ్రెస్ లో చేరారు. అదేవిధంగా మాజీ కౌన్సిలర్లు ఈశ్వరమ్మ యాదవ్, లింగాల నాగేశ్వరరావు కాంగ్రెస్‌లో చేరారు. చంపాపేట్ డివిజన్ మాజీ కార్పొరేటర్ రమణారెడ్డి బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్ లో చేరారు. దీనివలన ఎల్బీనగర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ గత అసెంబ్లీ కంటే ఇప్పుడు జరుగుతున్న పార్లమెంట్ ఎన్నికల్లో బలోపేతంగా కనిపిస్తుంది.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎల్బీనగర్ కాంగ్రెస్ నాయకులకు ఇచ్చిన 30 వేల మెజార్టీ టార్గెట్‌ను దాటాల్సి ఉంటుంది. గతంలో రేవంత్ రెడ్డికి వచ్చిన 29 వేల మెజార్టీని దాటకపోతే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దగ్గర కాంగ్రెస్ నాయకులు సంజాయిషి ఇచ్చుకునే పరిస్థితి వచ్చే ప్రమాదం పొంచి ఉన్నది. ఎల్బీనగర్ నియోజకవర్గంలో హాట్ టాపిక్‌గా 30 వేల మెజార్టీ దాటుతుందా లేదా అనేది నియోజకవర్గంలో చర్చాంశంగా మారింది. 30 వేల మెజార్టీ దాటితే ముఖ్యమంత్రి దగ్గర కాంగ్రెస్ నాయకులకు తిరుగు ఉండదు. ఒకవేళ మెజార్టీ దాటకపోతే ఇన్ని అవకాశాలు ఉండి కూడా మెజార్టీ తీసుకురాలేకపోయారని అపవాదులను పొందే అవకాశాలున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన 30 వేల మెజార్టీ టార్గెట్ పార్లమెంట్ ఎన్నికల ఫలితాల వరకు వేచి చూడాల్సిందే..

వాకర్స్‌ను కలిసిన ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి

నవతెలంగాణ- సంతోష్‌నగర్

పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ఆదివారం మల్కాజిగిరి పార్లమెంటు బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి మద్దతుగా చంపాపేట డివిజన్ పరిధిలోని సాయిరాం నగర్ కాలనీ పార్కు, డిఫెన్స్ కాలనీ పార్కు నందు వాకర్స్ సభ్యులను కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కారు గుర్తుకు ఓటేసి, రాగిడి లక్ష్మారెడ్డిని అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మోసపూరిత వాగ్దానాలు చేసి గద్దెనెక్కిన తరువాత ప్రజా సమస్యలను గాలికి వదిలేసిందని విమర్శించారు. ప్రజలు ఇప్పుడు మార్పు కోరుకుంటున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు సీనియర్ నాయకులు, మహిళలు, వాకర్స్, కార్యకర్తలు పాల్గొన్నారు.





మల్కాజిగిరి పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పట్నం సునీత మహేందర్ రెడ్డిని భారీ మేజార్టీతో గెలిపించాలని కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ అన్నారు. ఆదివారం బండి రమేష్ కేపీహెచ్‌బీ కాలనీలోని పలు చర్చిల్లో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కాలనీ రోడ్ నెంబర్ వన్ లోని ట్రినిటీ లూథరన్ చర్చి, లార్డ్ గ్రేస్ మినిస్ట్రీస్ చర్చిల్లో జరిగిన ప్రార్థనల్లో పాల్గొని క్రిస్టియన్ సోదరులకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఓ మహిళగా ఎంతో అనుభవజ్ఞురాలు నిబద్ధతతో రాజకీయాలు నిర్వహిస్తున్నారని తప్పనిసరిగా ఆమెను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేకల మైఖేల్, శేరి సతీష్ రెడ్డి, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, రాజపుత్, శివ చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

రాగిడి లక్ష్మారెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలి

- తూము శ్రావణ్ కుమార్



నవతెలంగాణ-కూకట్‌పల్లి

కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆదేశాలమేరకు, మల్కాజిగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపించాలని కోరుతూ.. మూసాపేట్ డివిజన్ జనతా నగర్‌లలో మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో..ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆరు గ్యారెంటీల పేరుతో కాంగ్రెస్ ప్రజలను మోసం చేస్తే, భావోద్వేగాలతో ప్రజలను రెచ్చగొడుతూ బీజేపీ ఓట్లు పొందాలని చూస్తుందని అన్నారు. ఈ ఎన్నికల్లో ప్రజలు కచ్చితంగా రెండు జాతీయ పార్టీలకు బుద్ధి చెబుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు విష్ణు, వెంకటస్వామి, జైరాజ్, అరుణ్, సతీష్, రమేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

నేటి విద్యార్థులే రేపటి దేశ భవిష్యత్తు



- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

నవతెలంగాణ-కూకట్‌పల్లి

నేటి విద్యార్థులే రేపటి దేశ భవిష్యత్తు అని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. చదువుకు విరామం లేదు తరతరా లకు తరగని గని చదువొక్కటే ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఇటీవల వెల్లడైన పదవ తరగతి ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన దయార్ గుడాలో నివాసం ఉండే, ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల గురించి విషయం తెలియడంతో, విద్యార్థులైన మేఘన, నందకిషోర్‌లను,ఎమ్మెల్యే తన క్యాంప్ కార్యాలయంలో పిలిపించి అభినందిస్తూ ఘనంగా సత్కరించార. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశ భవిష్యత్తును నిర్ణయించేది విద్యార్థులే అని, కనుక దయచేసి గొప్ప గొప్ప చదువులు చదవాలని, ఇలాంటి విద్యార్థులను చదువు పట్ల ప్రోత్సహిస్తున్న వారి కుటుంబ సభ్యులను అభినందించి మరొక్కసారి విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

అత్యుత్తమ ఫలితాల్లో మేటి...

బ్రైట్ పాఠశాలకు లేదు సాటి

- చైర్మెన్, కరస్పాండెంట్ లయన్.వినోద్ జాదవ్
- పదిలో ప్రతిభ చాటిన బ్రైట్ పాఠశాల విద్యార్థులు



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

అత్యుత్తమ ఫలితాలలో మేటి.. బ్రైట్‌కు లేదు సాటి.. అని బ్రైట్ కాన్సెప్ట్ ఉన్నత పాఠశాల చైర్మెన్, కరెస్పాండెంట్ లయన్ వినోద్ జాదవ్ అన్నారు. రంగారెడ్డినగర్ డివిజన్ రంగారెడ్డినగర్ ప్రాంతంలో గల బ్రైట్ కాన్సెప్ట్ ఉన్నత పాఠశాల విద్యార్థులు (2023-24) పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో కే.రితిక. జీపీఏ 10/10, ఆకాంక్ష, రుష్మితలు జీపీఏ 9.7, జీపీఏ 9.0 గ్రేడులు 30 మంది విద్యార్థులు సాధించి 99 శాతం ఉత్తీర్ణతతో ఈ ప్రాంతానికే తలమానికంగా నిలిచి విజయకేతనం ఎగరవేయడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన సందర్భంగా ఆదివారం పాఠశాల క్యాంపస్‌లో అధ్యాపక బృందంతో కలిసి టాపర్ విద్యార్థులకు పుష్పగుచ్ఛాలు అందజేసి ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలకు మొత్తం 58 మంది హాజరు కాగా 57 మంది విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచారని తెలిపారు. విద్యార్థులు విద్యతోపాటు ఆసక్తి కల పలు రంగాలలో రాణిస్తూ భవిష్యత్తులో అత్యున్నత స్థానానికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఇదే స్ఫూర్తి కొనసాగిస్తూ తల్లిదండ్రులకు, గురువులకు, మన దేశానికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని సూచించారు.

ప్రతి సబ్జెక్టులో అపార అనుభవజ్ఞులైన అధ్యాపక బృందంచే విద్యార్థుల మనోభావాలకు అనుగుణంగా విద్యనందిస్తూ ఉత్తములుగా (జెమ్స్) తీర్చిదిద్దుతున్నామన్నారు. ఈ ప్రాంతంలో అత్యధికంగా కార్మికులు, కర్షకులు, పేద, మధ్యతరగతి ప్రజలు నివస్తున్నారని వారి పిల్లలకు ఫీజుల్లో రాయితీలు కల్పిస్తూ నాణ్యమైన విద్యను అందిస్తూ విద్యార్థుల తల్లిదండ్రుల ప్రోత్సాహంతో సాధారణ విద్యార్థులతో అసాధారణ ఫలితాలు సాధించగలిగామన్నారు. తమ పాఠశాలలో చదివిన ఎంతో మంది విద్యార్థులు ఉన్నత హోదాల్లో ఉండడం గర్వకారణంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ఆయేషా బేగం, ఉపాధ్యాయులు వికాస్ జాదవ్, సతీష్ కుమార్, ముంతాజ్ బేగం, శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో బ్రైట్ విద్యార్థుల రాష్ట్రస్థాయి ప్రతిభ



- విద్యార్థులను అభినందించిన యాజమాన్యం, అధ్యాపక బృందం

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫలితాలలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం రంగారెడ్డి నగర్ డివిజన్, రంగారెడ్డినగర్ ప్రాంతానికి చెందిన బ్రైట్ కాన్సెప్ట్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు రాష్ట్రస్థాయి ప్రతిభ కనబరచడం ఎంతో గర్వకారణంగా ఉందని పాఠశాల చైర్మెన్, కరస్పాండెంట్ లయన్ వినోద్ జాదవ్ సంతోషం వ్యక్తం చేశారు.ఈ మేరకు ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఎం.గణేష్ 466/470,జే.ఋషికేష్ 466/470,బి.అరవింద్ బైపీసీ విభాగంలో 432/440, రేష్మ శ్రీదేవి 458/470,తో పాటు ద్వితీయ సంవత్సరం లో సతీష్ 976/1000, జి.మనీష్, 975/1000,ఝాన్సీ 975/1000. మార్కులతో రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించిన విద్యార్థులను ఆదివారం పాఠశాల క్యాంపస్‌లో అధ్యాపక బృందంతో కలిసి ఆయన పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు. భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని వారు ఆకాంక్షించారు. తమ పాఠశాలలో చదివిన విద్యార్థులకు చిన్ననాటి నుంచే క్రమశిక్షణ, సామాజిక విలువలు, నేర్పడంతోపాటు వారి మనోభావాలకు అనుగుణంగా అనుభవజ్ఞులైన అధ్యాపకులచే విద్యాబుద్ధులు విద్యనందించినందులకే ఇంతటి రాష్ట్ర స్థాయి ర్యాంకులు తమ విద్యార్థులు సాధించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ఆయేషా బేగం, ఉపాధ్యాయులు వికాస్ జాదవ్, సతీష్ కుమార్, ముంతాజ్ బేగం, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి



- ఐఎన్‌టీయూసీ రాష్ట్ర మాజీ కౌన్సిలర్ గూడ వరమ్మ

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

కాంగ్రెస్ పాలనలోనే రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందుతుందని జిల్లా మహిళా కాంగ్రెస్ నాయకురాలు, మాజీ కౌన్సిలర్ గూడ వరమ్మ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా ఆదివారం జగద్గిరిగుట్ట డివిజన్ పరిధి మగ్దూం నగర్ ప్రాంతంలో ఐ.ఎన్.టి.యు.సి రాష్ట్ర నాయకులు గూడ ఐలయ్య గౌడ్, కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి ప్రచారం ముమ్మరం చేశారు. మల్కాజిగిరి పార్లమెంట్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సునీత మహేందర్ రెడ్డిని గెలిపిద్దాం జగద్గిరిగుట్టలో ఆర్టీసీ డిపో సాధిద్దాం అంటూ నినాదా లు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గడచిన పదేండ్లలో రాష్ట్రంలో బీఆర్ఎస్ పాలకులు, కేంద్రంలో బీజేపీ పాలకులు ప్రజలకు ఏం చేశారో చెప్పాలన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ఒకటేనని ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో చేయి గుర్తుకు ఓటు వేసి పట్నం సునీత మహేందర్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కరపత్రాలు పంచుతూ ఓటర్లను అభ్యర్థించారు. ఈ ప్రచారంలో రేవంత్ రెడ్డి యువసేన నాయకులు గూడ సాయి ప్రవీణ్ గౌడ్, సిహెచ్.లక్ష్మి, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం



- శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి జగదీశ్వర్ గౌడ్

నవతెలంగాణ-కూకట్‌పల్లి

కాలనీలలో ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని శేరిలింగంపల్లి కాంగ్రెస్ నియోజకవర్గం ఇన్‌చార్జి జగదీశ్వర్ గౌడ్ తెలిపారు. ఆదివారం ఉదయం ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని, తులసివనం సొసైటీలో, అనేక కాలనీల అసోసియేషన్ సభ్యులతో, అల్పాహారం కార్యక్ర మంలో సీనియర్ నాయకులు భవ్యస్ ఆనంద్ ప్రసాద్, కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్, నాయకులు గొట్టిముక్కల వేంకటేశ్వర రావులతో కలిసి శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వి.జగదీశ్వర్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హస్తం గుర్తుకు ఓటు వేసి, కాంగ్రెస్ పార్టీని గెలిపిం చాలని కోరారు. ప్రభుత్వం తరపున అన్ని విధాలుగా అందుబాటులో ఉంటూ, పదేండ్ల బీజేపీ పాలనలో, దేశంలో అభివృద్ధి మాటే లేకుండా పోయిందన్నారు. సంక్షేమ పథకాలు కనుమరుగయ్యా యనీ, కార్పొరేట్ శక్తుల కోసమే బీజేపీ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. పేద, మధ్య తరగతి ప్రజల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరిం చారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు, కాలనీ అసోసియేషన్ సభ్యులు, మైనారిటీ సోదరులు, మహిళలు, తదితరులున్నారు.

పదేండ్లలో విధ్వంసం సృష్టించిన బీజేపీ

- ప్రజలను వంచించి కార్పొరేట్లకు ఊడిగం చేసే బీజేపీ ఓడించండి
- సీపీఐ(ఎం) మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి పి.సత్యం
- కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గాల్లో బైక్ ర్యాలీ



నవతెలంగాణ-సిటీబ్యూరో/కుత్బుల్లాపూర్

పదేండ్ల పాలనలో కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం విధ్వంసం సృష్టించిదని సీపీఐ(ఎం) మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి పి.సత్యం అన్నారు. బీజేపీని ఓడించండి, ఇండియా కూటమి, కాంగ్రెస్ మల్కాజిగిరి అభ్యర్థి పట్నం సునీతా మహేందర్ రెడ్డిని గెలిపించాలని కోరుతూ పార్టీ ఆధ్వర్యంలో కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి నియోజకవర్గాల్లో ఆదివారం భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ బైక్ ర్యాలీ ప్రారంభ సభ షాపూర్‌నగర్ రైతు బజార్ వద్ద జరిగింది. పార్టీ కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ఇన్‌చార్జి కీలుగాని లక్ష్మణ్ అధ్యక్షత జరిగిన ఈ సభలో పి.సత్యం, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి భూపతిరెడ్డి జెండా ఊపి బైక్ ర్యాలీ ప్రారంభిం చారు. ఈ సందర్భంగా పి.సత్యం మాట్లాడుతూ పదేండ్లలో విధ్వసం సృష్టించిన బీజేపీ తిరిగి అధికారంలోకి రాకుండా ఓడించాలని పిలుపు నిచ్చారు. ధరలు తగ్గిస్తామని అధికారంలోకి వచ్చిన బీజేపీ గడిచిన పదేండ్లలో ధరలు విపరీతంగా పెంచిందన్నారు. గ్యాస్, పెట్రోలి యం, నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగాయన్నారు. ఏడాదికి 2 రెండు కోట్లు ఉద్యోగాలు కల్పిస్తామన్న బీజేపీ గడిచిన పదేండ్లలో కొత్త ఉద్యోగాలు సష్టించకపోగా ఉన్న ఉద్యోగాలు ఊడిపోయేలా చేసిందన్నారు. దేశంలో మునుపెన్నడూ లేని విధంగా నిరుద్యోగం పెరిగిందన్నారు. దేశంలో బీజేపీ హయాంలో నిరంకుశ పోకడలు పెరిగాయనీ, బీజేపీ ప్రజాస్వామిక హక్కుల్ని కాలరాస్తూ ప్రశ్నించే వారి గొంతు నొక్కుతున్నదని చెప్పారు. దేశంలో ఫెడరల్ స్ఫూర్తికి తిలోదకాలు ఇస్తూ రాష్ట్రాల హక్కుల్ని హరిస్తుందన్నారు. భారత రాజ్యాంగం స్ఫూర్తి అయిన లౌకిక వాదానికి చేటు తెచ్చే విధంగా బీజేపీ ప్రభుత్వం వ్యవహరిస్తుందన్నారు. బీజేపికి 400 సీట్లు వస్తే రాజ్యాంగాన్ని మారుస్తారనీ, రిజర్వేషన్లకు కూడా ఎసరు పెడతారని హెచ్చరించారు. ఇప్పటి వరకు జరిగిన ఎన్నికల్లో ఉత్తర భారతంలో సీట్ల సంఖ్య తగ్గుతుందని బీజేపీకి భయం పట్టుకుందని, అందుకే విద్వేషాలు రెచ్చగొట్టే పని చేస్తుందనీ, ఆ ఉచ్చులో పడొద్దని ప్రజల్ని కోరారు. మల్కాజిగిరి పార్లమెంట్ నియోజక వర్గానికి బీజేపీ చేసిన మేలు ఏమీ లేకపోగా, హాని చేసిందని తెలిపారు. పారిశ్రామిక జిల్లా అయిన మేడ్చల్-మల్కాజిగిరిలో ప్రభుత్వ రంగ సంస్థల్ని నిర్వీర్యం చేసిందనీ, జిల్లాకు రావాల్సిన ఐటీఐఆర్‌ని రద్దు చేసిందని తెలిపారు. ఈ నియోజకవర్గంలో బీజేపీ వారికి ఓటు అడిగే హక్కు లేదన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపునకు కషి చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి భూపతిరెడ్డి మాట్లాడుతూ మల్కాజిగిరిలో గెలిచేది కాంగ్రెస్ అని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ హయాంలో ప్రజలు చాలా ఇబ్బందులకు గురయ్యారన్నారు. గడిచిన పదేండ్లలో బీజేపీ దేశ అభివద్ధిని అస్తవ్యస్తం చేసిందన్నారు. బీజేపీ ఓడించేందుకు అన్ని శక్తులూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలో గతం కంటే కాంగ్రెస్ బలం పుంజుకుం దనీ, బీజేపీ ఓడిపోవడం, కాంగ్రెస్ గెలవడం ఖాయమన్నారు.

సీపీఐ(ఎం) కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ఇన్‌చార్జి కీలుగాని లక్ష్మణ్, కూకట్‌పల్లి నియోజకవర్గం ఇన్‌చార్జి ఐలాపురం రాజశేఖర్, కూకట్‌పల్లి మండల కార్యదర్శి ఎం.శంకర్, బాచుపల్లి మండల కార్యదర్శి బి.వెంకట్రామయ్య నేతత్వంలో జరిగిన ఈ భారీ బైక్ ర్యాలీ షాపూర్‌నగర్, బాలానగర్ క్రాస్ రోడ్డు, వై జంక్షన్, కూకట్‌పల్లి, జేఎన్టీయూ, ప్రగతినగర్, గాజులరామారం మీదుగా షాపూర్‌నగర్‌కు చేరుకుంది. ఈ ర్యాలీలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.అశోక్, జిల్లా కమిటీ సభ్యులు ఎం.శంకర్, కష్ణానాయక్, చంద్రశేఖర్, కరుణ, వెంకట నరసయ్య, బాలు, దేవదానం, అరుణ్, తదితరులు పాల్గొన్నారు.

రేపు బీసీ జర్నలిస్టుల సమావేశం



నవతెలంగాణ-కూకట్‌పల్లి

బీసీ జర్నలిస్టుల సమావేశం రేపు 7వ తేదీ, మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహించబడునని, సీనియర్ జర్నలిస్ట్ శిల్వేరి శ్రీశైలం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ ఓబీసీ సెల్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ కే.లక్ష్మణ్ హాజరవుతారని పేర్కొన్నారు. సమాజాన్ని ప్రభావితం చేసే మేధావి వర్గమైన జర్నలిస్టులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఈ పరిస్థితులను అధిగమించడానికి జర్నలిస్టుల సమస్యలపై చర్చించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా ఉన్నటువంటి పరిస్థితుల్లో సమాజంలో బీసీ జర్నలిస్టుల పాత్ర, జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలపై కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చేందుకు ఈ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ సమావేశం లక్డీ కపూల్‌లోని సెంట్రల్ కోర్టు హోటల్ రేపు ఉదయం 10 గంటల నుంచి ఒంటిగంట వరకు సమావేశం నిర్వహించబడుతుంది అని పేర్కొన్నారు. కాబట్టి బీసీ జర్నలిస్టుల సమస్యలు పరిష్కారానికి ఈ సమావేశానికి బీసీ జర్నలిస్టులు హాజరై జయప్రదం చేయాలని సిల్వేరి శ్రీశైలం కోరారు.

అధికారిక వెబ్‌సైట్‌లో మెరిట్, సెలక్షన్ జాబితా

- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ టి.రఘునాథస్వామి



నవతెలంగాణ-సిటీబ్యూరో

కుత్బుల్లాపూర్ ప్రభుత్వ వైద్య కాలేజీలో వివిధ కేడర్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి మెరిట్, సెలక్షన్ జాబితాను మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అధికారి వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్టు డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ టి.రఘు నాథస్వామి తెలిపారు. https://medchal-malkajgiri. telangana. gov.in/ లో అప్‌లోడ్ చేసినట్టు తెలి పారు. ఎంపికైన అభ్యర్థులు నేడు ఉదయం 11 గంటలకు తప్పనిసరిగా అన్ని అవసరమైన పత్రాలతో డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయానికి హాజరు కావాలని కోరారు.

ఆల్విన్ కాలనీలో కాంగ్రెస్‌లోకి భారీ చేరికలు



నవతెలంగాణ-కూకట్‌పల్లి

ఆల్విన్ కాలని డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ ఆధ్వర్యంలో, చేవెళ్ల పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి, గడ్డం రంజిత్ రెడ్డి సోదరుడు నరేందర్ రెడ్డి, అల్లుడు రాజేష్ రెడ్డిల సమక్షంలో, ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఆదర్శ్ నగర్, దత్తాత్రేయ కాలనీ, సుభాష్ చంద్రబోస్ నగర్, గణేష్ నగర్ కాలనీలకు చెందిన సుమారు ఐదు వందల మంది, కాలనీ వాసులు కాంగ్రెస్ కండువా కప్పుకుని పార్టీలో జాయిన్ అయ్యారు. ఈ కార్యక్రమంలో సంజీవ్ రెడ్డి, దొడ్ల రామకృష్ణ గౌడ్, సమ్మారెడ్డి, అనిల్ రెడ్డి, గిరి ప్రసాద్ రెడ్డి, పాండుగౌడ్, భాస్కర్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల ప్రజలకు అభయహస్తం కాంగ్రెస్

- మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు అభయహస్తం కాంగ్రెస్ అని మాజీ ఎమ్మెల్యే,కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా శనివారం సాయంత్రం రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి రంగారెడ్డినగర్, పంచశీల కాలనీ, చెన్నారెడ్డి నగర్ కాలనీల్లో కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటికి తిరుగుతూ ఎన్నికల ప్రచారాన్ని చేపట్టారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బలపరిచిన మల్కాజిగిరి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి సునీత మహేందర్ రెడ్డిని హస్తం గుర్తుకి ఓటేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలే సునీత మహేందర్ రెడ్డిని గెలిపిస్తాయని ధీమా వ్యక్తం చేశారు. సునీత మహేందర్ రెడ్డి గత 15 ఏండ్లుగా జడ్పీ చైర్మెన్‌గా పనిచేస్తూ అనేక సేవా కార్యక్రమాలు చేపట్టారని ఎంపీగా గెలిస్తే మన మల్కాజ్గిరి ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేస్తారని అన్నారు. ఎంపీగా ఆమెను గెలిపించుకొని కుత్బుల్లాపూర్ నియోజక వర్గానికి ప్రత్యేక నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేసుకుందామన్నారు. ఎన్నికల తర్వాత మిగతా హామీలను కూడా కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తుందన్నారు. బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు ఒక్కటై కాంగ్రెస్ పార్టీని ఓడించాలని కుట్రలు చేస్తున్నాయని ఎవరెన్ని కుట్రలు పన్నినా సునీతా మహేందర్ రెడ్డి గెలుపుని ఆపలేరని, కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నుంచే లక్ష మెజారిటీ వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు బి.శివకుమార్ నాయకులు మోతె శ్రీనివాస్ యాదవ్, వెంకట్, సుబ్బారెడ్డి, జయరాం, గణేష్ పాల్గొన్నారు.

పద్మశాలీల సంక్షేమానికి కృషి



- ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

పద్మశాలీల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి అన్నారు. మల్కాజిగిరి పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్ రెడ్డి గెలుపునకు మద్దతుగా కుత్బుల్లాపూర్ పద్మశాలి సంక్షేమ సంఘం అధ్యక్షులు, మిత్ర సేన సంఘం అధ్యక్షు లు బేతి గోపాల్ ఆధ్వర్యంలో రంగారెడ్డి నగర్ డివిజన్ పట్వారి కాలనీలోని బేతి గోపాల్ నివాసంలో జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి సమక్షంలో, మాజీ ఎమ్మెల్యే శ్రీశైలం గౌడ్, కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ ఇన్‌చార్జి కోలన్ హనుమంత్ రెడ్డి సలహా మేరకు నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. పట్నం మహేందర్ రెడ్డి వారికి కండువాలు వేసి కాంగ్రెస్ పార్టీలోకి స్వాగతించారు. బేతి గోపాల్ గారి చిన్ననాటి మిత్రులైన పట్నం మహేందర్ రెడ్డి కోరిక మేరకు గోపాల్ తన మిత్ర సేన బృందంతో పాటు పలువురు పద్మశాలి సంఘం నాయకులను తీసుకొని కాంగ్రెస్ పార్టీలో చేరడంతో ఈ ప్రాంతంలో కాంగ్రెస్‌కు మరింత బలం పుంజుకుంది. ఎంపీ అభ్యర్థి సునీత మహేందర్ రెడ్డి గెలుపుకు కృషిచేసి అధిక మెజార్టీని అందజేస్తామని ఈ సందర్భంగా బేతిగోపాల్ ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీలో చేరిన వారిలో పద్మశాలి సంఘం నాయకులు మునిపల్లి జనార్ధన్, వర్కల బాలాజీ, పాలడుగు ఆంజనేయులు, పాలడుగు సత్యనారాయణ, హరి నారాయణ, గూడూరు లక్ష్మీనరసింహులు, బేతి నవీన్, బ్రహ్మానందం, రంగనాథం, మాయ కోటి నిరంజన్, తదితరులతో పాటు 500 మంది కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి మాట్లాడుతూ తన చిన్ననాటి మిత్రులైన బేతి గోపాల్ తనకు కుడి భుజంగా ఉంటూ సేవలందిస్తున్నందుకు కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషి చేస్తున్న అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

కాసాని జ్ఞానేశ్వర్ గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం

- ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ



నవతెలంగాణ-కూకట్‌పల్లి

వివేకానంద నగర్ డివిజన్ పరిధిలోని వివేకానంద నగర్ కాలనీలో ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ ఆధ్వర్యంలో, ఆయన్ నివాసంలో జరిగిన సమావేశంలో కార్పొరేటర్లు రాగం నాగేందర్ యాదవ్, జూపల్లి సత్యనారాయణ, నార్నే శ్రీనివాసరావు, ఉప్పలపాటి శ్రీకాంత్, మాజీ కార్పొరేటర్ సాయి బాబా ఆయా డివిజన్‌లో బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు, అధ్యక్షులతో కలిసి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్లు, అందరూ ముక్తకంఠంతో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని ప్రకటించారు. చేవెళ్ల బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ గెలుపు మద్దతుకై, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రోడ్ షో కార్యక్రమంను జయప్రదం చేయాలని, రోడ్డు షో గూర్చి చర్చించడం, రాబోయే ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహం, ప్రచార సరళి విధివిధానాల పై చర్చించడం జరిగిందనీ తెలిపారు. ఈ సారి కూడా పార్టీ అభ్యర్థిని గెలిపించి కేసీఆర్ కి కానుకగా ఇస్తామన్నారు. పార్టీ రెండు సార్లు అవకాశం ఇచ్చిన ఇద్దరు నేతలు, ఇప్పుడు ఇతర పార్టీల నుండి పోటీ చేస్తున్నారని, ఆ ఇద్దరిని ఓడించటానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారనీ అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే ప్రజల నుంచి వ్యతిరేకత ఎదుర్కొంటుందని, కేసీఆర్‌ని ప్రజలు ఇప్పుడు గుర్తు చేసుకుంటున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రతీ గడప గడపకి వెళ్లి తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన అభివృద్ధిని వివరిస్తూ, ఓట్లు అడుగుదాం అని ఎమ్మెల్యే తెలియచేసారు. కేసీఆర్ బీసీ సామాజిక వర్గానికి పెద్ద పీట వేశారనీ, బీసీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ నిలబెట్టడం జరిగిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అందరూ కలిసి కట్టుగా పనిచేసి, సమిష్టి కృషితో పని చేసి అఖండ మెజారిటీతో గెలిపిద్దాం అని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, మాజీ కౌన్సిలర్ మోహన్ గౌడ్, మాజీ కార్పొరేటర్ రవీందర్ ముదిరాజు, గ్రంథాలయ డైరెక్టర్ గణేష్ ముదిరాజు, బీఆర్ఎస్ పార్టీ డివిజన్ల అధ్యక్షులు సంజీవ రెడ్డి,రఘునాథ్ రెడ్డి, మారబోయిన రాజు యాదవ్, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

దానం నాగేందర్‌ను గెలిపించాలి



నవతెలంగాణ-అంబర్‌పేట

దానం నాగేందర్‌ను గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా మహిళా అధ్యక్షురాలు శంభుల ఉషశ్రీ పీసీసీ కార్యదర్శి శంభుల శ్రీకాంత్ గౌడ్ ఆధ్వర్యంలో బాగ్ అంబర్‌పేట డివిజన్‌లోని మహంకాళి టెంపుల్ నుండి బుజ్జి గల్లి చాకలి బస్తీ, కుమార్ బస్తీ, మైసమ్మ టెంపుల్ లైన్, పలు బస్తీలలో ఇంటింటికి తిరుగుతూ పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ హస్తం గుర్తుకు ఓటు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు పి. జ్ఞానేశ్వర్ గౌడ్, పి నారాయణస్వామి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సత్తిబాబు గౌడ్, వై. శంకర్ గౌడ్, కోఆర్డినేటర్ వరలక్ష్మి,యూత్ కాంగ్రెస్ అధికార ప్రతినిధి కోటం అనిల్ కుమార్, ఈ ప్రభాకర్, డివిజన్ ప్రెసిడెంట్ గడ్డం శ్రీధర్ గౌడ్ పి. వెంకటేష్ గౌడ్, రావుల సుధాకర్ ,సి .సుధాకర్, వై సందీప్ గౌడ్, కిషోర్, జి. శశి, గౌడ్, భరత్, శివ, భాస్కర్, ఈ.రాకేష్, సోషల్ మీడియా కోఆర్డినేటర్ మహేందర్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

పదిలో ప్రతిభ చాటిన కృష్ణవేణి టాలెంట్ స్కూల్



నవతెలంగాణ-ధూల్‌పేట్

పదిలో జియాగూడ కృష్ణ వేణి టాలెంట్ స్కూల్ ఉత్తీర్ణత లో ప్రతిభను చాటారు. వి నిత్య ప్రణవిని 10/10 జీపీఏ తో ప్రథమ స్థానంలో నిలువగా భాషిద్ అనీష్ 9.8 జీపీఏతో రెండవ స్థానం సాధించగా జి.లావణ్య, కే రాఘవేంద్ర, కే.పల్లవి గౌడ్‌లు 9.7 జీపీఏలు కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా స్కూల్ అడ్మిన్ ప్రిన్సిపల్ ఎస్.శ్రీనివాస్, అకాడమిక్ ప్రిన్సిపల్ పల్లె పోగు శ్రీకాంత్‌లు మాట్లాడుతూ.. పది లో విద్యార్థులు 98శాతం ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానంతో పాటు మంచి ఫలితాలను తీసుకువచ్చారన్నారు. అందుకు కృషి చేసిన ఉపాధ్యాయ బృందం, ఫలితాలను సాధించిన విద్యార్థులను అభినందించారు.

బీజేపీ పాలనలో బీసీలకు తీరని అన్యాయం

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్



నవతెలంగాణ-మెహిదీపట్నం

పది సంవత్సరాల బీజేపీ పాలనలో బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందని బీసీ సంక్షేమం సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ విమర్శించారు. ప్రధాని మోడీ బీసీ అయినప్పటికీ బీసీలకు ఆయన చేసిందేమిలేద న్నారు. లకిడికాపూల్ లోని అశోక హెూటల్ లో తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన బీసీల రాజకీయ మేధోమధన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సమగ్ర కులగణన, బీసీ రిజర్వేషన్ల పెంపు, క్రిమిలేయర్ రద్దు, బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ, మహిళా బిల్లులో బీసీలకు సబ్ కోటా, బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లు రిజర్వేషన్లు తదితర డిమాండ్లలో ఏ ఒక్కటి కూడా నెరవేర్చలేదన్నారు. దేశవ్యాప్తంగా కుల గణన చేసే ప్రసక్తే లేదని సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసిన బీజేపీకి బీసీల ఓట్లు అడిగే నైతిక హక్కు లేదని ఆయన స్పష్టం చేశారు. బీజేపీ పార్టీ తన మేనిఫెస్టోలో ఓబీసీల డిమాండ్లు ఒక్కటి కూడా చేర్చకుండా బీసీలను తీవ్రంగా అవమానించిందని ఆయన అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలోని ఇండియా కూటమి తన మేనిఫెస్టోలో ప్రథమ ఏజెండాగా దేశవ్యాప్త సామాజిక ఆర్థిక కుల గణన చేస్తామని పేర్కొందని దీనిని తాము స్వాగతిస్తున్నామని ఆయన తెలిపారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం కులగణన చేపట్టడం కోసం కేబినెట్ తీర్మానం చేయడం, అసెంబ్లీలో తీర్మానం ఆమోదించడం రూ.150 కోట్లు కేటాయించడం తదితర చర్యల వలన ఓబీసీల విశ్వాసం పొందిందని అందువలన ఇండియా కూటమికి సమస్త బీసీ సమాజం తరపున సంపూర్ణ మద్దతును ప్రకటిసున్నామని ఆయన తెలియజేశారు. బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు రవికృష్ణ మాట్లాడుతూ బీసీలందరూ ఇండియా కూటమికి మద్దతునివ్వాలని కోరారు. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవిలు మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చిన నాటి నుంచి బీసీలు దేశంలో తీవ్ర అన్యాయానికి గురి అవుతున్నారన్నారు. రాజకీయ చైతన్యం ద్వారా బీసీలు తమ హక్కులు సాధించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ ముదిరాజ్, స్టాండింగ్ ప్రెసిడెంట్ మహేష్ యాదవ్, కేంద్ర కమిటీ అధ్యక్షులు విక్రమ్ గౌడ్, శ్యామ్, చక్రధరి, రామరాజు, బీసీ సంఘం అధికార ప్రతినిధి హనుమాన్లు బీసీ మహిళ నాయకురాలు మణి మంజరి వివిధ జిల్లాల బీసీ సంఘం అధ్యక్షులు పాల్గొన్నారు.

పారదర్శకంగా రెండో విడత ర్యాండమైజేషన్

- 1944 పోలింగ్ కేంద్రాలకు 4862 బ్యాలెట్ యూనిట్లు కేటాయింపు
- 25 శాతం అదనంగా బీయుల కేటాయింపు
- పోటీ చేస్తున్న అభ్యర్థులు వాహన అనుమతులు వెంటనే తీసుకోవాలి
- పోటీ చేస్తున్న అభ్యర్థులు ఫారమ్ 8 సమర్పించిన 24 గంటల్లోనే ఐడి కార్డు జారీ చేస్తాం
- రిటర్నింగ్ అధికారి జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గం లోని పోలింగ్ కేంద్రాలకు రెండో విడత ఈవీఎం యంత్రాలను పారదర్శకంగా కేటాయిం చడం జరిగిందని హైదరాబాద్ పార్లమెంట్ నియోజక వర్గ రిటర్నింగ్ అధికారి జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. ఆదివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ రాజకీయ పార్టీల వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, పోటీలో ఉన్న అభ్యర్థులు, హైదరాబాద్ జనరల్ అబ్జర్వర్ పిఐ శ్రీవిద్య సమక్షంలో రెండో విడత ర్యాండమైజేషన్ ద్వారా ఈవీఎంలను కేటాయించడం జరిగింది. ఈ సందర్భంగా అనుదీప్ దురుశెట్టి మాట్లాడుతూ 09- హైదరాబాద్ పార్లమెంటరీ లోని పోలింగ్ కేంద్రాల వారిగా రెండవ విడత ర్యాండమైజేషన్ ద్వారా బ్యాలెట్ యూనిట్ లను కేటాయించడం జరిగిందన్నారు. హైదరాబాద్ నియోజకవర్గంలో 30 మంది అభ్యర్థులు పోటీ చేస్తున్నందున ఒక్కొక్క బ్యాలెట్ యూనిట్ లో 15 మంది నోటకు గాను 2 బ్యాలెట్ యూనిట్లు అవసరం కాగా నియోజవర్గంలోని 1944 పోలింగ్ కేంద్రాలకు అదనంగా 25 శాతంతో 4862 బ్యాలెట్ యూనిట్లు (మలక్ పేట్ 750, కార్వాన్ 778, గోషామహల్ 588, చార్మినార్495, చంద్రాయన గుట్ట 763, యాకుత్ పుర 830, బహదూర్ పుర అసెంబ్లీ సెగ్మెంట్ 658 మొత్తం 4862) బ్యాలెట్ యూనిట్లు అవసరం కాక మొదటి విడత ర్యాండమైజేషన్ ద్వారా 2427 బ్యాలెట్ యూనిట్లు, నేడు ఆదివారం రెండవ విడత ర్యాండమైజేషన్ ద్వారా 2427 బ్యాలెట్ యూనిట్లను పోలింగ్ కేంద్రాల వారిగా కేటాయించడం జరిగిందన్నారు. పోటీ చేస్తున్న అభ్యర్థులు వాహన అనుమతులను వెంటనే. తీసుకోవాలని, అభ్యర్థులు ఫారమ్ 8 సమర్పించిన 24 గంటల్లోనే ఐడి కార్డు జారీ చేస్తామని అయన తెలిపారు. 10 పోలింగ్ స్టేషన్లకు ఒక సెక్టోరల్ అధికారిని నియమించడం జరిగిందని ఎన్నికల సందర్భంగా పనిచేయని యంత్రాల స్థానంలో 20 నిమిషాల్లోపే సీసీటీవీ వీడియో కవరేజ్ సమక్షంలో రీప్లేస్ చేస్తారని తెలిపారు. ఈ సమావేశంలో హైదరాబాద్ జనరల్ అబ్జర్వర్ పిఐ శ్రీవిద్య, డిఆర్ఓ వెంకటాచారి, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, పోటీలో ఉన్న అభ్యర్థులు తదితరులు పాల్గొన్నారు.

వీవీ ప్యాట్లలో సింబల్ లోడింగ్ త్వరగా పూర్తి చేయాలి

హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థుల సింబల్‌లను వివిప్యాట్ లలో ఆదివారం రాత్రిలోగా లోడింగ్ పూర్తి చేయాలని హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ అనుదీప్ దూరిశెట్టి అధికారులను ఆదేశించారు. ఆదివారం హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలోని చంద్రాయన గుట్ట, గోషా మహల్, చార్మినార్, యాకుత్ పూర, కార్వాన్, బహదూర్ పూర, మలక్ పేట్ డిఆర్‌సి సెంటర్లను ఆయన సందర్శించి వివి ప్యాట్‌ల లో అభ్యర్థుల గుర్తు(సింబల్)ల లోడింగ్ ప్రక్రియను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వీవీ ప్యాట్‌లలో సింబల్ లోడింగ్ ప్రక్రియ ఆదివారం రాత్రి లోగా పూర్తి చేయాలన్నారు. అసెంబ్లీ సెగ్మెంట్లలోని అన్ని పోలింగ్ కేంద్రాల యొక్క ఈవిఎంలను సెగ్రిగేషన్ పూర్తి చేయాలని ఆయన సూచించారు. డిఆర్సి కేంద్రాల్లో పనిచేస్తున్న సిబ్బందికి త్రాగునీరు, మజ్జిగ అందజేయాలని సూచిం చారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ఓలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమయాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవాలి

- యుపీఎస్ సివిల్ సర్వీస్ ఆల్ ఇండియా ర్యాంకర్‌లు నవనీత్ ఆనంద్, హర్షిత్ శ్రీ వాస్తవ



నవతెలంగాణ-ముషీరాబాద్

సమయాన్ని సమర్థవంతంగా వినియోగించుకున్నప్పుడే జీవితంలో విజయాలను సాధిస్తామని యుపిఎస్ సివిల్ సర్వీస్ ఆల్ ఇండియా ర్యాంకర్ నవనీత్ ఆనంద్ (ఏఐఆర్ ర్యాంక్. 499, యుపిఎస్‌సి సీఎస్ఈ) హర్షిత్ శ్రీవాస్తవ (ఏఐఆర్ ర్యాంక్. 521, యుపిఎస్‌సి సీఎస్ఈ తెలిపారు. విజన్ ఐఏఎస్ అకాడమీ ఆధ్వర్యంలో సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్ (సీఎస్ఈ) ప్రభుత్వ ఉన్నత సివిల్ సర్వీసెస్‌కి రిక్రూట్‌మెంట్ కోసం యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా భారతదేశంలో నిర్వహించబడే దేశ వ్యాప్త పోటీ పరీక్ష సిద్ధమవుతున్న విద్యార్థులకు యుపిఎస్‌సి సంసిద్ధత వ్యూహాలపై సెమినార్ నిర్వహించారు. ఈ సెమినార్‌లో నవనీత్ ఆనంద్, హర్షిత్ శ్రీవాస్తవ హాజరై తమ స్ఫూర్తిదాయకమైన ప్రయాణాన్ని ఆశావహులతో పంచుకున్నారు. సమయాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవడానికి, ఆచరణాత్మక అధ్యయన ప్రణాళికలను అభివృద్ధి చేయడానికి తమ ప్రిపరేషన్ ప్రయాణంలో ప్రేరణను కొనసాగించడానికి వ్యూహాలను అందించారు. ఓపెన్ సెషన్‌లో హాజరయ్యేందుకు తెలంగాణలోని విజన్ ఐఏఎస్ హైదరాబాద్ కేంద్రానికి చేరుకున్న ఔత్సాహి కులందరూ సెషన్‌ను ప్రశంసించారు. భావి యుపీఎస్‌సీ ఆశావహులకు చక్కటి స్ఫూర్తి కలిగించిందని తెలిపారు.

'మల్కాజిగిరి' ఎలక్షన్ మేనేజ్‌మెంట్ కమిటీ కో- ఆర్డినేటర్‌గా గుంజ శ్రీనివాస్



నవతెలంగాణ-సుల్తాన్ బజార్

మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం కాంగ్రెస్ ఎలక్షన్ మేనేజ్‌మెంట్ కమిటీ కో- ఆర్డినేటర్‌గా ఐఎన్‌టీయూసీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు గుంజ శ్రీనివాస్‌ను నియమించినట్లు టీపీసీసీ ఎలక్షన్ మేనేజ్మెంట్ కమిటీ కన్వీనర్ కపిలవాయి దిలీప్ కుమార్ గాంధీ భవన్‌లో ఆదివారం జరిగిన టీపీసీసీ ఎలక్షన్ మేనేజ్మెంట్ కమిటీ సమావేశంలో ప్రకటించారు. గుంజ శ్రీనివాస్ తోపాటు మల్కాజ్గిరి పార్లమెంట్ నియోజకవర్గం కాంగ్రెస్ ఎలక్షన్ మేనేజ్మెంట్ కమిటీ ఇన్‌చార్జీగా టీపీసీసీ ఉపాధ్యక్షులు ఎం.ఆర్.జి. వినోద్ రెడ్డి, కో-ఆర్డినేటర్లుగా సీనియర్ కాంగ్రెస్ నేతలు జి. నరసింహ గౌడ్, మంజుల రెడ్డి, జి. రాఘవేంద్ర, కె. చిన్నరెడ్డి లను కూడా నియమించినట్లు కపిలవాయి దిలీప్ కుమార్ వెల్లడించారు. ఈ సమావేశంలో గుంజ శ్రీనివాస్ మాట్లాడుతూ మల్కాజ్గిరి పార్లమెంట్ నియోజకవర్గం కాంగ్రెస్ ఎలక్షన్ మేనేజ్మెంట్ కమిటీ కో- ఆర్డినేటర్‌గా నియమించి భారీ బాధ్యత తనపై పెట్టినందుకు కపిలవాయి దిలీప్ కుమార్‌కు ధన్యవాదాలు తెలిపారు. పట్నం సునీత మహేందర్ రెడ్డి గెలుపు కోసం ప్రచార కార్యక్రమాలను నిర్వహించేందుకు నియోజకవర్గం 'ఇండియా' కూటమి భాగస్వాములైన సీపీఐ, సీపీఎం, ఆప్ నేతలతో సమావేశం ఇప్పటికే నిర్వహించామని తెలిపారు. నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులూ, కార్యకర్తలను సమన్వయపరచి అభ్యర్థి పట్నం సునీత మహేందర్ రెడ్డిను భారీ మెజారిటీతో గెలిపించుకొని సోనియా గాంధీకి బహుమతిగా ఇస్తామని గుంజ శ్రీనివాస్ తెలిపారు.

'ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించిన కళాశాలలపై చర్యలు తీసుకోవాలి'



నవతెలంగాణ-హిమాయత్ నగర్

ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించిన కళాశాలలపై కంటితుడుపు చర్యలు కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ రాష్ట్ర నాయకులు జీవన్ ఆది వారం ఒక ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కార్పొరేట్ విద్యా సంస్థలపై ప్రభు త్వ, విద్యాశాఖ అధికారుల నియంత్రణ కొరవ డడంతో విద్యను వ్యాపారంగా మార్చారని విమర్శించారు. ప్రభుత్వ నిబం ధనలు కనీసం పరిగణలోకి తీసుకోకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుంటే ప్రభుత్వం చోద్యం చూస్తోందని, ఇంటర్ విద్యా సంస్థలు ప్రభుత్వ నిబంధనల ఉల్లంఘున పేరిట 27 కాలేజీలకు లక్ష జరిమానా విధిస్తూ ఇంటర్ బోర్డు నిర్ణయం మంచిదైనప్పటికీ ఆ కాలేజీలను నియాంత్రించేలా పర్మిషన్ రద్దు వంటి కఠిన చర్యలు తీసుకుంటేనే భవిష్యత్తులో కార్పొరేట్ విద్యా సంస్థలు నియంత్రణలో ఉంటాయని ఆయన పేర్కొన్నారు.

వేసవి శిబిరాలు విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీస్తాయి

- కేంద్ర బాల సాహితీవేత చొక్కాపు వెంకటరమణ



నవతెలంగాణ-ముషీరాబాద్

వేసవి శిబిరాలు విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీస్తాయని కేంద్ర బాల సాహితీవేత చొక్కాపు వెంకట రమణ అన్నారు. తెలంగాణ బాలోత్సవం ఆధ్వర్యంలో బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంప్ 200 మంది విద్యార్థులతో ఆదివారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేంద్ర సాహితీ వేత్త చొక్కాపు వెంకటరమణ హాజరై మాట్లాడుతూ నిజంగా బాలబంధువు తెలంగాణ బాలోత్సవం అని అన్నారు హైదరాబాద్‌లో సమ్మర్ క్యాంపు అంటే రూ.10వేల నుండి రూ.20వేల వరకు చెల్లించాల్సిందే కానీ మన "తెలంగాణ బాలోత్సవం" ఉచిత సమ్మర్ క్యాంపు మే 5 నుండి 22 వరుకు సుందరయ్య విజ్ఞాన కేంద్రం బాగ్ లింగంపల్లి హైదరాబాద్ అందమైన, విశాలమైన హాలులో ఏకకాలంలో, అటు ఆటలు, ఇటు విజ్ఞానాన్ని అందించి, ఉత్సాహాన్ని ఉల్లాసానందించే..ఈ చక్కటి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇది పోటీ ప్రపంచం సుమా..అని చదువొక్కటే పరిష్కారం కాదు. ఏదైనా కళలలోనూ ..క్రీడలలోనూ.. ప్రావీణ్యత సాధించాలి. ప్రావీణ్యత అంటే ఎక్స్ క్వాలిఫికేషన్ అదనపు అర్హతగా గుర్తిస్తున్నారని తెలిపారు. వేసవి సెలవుల్లో .. కాలాన్ని వృధాగా కాకుండా కొత్త కళలను, సరికొత్త పనుల్లో ప్రావీణ్యాన్ని సంపాదించేందుకు పిల్లలు ఉత్సాహం చూపుతున్నారని ప్రతి పిల్లవాడిలోనూ సృజనాత్మకత దాగి ఉంటుంది. విజ్ఞానదర్శిని టి.రమేష్ మాట్లాడుతూ పిల్లలకు విజ్ఞాన శాస్త్ర విషయాలు సామాజిక పర్యావరణ విషయాలు పిల్లలకు ప్రయోగం నైపుణ్యాలు ప్రకృతి పాఠాలు మానవ సంబంధాలు పెం పొందించడం ఇతరుల నుండి ఎలా నేర్చుకోవాలి, స్నేహి తులను ఎలా సంపాదించుకోవాలి, సెల్ ఫోనుకు ఎంత దూరం ఉండాలి అనేక విషయాలు ఈ సమ్మర్ క్యాంపులో నేర్పిస్తామన్నారు. తెలంగాణ బాలోత్సవం అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ చెరువుల పెద్ద చేప లెక్క అన్నింటికన్నా చురుకైన చేపల ఉండాలని" ఒకరిని అనుకరించడం కాకుండా నీ శక్తిని నువ్వు తెలుసుకోవాలని పిల్లలకు బోధించారు. ఆంగ్ల భాష మోజులో పడి తెలుగు మరిచిపోతున్న ఈతరానికి తెలుగు మాధుర్యాన్ని పంచే బాధ్యత అమ్మధనాన్ని తెలుగుధనాన్ని తెలంగాణ బాలోత్సవం నేర్పిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బాలోత్సవం కార్యదర్శి ఎన్ సోమయ్య, ఉపాధ్యక్షురాలు మమత , కే.సుజావతి కోశాధికారి ,జి బుచ్చిరెడ్డి చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

మద్యం సేవించి వాహనాలు డ్రైవ్ చేస్తే కఠిన చర్యలు

- అబిడ్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎల్.రవికుమార్



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

మద్యం సేవించి వాహనాలు డ్రైవ్ చేస్తే సంబంధిత వ్యక్తులపై చర్యలు తప్పవని ట్రాఫిక్, మోటార్ వాహన చట్ట పరంగా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అబిడ్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎల్.రవికుమార్ అన్నారు. ఆదివారం అబిడ్స్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ.. వాహనాలు నడిపేటప్పుడు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటిం చాలన్నారు. అత్యవసర ఫోన్ వస్తే తమ వాహనాలను పక్కకు నిలుపు కుని ఎవరికి ఇబ్బంది లేకుండా సెల్ ఫోన్ మాట్లాడాలని, డ్రైవ్ చేస్తూ సెల్ ఫోన్ మాట్లాడితే చట్ట పరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. సెల్ ఫోన్ మాట్లాడుతూ వాహనాలను డ్రైవింగ్ చేస్తూ పట్టుబడితే మోటార్ యాక్ట్ సెక్షన్ 181 ప్రకారం మొదటి సారి నిందితులైన వాహన దారులకు రూ.5వందల జరిమానా, రెండో సారి, మూడో సారి దొరికితే రూ.3నెలల డ్రైవింగ్ లైసెన్స్ రద్దవుతు ందని తెలిపారు. నాల్గోవసారి దొరికితే శాశ్వతంగా డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేయడమే కాకుండా జైలు శిక్ష తప్పదని చెప్పారు. వాహనాలను నడిపే వారిలో 18 నుండి 25సంవత్సరాల వయస్సున్న యువతులు, మహిళలే అతి తక్కువ సంఖ్య లో ఉన్నారని, హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడప రాదని, వాహన దారు లు బాధ్యతతో వాహనాల ధృవ పత్రాలను వెంట పెట్టు కోవాలన్నారు. విధిగా వాహన ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్స్, వాహన ఆర్సీ వెంట ఉంచుకోవాలని సూచించారు.

ఎస్ఎస్‌సీలో మార్స్ హైస్కూల్ విజయకేతనం



నవతెలంగాణ-ధూల్‌పేట్

ఎస్ఎస్‌సీలో మార్స్ హై స్కూల్ విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. ఉత్తీర్ణత సాధించి స్కూల్‌కు ఐకాన్‌గా నిలిచారు. ఈ సందర్భంగా స్కూల్ కరస్పాండెంట్, సెక్రటరీ అహ్మద్ అలీముద్దీన్ మాట్లాడుతూ.. ముస్కాన్ ఫాతిమా 9.0 జీపీఏ సాధించి స్కూల్ మొదటి స్థానంలో నిలిచార న్నారు. పదిలో 98 శాతం ఉత్తీర్ణత పొందారని తెలిపారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు, వారికి ప్రోత్సహించిన తల్లిదండ్రులను అభినందించారు. విద్యార్థుల భవిష్యత్‌కు బాటలు వేసే విధంగా విద్యా ప్రణాళికలు రూపుదిద్దు విద్య నందించారన్నారు. విద్యార్థుల ఉత్తీర్ణత పాటు పదిలో విద్యార్థులకు ప్రత్యేక శ్రద్ధ వహించి ఉత్తీర్ణతకు ఉపాధ్యాయులు ఎంతో కృషి చేశారన్నారు. వారిని అభినందించారు.

దేశాన్ని ఇంకా భ్రష్టు పట్టించడమే మోడీ ఇచ్చే గ్యారంటీ



నవతెలంగాణ-ధూల్‌పేట్

దేశాన్ని ఇంకా భ్రష్టు పట్టించడమే మోడీ ఇచ్చే గ్యారంటీ అని సీపీఐ(ఎం) రాష్ట్ర నేత ఎం డి. అబ్బాస్ అన్నారు. సీపీఐ(ఎం) సౌత్ జిల్లా ఆధ్వర్యం లో పార్టీ కార్యాల యంలో నిర్వహించిన కాంగ్రెస్ అభ్యర్థి పరిచయ కార్యక్రమం లో ఆయన మాట్లాడుతూ.. బీజేపీ మణిపూర్ మహిళల్ని పెట్టిన చిత్రహింసలు మన కళ్లముందు ఉన్నాయన్నారు. ఈ పరిస్థితుల్లో బీజేపీనీ ఓడించడం ఇండియా కూటమి లక్ష్యమన్నారు. అందులో భాగంగా హైదరాబాద్ పార్లమెంటు స్థానానికి కాంగ్రెస్ అభ్యర్థి నీ గెలిపించేందుకు సీపీఐ(ఎం) శ్రేణులు కృషిచేస్తాయని ఆయన పేర్కొన్నారు. ఈ పరిచయ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కాంగ్రెస్ ప్రతినిధి కోట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ.. విద్యుత్ పోరాటంలో సీపీఐ(ఎం) తో కాంగ్రెస్ కల్సి పోరాడిన విష యాన్ని గుర్తు చేశారు. హైదరాబాద్‌లో బీజేపీ, ఎంఐఎంలను ఓడించే అవకాశం వచ్చిందని అందుకు ఇరు పార్టీల కార్యకర్తలు కృషి చేద్దామన్నారు. 7 అసెంబ్లీ నియోజక వర్గాల ఎన్నికలలో సీపీఐ(ఎం) ఇన్‌చార్జీలు కోటయ్య, నాగేశ్వర్, విఠల్, అబ్దుల్ సత్తార్, ఎం. బాలు, ఎం శ్రావణ్, ఎం. మీన, తదితరులు మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న పార్టీ శ్రేణులు ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మహిళ మృతి



నవతెలంగాణ-మెహిదీపట్నం

లంగర్ హౌస్ ఫ్లైఓవర్ ప్రక్కన ఉన్నటువంటి దర్గాలో గుర్తు తెలియని ఒక మహిళ మృతి చెందింది. ఈసంఘటన స్థలానికి లంగర్ హౌస్ పోలీసులు చేరుకోని ఆమె వయసు 40 నుంచి 45 సంవత్సరాల వరకు ఉంటుందని మృతికి గల వివరాలను దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. సంబంధిత మహిళ వివరాలు ఎవరికైనా తెలిసినట్లయితే లంగర్ హౌస్ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని కోరారు.

పది ఫలితాల్లో శ్రీనివాస హైస్కూల్ విజయకేతనం



నవతెలంగాణ-ధూల్‌పేట్

పది ఫలితాల్లో శ్రీనివాస హై స్కూల్ విజయకేతనం ఎగురవేసిందని స్కూల్ వైస్ ప్రిన్సిపల్ డి.కావ్య తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. పది ఫలితాల్లో విద్యార్థులు 100శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. కే.స్వర్ణ సుందరి 7.3 జీపీఏ, ఎం హర్షిత 6.3 జీపీఏ, ఎ.శ్రీదేవి 5.8 జీపీఏలు పొందారన్నారు. సబ్జె క్టుల వారీగా ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. స్కూల్ డైరెక్టర్, ప్రిన్సిపల్ వెంకటరెడ్డి విద్యార్థుల భవిష్యత్ ప్రణాళికలను అలవర్చుకునేలా విద్యా బోధనలపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ ఉపాధ్యాయులకు సూచనలు, సలహాలు ఎప్పటికప్పుడు సూచించారన్నారు. తదానుసారంగా విద్యార్థులు ప్రతిభను కనబరిచారని తెలిపారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు, సహకరించిన తల్లిదండ్రులను స్కూల్ ఇన్‌చార్జీ లావణ్య, వినయ్, ప్రత్యూష, ఉపాధ్యాయ బృందంతో కలిసి అభినందించారు.

'గాంధీ కుటుంబాల అవసరాల కోసం వంద సార్లు రాజ్యాంగ సవరణలు'

నవతెలంగాణ-హిమాయత్‌నగర్

గాంధీ కుటుంబాలు తమ అవసరాల కోసం వంద సార్లకు పైగా రాజ్యాంగాన్ని సవరణలు చేసిన విషయం సీఎం రేవంత్ రెడ్డికి గుర్తు లేదా అని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓం ప్రకాష్ బిశ్వా ప్రశ్నించారు.

బీజేపీ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు, రాజ్యాంగాన్ని రద్దు చేస్తుందంటూ నకిలీ వీడియోలతో అసత్య ప్రచారం చేస్తున్న సీఎం ఎ.రేవంత్ రెడ్డి వెంటనే దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. హెూం మంత్రి అమిత్ షా ఎన్నికల ప్రచార సభలో మతం పేరిట ముస్లిం లకు రిజర్వేషన్లు నేరమని చెప్పారన్నారు.

'రాజ్యాంగాన్ని పరిరక్షించాలంటే బీజేపీని గద్దెదించాలి'

- మాల ప్రజా సంఘాల జేఏసీ చైర్మెన్ జి.చెన్నయ్య



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

భారత రాజ్యాంగాన్ని, ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లను కాపాడుకోవాలంటే కేంద్రంలోని బీజేపీని గద్దెదించాలని మాల ప్రజా సంఘాల జేఏసీ చైర్మెన్, మాల మహానాడు జాతీయ అధ్యక్షులు జి.చెన్నయ్య పిలుపునిచ్చారు. ఆదివారం అంబేద్కర్ స్ఫూర్తి భవన్‌లో "రాజ్యాంగాన్ని, రిజర్వేషన్లను పరిరక్షిద్దాం" అనే అంశంపై రాష్ట్ర స్థాయి సదస్సును నిర్వ హించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన జి.చెన్నయ్య మాట్లాడుతూ బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే భారత రాజ్యాం గాన్ని మార్చివేసి రిజర్వేషన్లు తొలగించే ప్రమాదం ఉందని రాజ్యాంగాన్ని, రిజర్వే షన్లను కాపాడుకోవాలంటే బీజేపీని ఓడించి కాంగ్రెస్‌ని గెలిపించాలని ఆయన సూచిం చారు. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు కోసం మనమంతా అంకిత భావంతో పని చేసి బీజేపీ పార్టీని ఓడిస్తేనే దళిత బహుజనులతో పాటు మైనార్టీలకు రక్షణ ఉంటుందని తెలిపారు. ఈ వారం రోజుల పాటు నాయకులంతా ప్రతి ఇంటివెళ్లి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో పాల్గొన్న మాల ప్రజా సంఘాల జేఏసీ వర్కింగ్ చైర్మెన్లు బూర్గుల వెంకటేశ్వర్లు, గోపోజు రమేష్, మన్నే శ్రీధర్ రావు, కాదారం వినయ్ కుమార్, పుణ్య భాను ప్రకాష్ తదితరులు మాట్లాడుతూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్ రెడ్డి అంబేద్కర్ వాదులను అణిచివేయటానికి కంటోన్మెంట్ అసెంబ్లీ సీటుతో సహా మూడు పార్లమెంట్ రిజర్వుడు స్థానాల్లో ఒక్కటి కూడా మాలలకు కేటాయించలేదని ఈ నాలుగు రిజర్వుడు స్థానాల్లో బీజేపీ అభ్యర్థులను ఓడించటంతో పాటు సికింద్రాబాద్ పార్లమెంట్ అభ్యర్థి మాల వ్యతిరేకి అయిన జి.కిషన్ రెడ్డిని ఓడిస్తామని వారు హెచ్చరించారు. బీఆర్ఎస్ పార్టీ దళితులను వంచించిదని అనేక హామీలను ఇచ్చి మోసం చేసిందని ఎస్సీ కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేయడంతో పాటు ఎస్సీ సబ్ ప్లాన్ నిధులను దారి మళ్లించి దళిత గిరిజనుల జీవితాలతో ఆడుకుందన్నారు. జరగనున్న లోక్ సభ ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీ పార్లమెంట్ అభ్యర్థులను ఓడించి, కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపునకు కార్యకర్తలంతా కృషి చేయాలని జి.చెన్నయ్య పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మాల మహానాడు రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులు తాలూకా రాజేష్, రాకేష్, వలికి కృష్ణమూర్తి, రమేష్, శ్రీకాంత్, ఎల్లస్వామి, అనిల్, మహిళా నాయకురాలు తదితరులు పాల్గొన్నారు.

టీపీసీసీ లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్‌గా ఎస్.ఎస్. రావు నియామకం



నవతెలంగాణ-అంబర్‌పేట:

తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్‌గా సీనియర్ న్యాయవాది ఎస్. ఎస్. రావు నూతనంగా నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం టీపీసీసీ లీగల్ సెల్ చైర్మెన్ పొన్నం అశోక్ గౌడ్ నియామకపు ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్.ఎస్.రావు హైకోర్టులో సీనియర్ న్యాయవాదిగా పనిచేస్తున్నారు. గతంలో కేంద్ర మాజీమంత్రి పి.శివశంకర్, మాజీ యూత్ కాంగ్రెస్ అధ్యకుడు పి. సుధీర్‌కుమార్, మాజీ సీఎం మర్రి చెన్నారెడ్డిల ప్రదాన అనుచరుడిగా పని చేశారు. ఈ సందర్భంగా ఎస్. ఎస్. రావు మాట్లాడుతూ రాష్ట్రంలోని న్యాయవాదులందరికీ రూ.20 లక్షల హెల్త్ కార్డుల కోసం సీఎం దృష్టికి తీసుకెళ్తానన్నారు. న్యాయ వాదుల సంక్షే మానికి ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 100 కోట్లను విడుదల చేసిందని, ఈ నిధులు ప్రతి యేటా విడుదల చేసే విధంగా ప్రభు త్వాన్ని కోరతానన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
సికింద్రాబాద్ - సనత్‌నగర్ - జూబ్లీహిల్స్
సోమవారం | మే 06, 2024 | www.navatelangana.com

బోరబండలో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరికలు



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

బోరబండలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వెంకటేష్ వారి కుటుంబ సభ్యులు స్నేహితులు సుమారు 50 మంది ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్, జూబ్లీహిల్స్ నియోజవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ మమ్మద్ అజహరుద్దీన్, హైదరాబాద్ మాజీ డిప్యూటీ మేయర్ బోరబండ కార్పొరేటర్ బాబా ఫసియుద్దిన్‌సతిమణీ హబీబా సుల్తానా ఆధ్వర్యంలో కాంగ్రెస్ కండువాలు వేసుకుని పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని అత్యధిక మెజార్టీతో గెలుపు కోసం తమ వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

రాజీవ్‌గాంధీ నగర్‌లో కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

రాజీవ్ గాంధీ నగర్‌లో కాంగ్రెస్ ఇంటింటి ప్రచారాన్ని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు భవాని శంకర్ ఆదేశాల మేరకు స్థానిక కాంగ్రెస్ నాయకుడు వసంత ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా హస్తంగుర్తుపై ఓటు వేసి, సికిం ద్రాబాద్ పార్లమెంట్ అభ్యర్థి దానంనాగేందర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కరపత్రాలు పంచుతూ ప్రచారాన్ని నిర్వ హించారు. ఈ ప్రచారంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు పాండు, మనోహర్‌టీ లోకేష్ ,రాము, నాగయ్య, యువకులు భారీగా పాల్గొన్నారు.

వస్త్ర ప్రదర్శననూ అందరూ ఆదరించాలి

- నటి సౌమ్య జాను..



నవతెలంగాణ-బంజారాహిల్స్

అమ్మ ఒడిలా ప్రేమను పంచే చేనేత వస్త్ర ప్రదర్శననూ అందరూ ఆదరించాలని నటి సౌమ్య జాను అన్నారు. ఈసందర్భంగా ఆమె సిల్క్ అండ్ కాటన్ ప్యాబ్ ఆఫ్ ఇండియా వస్త్ర ప్రదర్శన ప్రారంభోత్సవం ఆమె పాల్గొన్నారు. ఆదివారం క్రాఫ్ట్ అండ్ వీవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గుజరాత్ నేతృత్వంలో బంజారా హిల్స్ శ్రీనగర్ కాలనీలోని శ్రీ సత్య సాయి నిగమాగమంలో ఏర్పాటైన 6 రోజుల రోజుల సి ల్క్ అండ్ కాటన్ ప్యాబ్ ఆఫ్ ఇండియా వస్త్ర ప్రదర్శన ఏ ర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ. భార తీయ సంస్కృతిలో సిల్క్ హ్యాండ్ లూమ్ వస్త్రో ఉత్పత్తుల కు ఎంతో ప్రత్యేకత ఉందనీ, నేటికి వాటిపై వన్నె తగ్గలేద న్నారు. దేశంలోని పలు నగరాల చేనేత కారులు ఒకే వేదికలో పట్టు, కాటన్ హ్యాండ్ లూమ్ వస్త్ర ఉత్పత్తుల ను అందుబాటులో ఉంచడం అభినందనీయమన్నారు. నిర్వా హకులు జయేష్ మాట్లాడుతూ.. మే 9వ తేదీ వరకు కొనసాగుతున్న ప్రదర్శనలో దేశంలోని 14 నగరాల నుం డి చేనేతకారులు, చేతి పని బృందాలు తమ సిల్క్ హ్యాండ్ లూమ్ చీరలు, డ్రెస్ మెటిరియల్ వంటి 70 వేల రకాల వస్త్రో ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

దానం నాగేందర్‌కు గిరిజన సంఘాల జేఏసీ సంపూర్ణ మద్దతు



నవతెలంగాణ-ఓయూ

దానం నాగేందర్‌కు గిరిజన సంఘాల జేఏసీ సంపూర్ణ మద్దతు ఉంటుందని గిరిజన శక్తి రాష్ట్ర కమిటీ తెలిపింది. ఓయూ ఆర్ట్స్ కాలేజీ ప్రాంగణంలో గిరిజన శక్తి రాష్ట్ర కమిటీ, గిరిజన సంఘాల జేఏసీ, ఓయూ జేఏసీ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ నియోజకవర్గం అభ్యర్థి దానం నాగేందర్‌ని భారీ మెజారిటీతో గెలిపించాలని ఓయూ ఆర్ట్స్ కళాశాల వద్ద పోస్టర్‌ను విడుదల చేశారు. ఈసందర్భంగా గిరిజన శక్తి రాష్ట్ర అధ్యక్షులు శరత్ నాయక్, గిరిజన సంఘాల జేఏసీ చైర్మెన్ డాక్టర్ వెంకటేష్ చౌహన్ మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వ రంగ సంస్థల ను కార్పొరేట్ శక్తులకు అమ్ముతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ లకు ఉపాధిని దూరం చేసిందని, గిరిజన ఆడబిడ్డ భారత రాష్ట్రపతిని పార్ల మెంట్ నూతన భవన ప్రారంభోత్స వానికి ఆహ్వానించని బీజేపీ పార్టీ ఏ ముఖం పెట్టు కొని గిరిజనుల ఓట్లు అడుగుతుందని ప్రశ్నించారు. రాజ్యాంగ హక్కులను కాల రాస్తూ పరిపాలన కొనసాగించిందని మతతత్వ బీజేపీ పార్టీని ఓడించాలని బహుజన, బడుగు బలహీన వర్గాల బిడ్డలందరూ దానం నాగే ందర్‌కి అండగా ఉండాలని, గిరిజనుల హక్కుల పరిరక్షణ కోసం ఎన్నో చట్టాలను కాంగ్రెస్ పార్టీ హయాంలోనే తీసుకొచ్చి ందని గుర్తు చేశా రు. రాజ్యాంగం పరిరక్షించబడాలంటే కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని పౌర సమాజం, మేధావులు, యువకులు, రైతులు ఆలోచన చేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి దానం నాగేందర్ ని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన శక్తి రాష్ట్ర చీఫ్ కోఆర్డినేటర్ రమేష్ రాథోడ్, గిరిజన సంఘాల జేఏసీ ఉపాధ్యక్షులు నరేందర్ పవార్, రాష్ట్ర కార్యదర్శి హనుమంతు నాయక్, గిరిజన శక్తి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ నాయక్, సతీష్ నాయక్,వినోద్ నాయక్,రమేష్ నాయక్, పాల్గొన్నారు.

దానం నాగేందర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి

- కాంగ్రెస్ నాయకుల ఇంటింటి ప్రచారం
- అజాహరుద్దీన్ , మాజీ డిప్యూటీ మేయర్ బాబా ఫసియువుద్దీన్



నవతెలంగాణ- జూబ్లీహిల్స్

దానం నాగేందర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని బోరబండ డివిజన్ వీకర్ సెక్షన్ బంజారానగర్‌లో జూబ్లీహిల్స్ కాంగ్రెస్ పార్టీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే అజాహరుద్దీన్, మాజీ డిప్యూటీ మేయర్ ప్రస్తుత కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ అన్నారు. ఈసందర్భంగా ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేస్తూ, హస్తం గుర్తుపై ఓటు వేసి సికింద్రాబాద్ పార్లమెంట్ అభ్యర్థి దానం నాగేందర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ప్రజలు ప్రతి గల్లీలో శాలువాలతో పూలమాలలతో ఇద్దరినీ సన్మానించి కాంగ్రెస్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపిస్తామని ప్రతిజ్ఞ చేశారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి గోపీ నాథ్ అనేక అవకతవకలకు పాల్పడి గెలిచారని, దీనిపై అజాహరుద్దీన్ కోర్టులో కేసు వేశారని, కేసు త్వరలో పూర్తి వివరాలు తెలుస్తాయని, తిరిగి అజా హరుద్దీన్ జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే అవుతాడని ధీమా వ్యక్తం చేశారు. ఈ ప్రచారంలో కాంగ్రెస్ నాయకులు కార్య కర్తలు, మహిళలు, యువకులు, భారీగా పాల్గొన్నారు.

రాజ్యాంగ హక్కులను పరక్షించాలంటే బీజేపీని గద్దె దించాలి



- జి.చెన్నయ్య

నవతెలంగాణ-బంజారాహిల్స్

భారత రాజ్యాంగాన్ని ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లను కాపాడుకోవాలంటే కేంద్రంలో బీజేపీని గద్దె దిం చాలని మాల ప్రజా సంఘాల జేఏసీ చైర్మెన్ మాల మహానాడు జాతీయ అధ్యక్షులు జి.చెన్నయ్య తెలిపారు. ఆదివారం ఖైరతాబాద్ మింట్ కాంపౌండ్‌లోని అంబేద్కర్ స్ఫూర్తి భవన్‌లో రాజ్యాంగాన్ని, రిజర్వేషన్లను పరిరక్షిద్దాం అనే అంశంపై రాష్ట్రస్థాయి సదస్సుకు ఆయన అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాల ప్రజా సంఘాల జేఏసీ వర్కింగ్ చైర్మెన్లు బూర్గుల వెంకటేశ్వర్లు, గోపోజు రమేష్, మన్నే శ్రీధర్ రావు, కాదారం వినయ్ కుమార్,పుణ్య భాను ప్రకాష్‌తో కలసి మాట్లాడారు. బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే భారత రాజ్యాంగాన్ని మార్చివేసి రిజర్వేషన్లు తొలగించే ప్రమాదం ఉందని రాజ్యాంగాన్ని రిజర్వేషన్లను కాపాడుకోవాలంటే బీజేపీని ఓడించి కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం మనమంతా అంకితభావంతో పనిచేసే బిజెపి పార్టీని ఓడిస్తేనే దళిత బహుజనులతో పాటు మైనార్టీలకు రక్షణ ఉంటుందని ఆయన అన్నారు. ఈవారం రోజులపాటు నాయ కులంతా ప్రతి ఇంటివెళ్లి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్‌రెడ్డి అంబేద్కర్ వాదులను అణిచివేయటానికి కంటోన్మెంట్ అసెంబ్లీ సీటుతో సహా మూడు పార్లమెంటు రిజర్వుడు స్థానాల్లో ఒక్కటి కూడా మాలలకు కేటాయించలేదన్నారు. ఈనాలుగు రిజర్వుడు స్థానాల్లో బీజేపీ అభ్యర్థులను ఓడించతమే కాకుండా కూడా కిషన్‌రెడ్డిని ఓడిస్తామని వారు తీర్మా నించారు. బీఆర్ఎస్ పార్టీ దళితులను వంచించిదని అనేక హామీలను ఇచ్చి మోసం చేసిందని ఎస్సీ కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేయడంతో పాటు సబ్ ప్లాన్ నిధులను దారి మళ్లించి దళిత గిరిజనుల జీవితాలతో ఆడుకుందని బీఆర్ఎస్, బీజేపీ పార్లమెంట్ అభ్యర్థులను ఓడించి కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపునకు కార్యకర్తలు అంతా కృషి చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో మాల మహానాడు రాష్ట్ర జిల్లా స్థాయి నాయకులు తాలూకా రాజేష్,వలికి కృష్ణమూర్తి,రమేష్, శ్రీకాంత్ ఎల్ల, స్వామి, అనిల్,మహిళా నాయకురాళ్ళు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీజేపీలకు ఓట్లేస్తే ప్రజలకు ఒరిగేదేమీ లేదు

- తలసాని, పద్మారావు గౌడ్



నవతెలంగాణ-బేగంపేట్

కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు ఓట్లేస్తే ప్రజలకు ఒరిగేదేమీలేదని మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, సికింద్రాబాద్ పార్లమెంట్ అభ్యర్థి పద్మారావుగౌడ్ అన్నారు. ఆదివారం సనత్ నగర్ నియోజకవర్గ పరిధిలోని రాంగోపాల్‌పేట డివిజన్‌లో వారు ఇంటింటీ ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మినిస్టర్ రోడ్డులోని సాయిబాబా ఆలయం నుంచి ప్రచారాన్ని ప్రారంభించి కాచిబౌలి, వెంగళ్ రావునగర్, సీలైన్, ఎఫ్‌లైన్, గైదన్‌బాగ్, నల్లగుట్ట, నల్లగుట్ట మసీద్ తదితర ప్రాంతాలలో ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించారు. ముందుగా వారికి స్థానిక నాయకులు కల్లు గీసేందుకు ఉపయోగించే కల్లు లొట్టి, మోకు, ముస్తాక్‌లను అందజేశారు. ప్రచారంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు అభివృద్ధి, సంక్షేమాన్ని కోరుకుంటున్నారని, అసెంబ్లీ ఎన్నికలలో అన్ని స్థానాలలో బీఆర్ఎస్ పార్టీని గెలిపించి రుజువు చేశారని, పార్లమెంట్ ఎన్నికలలో కూడా అవే ఫలితాలు పునరావృత్తం అవుతాయని స్పష్టం చేశారు. 5నెలల్లోనే కాంగ్రెస్ పార్టీ ప్రజల విశ్వా సాన్ని కోల్పోయిందని, తమను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి పార్లమెంట్ ఎన్నికలలో ప్రజలు తగిన బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని వారు తెలిపారు. ప్రచార కార్యక్రమంలో బేగంపేట కార్పొరేటర్ టి.మహేశ్వరి, మాజీ కార్పొరేటర్ లు అత్తిలి మల్లిఖార్జున్ గౌడ్, కిరణ్మయి, డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు అత్తిలి శ్రీనివాస్ గౌడ్, నాయకులు కిషోర్, ఆంజనేయులు, గణేష్, సతీష్, సత్యనారాయణ, కోటేశ్వర్ గౌడ్, జనార్ధన్, నర్సింగ్ రావు, రహీం, యాసిన్, అలీషా, అనీఫ్, లావణ్య, పుష్ప, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల ప్రజల మద్దతు బీఆర్ఎస్ పార్టీకే

సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని అన్ని వర్గాల ప్రజలు బీఆర్ఎస్ పార్టీకి తమ సంపూర్ణ మద్దతును తెలియజేస్తున్నారని సికింద్రాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్, మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌లు అన్నారు. ఆదివారం పద్మారావు నగర్‌లో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని వారు ప్రారంభించారు. ముందుగా స్థానిక అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బన్సీలాల్ పేట కార్పొరేటర్ కుర్మ హేమలత లక్ష్మీపతి, డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు వెంకటేషన్ రాజు, పద్మారావు నగర్ ఇంచార్జి గుర్రం పవన్ కుమార్ గౌడ్, నాయకులు ఏసూరి మహేష్, శ్రీకాంత్ రెడ్డి, పుష్యంత్ రెడ్డి, రమణ, ముక్కా శ్రీనివాస్, అమృత, అనిత, కౌసల్య దుర్గ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు బ్రహ్మరథం పడుతున్న ప్రజలు



- ప్రచారంలో దూసుకెళ్తున్న డిప్యూటీ మేయర్ దంపతులు మోతె శ్రీలత శోభన్ రెడ్డి

నవతెలంగాణ-ఓయూ

సికింద్రాబాద్‌లో కాంగ్రెస్‌కు అడుగడుగునా కాంగ్రెస్‌కు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని ఆదివారం జీహెచ్ఎంసి డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి దంపతులు తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం దానం నాగేందర్ గెలుపు కోరుతూ పాదయాత్ర నిర్వహించారు.పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం తార్నాక డివిజన్‌లోని ఇసుకబావి, వినోభా నగర్‌లో సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థి దానం నాగేందర్ ని భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ప్రజాప్రభుత్వ పాలన అందిస్తున్నారని అదే కాంగ్రెస్ గెలుపును ఖాయం చేసిందన్నారు.ఈ పార్ల మెంట్ ఎన్నికల్లో తెలంగాణ నుంచి అత్యధిక సీట్లు గెలవబోతున్నామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్ర మంలో కాంగ్రెస్ నాయకులు, మహిళలు, ప్రజలు భారీ ఎత్తున పాల్గొన్నారు.

తార్నాకలో బీజేపీ నేతల ప్రచారం



నవతెలంగాణ-ఓయూ

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సికింద్రాబాద్ నుంచి కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ ఆదివారం తార్నాకలో బీజేపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకురాలు, మాజీ మేయర్ కార్తిక చంద్రారెడ్డి పాల్గొన్నారు. తార్నాక కిమ్తి కాలనీ నాగార్జున్ కమ్యూనిటీ హాల్, శిరిడి సాయి నగర్, గోకుల్ నగర్ కాలనీలో ఓటర్లను కలుసుకొని నరేంద్ర మోడీ సంక్షేమ పాలన గురించి వివరించారు. దేశ భద్రత, సమర్థవంతమైన పరిపాలన దృష్ట్యా మరొకసారి నరేంద్ర మోడీని ప్రధానమంత్రిని చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు

- ఓయూ విద్యార్థి నాయకుడు వలిగొండ నరసింహ



నవతెలంగాణ-ఓయూ

కేంద్ర బీజేపీ నరేంద్ర మోడీ విధానా లతో విశ్వవిద్యాలయంలో విద్యా కాషాయ కరణ కోసం ఆర్ఎస్ఎస్ చేసిన కుట్రలకు హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ అప్పటి వీసీ అప్పారావు అడ్మినిస్ట్రేషన్ వేధిం పులకి దళితబిడ్డ రోహిత్ వేముల ఆత్మహత్యకు పాల్పడ్డ సంగతి తెలిసిందే. ఈ కేసు నీరుగార్చి దోషులను కాపా డడం కోసం నాటి బీఆర్ఎస్, బీజేపీ ప్రభుత్వాలు కేసును పక్కదోవ పట్టించి నిందితులకు క్లీన్ చిట్ ఇచ్చిన నేపథ్యంలో తనకు అన్యా యం జరిగిందని రోహిత్ వేముల తల్లి శనివారం సీఎం కలిశారు. కేసు రీఓపెన్ చేసి, పునర్విచారణ జరిపి న్యాయం చేస్తామని వారికి చెప్పినట్లు తెలిపారు. ఆర్ఎస్ఎస్ బీజేపీ మతోన్మాద, విభజన రాజకీయాల పై పోరాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డికి తెలం గాణ స్టూడెంట్స్ పొలిటికల్ జాక్ ,దళిత రీసెర్చ్ స్కాలర్స్ తరపున కృతజ్ఞతలు చెప్పారు.

రాజ్యాంగ పరిరక్షణ కాంగ్రెస్ పార్టీతోనే : ఎంఎల్‌ఏ దానం



నవతెలంగాణ-బంజారాహిల్స్

సికింద్రాబాద్ కాంగ్రెస్ పార్లమెంట్ నియోజవర్గం అభ్యర్థి దానం నాగేందర్‌కు మద్దతు ఖైరతాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ నాయకులు విస్తతంగా ప్రచారం నిర్వహించారు. దీనిలో భాగంగా బోధనగర్ ఎక్స్ కార్పొరేటర్ ధనుంజనగౌడ్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. సికింద్రాబాద్ డీసీసీ ఉపాధ్యక్షులు వెంకట గోవిందరావు, ఎంపీ అభ్యర్థి నాగేందర్, విజయరెడ్డి, వెంకటగోవిందరావు, ముంజ గళ్ళ విజయ్ కుమార్ తదితరుల సమక్షంలో ఆదివారం బంజారాహిల్స్‌లోని ఆయన నివాసంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో దానం మాట్లాడుతూ రాజ్యాంగ పరిరక్షణ అట్టడుగు వర్గాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని, దేశంలో మార్పు అవసరమని, ప్రధానమంత్రిగా రాహుల్ గాంధీని గెలిపించుకోవడమే మన ప్రధాన కర్తవ్యమన్నారు. ఈ సందర్భంగా విజయరెడ్డి మాట్లాడుతూ దానం నాగేందర్‌ను అత్యధిక మెజార్టీతోనే గెలిపించాలని ఓటర్ల ను కోరారు. అదేవిధంగా డీసీసీ వైస్ ప్రెసిడెంట్ గోవిందా రాజు, ముంజగల విజయకుమార్ తదితరులు మాట్లా డారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎం, విజయ్ కుమార్ కాంగ్రెస్ సీనియర్ లీడర్ నాయకులు ధనరాజ్ రాథోడ్, విశాల్ ముదిరాజ్ పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు.

పబ్‌పై దాడులు..పలువురు అరెస్టు



నవతెలంగాణ-బంజారా హిల్స్

బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో వేస్ట్‌జోన్ టాస్క్ ఫోర్స్ పోలీసులు శనివారం అర్ధరాత్రి పక్కా సమాచారంతో పబ్‌లపైదాడులు నిర్వహించారు. ఈ దాడులలో పోలీసులకు నివ్వరపోయే నిజాలు లభించి నట్లు పోలీసు అధికారులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఇతర రాష్ట్రాల నుంచి యువతు ల ను తీసుకొచ్చి పబ్‌లో అసభ్యకర నృత్యాలు చేయిస్తున్నట్లు పక్క సమాచారం పబ్‌పై దాడులు నిర్వహించినట్లు వారు తెలిపారు. ఈ దాడిలో వందల సంఖ్యలో పట్టుబడ్డారు. ఇద్దరు పబ్ మేనేజర్లు, ఒక క్యాషియర్, ఒక డీజేఆపరేటర్, ఐదుగురు బౌన్సర్లు, 131 మంది కస్టమర్లు, 32 మంది మహిళలు పట్టుబడినట్లు తెలిపారు.నిబంధనల ఉల్ల ఘనల కింద పబ్ నిర్వాహకులపై చర్యలు తీసుకుం టామని పోలీసులు తెలిపారు.ఈదాడుల్లో 160మందికిపైగా యువతీ యువకుల్ని అదుపులోకి తీసు కున్నట్లు తెలిపారు. పబ్‌లో నిషేధిత మాదక ద్రవ్యాలు వినియోగించారా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేప ట్టిన ట్లు తెలిపారు. ఎక్సైంజ్ పోలీస్ అధికారులు మాట్లా డుతూ ఇటీవల నగరంలోని బేగంపేటలో యజమాన్యం ఇటువంటి చర్యలకే పాల్పడితే ఆ పబ్‌లను పూర్తిగా మూ సివేసిన విషయాన్ని సైతం వారు వెల్లడించారు. దర్యాప్తు అనంతరం పూర్తి విషయాలు వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.

నోటుకి, మద్యానికి ఓటు అమ్ముకుంటే ఐదేళ్ల భవిష్యత్తు అధోగతే!

- ప్రజల కోసం పనిచేసే అభ్యర్థులను వివేచించి ఓటు వేయాలి !!
- జైభారత్ గ్రేటర్ హైదరాబాద్ చీఫ్ కోఆర్డినేటర్ ఖదిజ్ఞాసి భాగవతుల ప్రసాద్
- డబ్బుకి, మద్యానికి ఓటు అమ్ముకుంటే బ్రతికున్నా..శవంతో సమానం



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఎన్నికల్లో రాజకీయనాయకులు చూపే డబ్బుకు, మద్యానికి ఆశపడితే - మరో ఐదేండ్ల పాటు మోస పోవ డం ఖాయమని జైభారత్ గ్రేటర్ హైదరాబాద్ చీఫ్ కో ఆర్డినేటర్ ఖదిజ్ఞాసి భాగవతుల ఆర్ ప్రసాద్ అన్నారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జైభారత్ జస్ట్ వోట్ తెలంగాణ కాంపెయిన్ కమిటీ 2023-24 ఆధ్వర్యంలో జైభారత్ గ్రేటర్ హైదరాబాద్ చీఫ్ కో ఆర్డినేటర్లు ఖదిజ్ఞాసి భాగవతుల ఆర్ ప్రసాద్, వెంకటరమణ, అన్నమయ్య గృహ సాధన సమితి జాతీయ అధ్యక్షులు శ్రీ శ్రీ శ్రీ విజయ శంకరా స్వామి, జైభా రత్ జస్ట్ వోట్ తెలంగాణ కాంపెయిన్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఖదిజ్ఞాసి సత్యనారాయణ గోల, జైభా రత్ అధికార ప్రతినిధి ఖదిజ్ఞాసి మల్లికా వల్లభాల తో కలిసి ప్రజలలో ఓటు చైతన్యం కలిగిచే ఓటు అమ్ము కోవద్దు అనే పోస్టర్లను, ధనస్వామ్యాన్ని బద్దలు కొడదాం, ప్రజాస్వామ్యాన్ని నిలబెడదాం అనే కరపత్రాలను, మా ఓట్లు అమ్మబడవు అనే డోర్ స్టిక్కర్లను విలేకరుల సమావేశంలో ఆవిష్కరించడం జరిగింది. అనంతరం జైభారత్ జస్ట్ వోట్ గ్రేటర్ హైదరాబాద్ చీఫ్ కో ఆర్డినేటర్ ఖదిజ్ఞాసి భాగవతుల ప్రసాద్ మాట్లాడుతూ పార్టీలతో సంబంధం లేకుండా - పోటీచేసే అభ్యర్థుల నైతికవర్తన, అర్హత, నిబద్ధత, సమర్థత మొదలైన వాటిని వివేచించి మాత్రమే అభ్యర్థిని ఎన్నుకోవాలని సూచించారు. అన్నమయ్య గృహ సాధన సమితి జాతీయ అధ్యక్షులు శ్రీ శ్రీ శ్రీ విజయ శంకర స్వామి , నవనీత చోర బాలకృష్ణ మఠం వ్యవస్థాపకులు శ్రీ బాలకృష్ణానంద స్వామి, జైభారత్ జాతీయ అధికార ప్రతినిధి ఖదిజ్ఞాసి మల్లికా వల్లభా తదితరులు మాట్లా డారు. ఎన్నికల్లో రాజకీయ నాయకుల ధన ప్రలోభాన్ని, ఓట్ల కొనుగోలును ఎండగడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణ పట్ల ఓటర్ల బాధ్యతను చాటి చెపుతూ జైభారత్ ఉద్యమం ఆధ్వర్యంలో ఈ పార్లమెంటరీ ఎన్నికల్లో జైభారత్ 'జస్ట్ ఓట్ క్యాంపెయిన్'ను తెలంగాణ వ్యాప్తంగా ఉధృతంగా చేపడుతున్నామని కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఖదిజ్ఞాసి సత్యనారాయణ గోల తెలిపారు. ఈ కార్యక్రమంలో జస్ట్ ఓటు గ్రేటర్ హైదరాబాద్ కో ఆర్డినేటర్ పచ్చ రమణ, కంబాల నరేందర్ పాల్గొన్నారు.





వాసవీక్లబ్ ఆఫ్ ఆధ్వర్యంలో ఓటు అవగాహన డ్రైవ్

నవతెలంగాణ-సిటీబ్యూరో

వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ ప్రాథమిక విభాగమైన వాసవీ క్లబ్ ఆఫ్ బుద్ధపూర్ణిమ, 4వ దశ పోలింగ్ రోజు మే 13న ఎక్కువ మంది బయటకు వెళ్లి ఓటు వేసేలా ప్రోత్సహించేందుకు ఓటరు అవగాహన కార్యక్రమం' 'గోఓటు" అనే ప్రత్యేక కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించింది. సికింద్రాబాద్‌లోని పార్క్ లేన్‌లోని హెూటల్ పార్క్‌లేన్‌లో జరిగిన 5వ సాధారణ సమావేశంలో, వాసవీ క్లబ్ ఆఫ్ బుద్ధపూర్ణిమ ఆధ్వర్యంలో రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఓటర్లకు అవగాహన కల్పించారు.భారత ఎన్నికల కమిషన్‌తో పాటు అనేక ఏజెన్సీలు, ఎన్‌జీఓలు ఎన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ, ఇప్పటికీ చాలా మంది పట్టణ ఓటర్లు పోల్ డేని సెలవుగా తీసుకుని ఓటింగ్‌ను దూరముంటున్నారు. వాసవి క్లబ్‌లో తరపున మావంతుగా బాధ్యతగా 'గో ఓటు' ఓటర్ అవేర్‌నెస్ డ్రైవ్ నిర్వహించామని, వాసవీ క్లబ్ ఆఫ్ బుద్ధపూర్ణిమ అధ్యక్షుడు ప్రొద్దుటూరు వీరభద్రుడు తెలిపారు.అనంతరం క్లబ్ రాబోయే మదర్స్ డే సందర్భంగా తల్లులను సత్కరించింది. అనంతరం క్లబ్ "బోల్ మోల్ కే బోల్" ఛాలెంజ్ విజేతలకు సరిగ్గా ధరలను ఊహించిన వారికి ఆయా వస్తువులను బహుకరించింది.



నవతెలంగాణ
మేడ్చల్-మల్కాజిగిరి-ఉప్పల్
సోమవారం | మే 06, 2024 | www.navatelangana.com

101వ వారం.. జ్ఞానమాల కార్యక్రమం



నవతెలంగాణ-కాప్రా

జమ్మిగడ్డ బీజేఆర్ కాలనీలో చేపట్టిన మహనీయుల జ్ఞానమాల కార్యక్రమం 101వ వారానికి చేరింది. ఆదివారం మహాత్మ జ్యోతిరావు పూలే, డాక్టర్ బీఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాలకు జ్ఞానమాల టీం సభ్యులు పూలమాల వేసి జ్ఞానమాల సమర్పించారు. ఈ కార్యక్రమంలో జ్ఞానమాల టీం ఆర్గనైజర్ గగన్ కుమార్, ఎస్.ఎ.రహీం, నర్సింహ్మా చారి, నరేందర్ రావు, దయానంద్, శ్రీనివాస్, రవి పాల్గొన్నారు.


గూడపాటి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ



నవతెలంగాణ-ఉప్పల్

ఉప్పల్ నియోజకవర్గంలోని చిల్కానగర్ డివిజన్‌లోని స్వామి వివేకానంద చౌరస్తాలో గూడపాటి ఫౌండేషన్ వ్యవస్థాపకులు గూడపాటి శరత్ ఆధ్వర్యంలో ఆదివారం వెయ్యి లీటర్ల మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శరత్ మాట్లాడుతూ వేసవి కాలం దృష్టిలో ఉంచుకొని ప్రజలకు మజ్జిగ పంపిణీ చేమని పేర్కొన్నారు. ప్రజలు ఎండలకు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలలో పబటి శేఖర్ రెడ్డి, డాక్టర్ అశోక్, ఇమామ్ సాహబ్, హేమంత్ గౌడ్, డి.మౌలాలి, తాజుద్దీన్, ప్రకాష్, శివ, మధు, అంకంరావు, శరత్ పాల్గొన్నారు.

'అలుపెరుగని పోరాటం' తెలుగు అనువాదం పుస్తకం ఆవిష్కరణ



నవతెలంగాణ-కాప్రా

తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో కమలా నగర్ ఆఫీసులో న్యూస్ క్లిక్ ఎడిటర్ ప్రబీర్ పుర్కాయస్థ రచించిన 'అలుపెరుగని పోరాటం' తెలుగు అనువాదం పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సుందరయ్య విజ్ఞాన కేంద్రం కార్యదర్శి ఎస్. వినయ్ కుమార్ అలుపెరగని పోరాటం పుస్తకం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..నాడు ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ పెట్టి ఎన్నో దుర్మార్గాలు చేశారని తెలిపారు. మోడీ నేడు కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తూ మరింత దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. నేటి పాలకుల మాతృ సంస్థ ఆర్ఎస్ఎస్, హిందూ మహాసభ ఏనాడూ స్వాతంత్ర పోరాటంలో పాల్గొనకుండా బ్రిటిష్ వారికి తొత్తులుగా పనిచేశారని చెప్పారు. దానికి సావర్కర్ పెద్ద ఉదాహరణ అని చెప్పారు. దేశంలో మతోన్మాదాన్ని రెచ్చగొట్టేందుకు మత విభజనకు పూనుకున్నారని తెలిపారు. గాంధీని హత్య చేసిన గాడ్సే వెనక ఆర్ఎస్ఎస్, హిందూ మహాసభ ప్రధాన భూమిక పోషించిందని ఆరోపించారు. ఎమర్జెన్సీ కాలంలో ఇందిరాగాంధీకి ఆర్ఎస్ఎస్ పూర్తిగా లొంగి వ్యవహరించిందని చెప్పారు. ఇలా తమ అవసరాల కోసం మతోన్మాద శక్తులు వ్యవహరించే తీరు నేటి పరిస్థితులకు కారణమని చెప్పారు. మతోన్మాద శక్తులను కూకటివేళ్లతో పెకిలించకపోతే దేశానికి మరింత ప్రమాదని పేర్కొన్నారు. సీఐటీయూ నాయకులు చంద్రశేఖర్ మాట్లాడుతూ కార్మిక చట్టాలను రద్దు చేసి కార్మికులను కట్టు బానిసలుగా చేసిన నేటి పాలకులను చిత్తుచిత్తుగా ఓడించాలని అన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన పీబీ. మాట్లాడుతూ.. పాలకుల నియంతృత్వానికి వ్యతిరేకంగా న్యూస్ క్లిక్ ద్వారా అనేక సంచలనాత్మక విషయాలను ప్రజలకు తెలిపినట్లు పేర్కొన్నారు. ప్రబీర్ పుర్కాయస్థ నాడు ఎమర్జెన్సీ కాలంలోనూ, నేడు మనువాద నియంతృత్వ కాలంలోనూ జైలుపాలయ్యారని తెలిపారు. ఆయన రచించిన అలుపెరుగని పోరాటం పుస్తకాన్ని అందరూ చదివి ఆకలింపు చేసుకోవాలన్నారు. అనంతరం అలుపెరుగని పోరాటం పుస్తకాలను హాజరైన ప్రతినిధులు కొనుగోలు చేశారు. ఈ కార్యక్రమంలో కోమటి రవి, గొడుగు యాదగిరిరావు, శ్రీనివాసరావు, శ్రీనివాస్, వై సౌమ్య, గిరీష్, ఏఆర్‌వి. ప్రసాద్, జయరాజ్, నరసింహ, లక్ష్మణ్, శివరామకృష్ణ, సిహెచ్ నాగేశ్వరరావు, శారద, మంగ, మణి, ప్రసాద్ బాబు, బాలు, రాజమల్లు, మల్లేశం, శ్రీనివాస్, శివన్నారాయణ, శ్రీమన్నారాయణ, వెంకన్న, పాష, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) పార్టీ కార్యాలయంలో కార్ల్ మార్క్స్ 206వ జయంతి



నవతెలంగాణ-కాప్రా

కమ్యూనిస్టు నాయకులు కార్ల్ మార్క్స్ 206వ జయంతిని భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కమలానగర్ పార్టీ ఆఫీసులో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డీజీ. నరసింహారావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కోమటి రవి కార్ల్‌మార్క్స్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సామాజిక ఉద్యమ నేత జయరాజు, సీనియర్ నాయకులు శ్రీమన్నారాయణ, సామాజిక ఉద్యమ నాయకులు కేకే ప్రసాద్‌బాబు మాట్లాడుతూ.. పీడిత ప్రజల పక్షాన అలుపెరుగని పోరాటం చేసిన గొప్ప నాయకుడని తెలిపారు. పెట్టుబడుదారులు తెచ్చుకునే లాభాలు వాళ్ల తెలివితేటలతో కాదని కార్మికుల కష్టార్జిత ఫలితమేనని చెప్పారని గుర్తు చేశారు. ఈ విషయాన్ని పెట్టుబడి గ్రంథం ద్వారా ప్రపంచానికి చాటి చెప్పారని తెలిపారు. ఆయన ఆ సిద్ధాంతం ఫలితంగానే చాలా సంక్షేమ రాజ్యాలుగా వచ్చాయని చెప్పారు. మార్క్స్ ప్రతిపాదించిన గతి తర్కిక భౌతిక వాదం ప్రతి ప్రదేశంలోనూ, ప్రతి చోట అన్వయించుకొని ముందుకు సాగాలని చెప్పారు. భారతదేశంలో వర్గ దోపిడీతో పాటు, సామాజిక దోపిడీ, వర్ణ వ్యవస్థ దుర్మార్గంగా పాతుకుపోయిందని పేర్కొన్నారు. దానికి వ్యతిరేకంగా పోరాడితే తప్ప సమాజం మార్పు చెందదని అన్నారు. నేటి పాలకులు మనువాదాన్ని, ఫాసిజాన్ని జోడించి అణిచివేతకు గురి చేస్తున్నారని, అలాంటి బీజేపీని ఓడించడమే తక్షణ కర్తవ్యం అని చెప్పారు. ఈ కార్యక్రమానికి గొడుగు యాదగిరిరావు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో డీజీ. నరసింహారావు, చంద్రశేఖర్, కోమటి రవి, శ్రీనివాసరావు, శ్రీనివాస్, సంతోష్, రాజమల్లు, శివన్నారాయణ, బాలు, శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీతా రెడ్డి గెలుపునకు గడపగడపకూ ప్రచారం



నవతెలంగాణ-కీసర

కాంగ్రెస్ పార్టీ మల్కాజిగిరి నియోజకవర్గ ఎంపీ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్ రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని 2వ వార్డులో మున్సిపల్ మహిళా కాంగ్రెస్ నాయకురాలు గుజ్జుక నర్మద పరుశురాం ఆధ్వర్యంలో ఆదివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. శాసనసభ ఎన్నికలకు ముందు ఇచ్చిన వాగ్దానాలను అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేసిందన్నారు. ఇప్పటికే 6 గ్యారెంటీలలో 5 గ్యారెంటీలను అమలు చేసిందన్నారు. రాష్ట్రంలో అర్హులైన వారందరికీ గ్యాస్ సిలిండర్ రూ.500 గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. మిగిలిన హామీలను పార్లమెంట్ ఎన్నికల అనంతరం అమలు చేస్తామని హామీ ఇచ్చారు. ఈనెల 13న జరిగే పార్లమెంట్ ఎన్నికలలో మల్కాజిగిరి నుంచి పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి సునీతా మహేందర్ రెడ్డికి ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో 2వ వార్డు మహిళ అధ్యక్షురాలు సులోచన, రేష్మ, స్వప్న, సౌందర్య, నాగమణి, ఆదిలక్ష్మి ,రవి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల 'కోడ్' కష్టాలు..!

- ఎన్నికల వేళ తప్పని తిప్పలు
- నగదు పరిమితితో సామాన్యులకు ఇబ్బందులు
- రూ.50వేలకు మించితే ఆధారాలు చూపాల్సిందే
- అశ్రద్ధ, నిర్లిప్తతతో ఉంటే పరేషానే..!



తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు (ఫైల్)

నవతెలంగాణ-సిటీబ్యూరో

పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమలుతో సామాన్య ప్రజలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. పెళ్లిళ్ల, శుభకార్యాలు కొనసాగుతున్న వేళ చేతిలో రూ.50 వేలకుపైగా నగదుతో బయటకు వెళ్లాలంటేనే భయపడిపోతున్నారు. బ్యాంకులో జమ చేసేందుకు వెళ్లాలన్నా, ఏదైనా వస్తువులు, నూతన వస్త్రాలు, వాహనా లు కొనాలన్నా నగదు తీసుకెళ్లడం పెద్ద సమస్యగా మారింది. ఎక్కడికక్కడ తనిఖీలు నిర్వహిస్తుండటంతో సామాన్యులకు తిప్పలు తప్పడం లేదు. నగదు తీసుకుని పోవాలంటే బిక్కుబిక్కుమంటూ ప్రయాణించాల్సివస్తోందని వాపోతున్నారు. దాదాపు నెల రోజుల క్రితం ఎన్నికల షెడ్యూల్ వెలువడినప్పటి నుంచి కోడ్ అమలులో ఉంది. దీంతో పోలీసులు, ఎన్నికల తనిఖీ అధికారులు ప్రధాన ప్రాంతాల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేసి మరీ క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. ప్రతిరోజూ పట్టుబడుతున్న నగదుతో ఎన్నికలకు సంబంధం ఉండకపోవచ్చని తెలిసినా.. నియమావళి రీత్యా ఏం చేయలేకపోతున్నారు. దీంతో వ్యాపార, ఇతర అవసరాలకు తీసుకెళ్తున్న నగదు పట్టుపడితే తలలు పట్టుకుంటున్నారు. ఎన్నికల సమయంలో నిర్వహించిన తనిఖీల్లో పట్టుబడిన నగదుకు సరైన ఆధారాల్లేకపోతే జిల్లా అధికారులు స్వాధీనం చేసుకుంటారు. ఎన్నికలు పూర్తయిన తర్వాత సరైన ఆధారాలు చూపిస్తే ఆ డబ్బులు సదరు వ్యక్తికి అప్పగిస్తారు. ఎన్నికలకు సంబంధం లేకుండా ప్రజలు నగదు తీసుకెళ్తుండగా పోలీసులు పట్టుకుంటుండటం సామాన్య ప్రజానీకంలో ఆందోళన కలిగిస్తోంది.

పట్టుబడుతున్న వారందరూ సామాన్యులే..

ఎన్నికల కోడ్ మొదలైన నాటి నుంచి తాత్కాలిక చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహిస్తున్నప్పటికీ ఇప్పటి వరకు రాజకీయ పార్టీలకు సంబంధించిన నగదు పెద్ద మొత్తంలో పట్టుబడిన దాఖలాల్లేవు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కూడా చిరు వ్యాపారులు, సామాన్య ప్రజలకు సంబంధించిన నగదు పట్టుకోవడం గమనార్హం. ఎన్నికల కోసం తరలిస్తున్న నగదు కంటే సామాన్యుల దగ్గర పట్టుబడుతున్న ఘటనలే ఎక్కువగా ఉంటున్నాయని ప్రజలు చెబుతున్నారు. ఈ రోజుల్లో రూ.50 వేలకు పైబడి నగదు తీసుకెళ్లడం సర్వసాధారణమైపోయిందని, ఏ వస్తువు కొనాలన్నా రూ.లక్షల్లో ఉంటుందని వారు పేర్కొంటున్నారు. ఇదే సమయంలో వివాహాలు, ఇతర శుభకార్యాలు, భవన నిర్మాణాలు, స్థిర, చరాస్థుల కొనుగోళ్ల, అమ్మకాల అవసరం రీత్యా నగదును వెంట తీసుకెళ్లడం సహజమేననే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

పట్టుబడిన డబ్బు ఏం చేస్తారంటే..?

రూ.50 వేల నుంచి 10 లక్షల వరకు పట్టుబడిన నగదును జిల్లా ఖజానా శాఖ కార్యాలయంలో జమ చేస్తారు. రూ.10 లక్షలకు మించి దొరికితే మాత్రం ఆదాయపన్ను శాఖ నోడల్ అధికారికి సమాచారం అందిస్తారు. పట్టుబడిన నగదును వారికి అప్పగిస్తారు. అక్కడి నుంచి నగదు ప్రభుత్వ ఆధీనంలోకి వెళ్తుంది. సరైన ఆధారాలు చూపిన తర్వాత తిరిగి పొందవచ్చు. తక్కువ మొత్తంలో పట్టుబడిన డబ్బును మాత్రం జిల్లా స్థాయి ఎన్నికల అధికారి పర్యవేక్షణలో సరైన ఆధారాలు పరిశీలించి తిరిగి అప్పగిస్తారు.

అశ్రద్ధ, నిర్లక్ష్యం అసలే వద్దు..

ఏ అవసరం కోసం నగదును తీసుకెళ్తున్నామనే విషయం సూటిగా అధికారులకు వెల్లడించాలి. వాటికి సంబంధించిన సరైన పత్రాలను చూపించడం మంచింది. నగదు వెంట ఉన్నప్పుడు భయపడినా, సరైన ఆధారాలు చూపకన్నా పోలీసులు నగదును జప్తు చేసే అవకాశం ఉంటుంది. హాస్పిటల్ చికిత్స, శుభకార్యాలకు సంబంధించి సామగ్రి, బట్టలు, తదితర వ్యాపార సంబంధిత బిల్లు చెల్లించడానికి తీసుకెళ్తుంటే వాటికి సంబంధించిన రశీదులు వెంట ఉంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పట్నం సునీతారెడ్డి గెలుపునకు సీపీఐ(ఎం) బైక్ ర్యాలీ



నవతెలంగాణ-మల్కాజిగిరి

పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్‌రెడ్డి గెలుపే లక్ష్యం మల్కాజిగిరి సీపీఐ(ఎం) మండల కమిటీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ మల్కాజిగిరిలో ప్రారంభమై కోకకోలా, ఆనంద్ బాగ్, సఫిల్ గూడ, నేరెడ్‌మెట్, సైనిక్ పురి, ఏఎస్‌రావు నగర్‌లో ముగిసింది. అనంతరం సీపీఐ(ఎం) మల్కాజిగిరి మండల కార్యదర్శి కృపాసాగర్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను మానుకోవాలని హితవు పలికారు. మోడీ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాల్లో ఏ ఒక్కటీ అమలు చేయలేదని ఆరోపించారు. మోడీ ప్రధాని అయ్యాక పదేండ్లలో ఒరగబెట్టినదేమీ లేదని విమర్శించారు. ప్రజల ఖతాల్లో రూ.15 లక్షలు కాదు కదా పదిహేను పైసలు పడలేదని ఎద్దేవా చేశారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఏమయ్యాయని ప్రశ్నించారు. పెరుగుతున్న ధరలతో ప్రజలు అల్లాడిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రూ.400 ఉన్న గ్యాస్ ధర రూ.1200 పెంచిన ఘనత మోడీకే దక్కిందని ఎద్దేవా చేశారు. డీజిల్, పెట్రోల్ రేట్లు విపరీతంగా పెరుగుతున్నాయని వాపోయారు. పదేండ్ల పాలనలో పేదలకు ఇండ్లు ఇవ్వలేదని పేర్కొన్నారు. ప్రజలకు ఉపాధి లేక పస్తులుంటే దేశ సంపదను అదానీ, అంబానీలకు దోచి పెడుతున్నాడని తెలిపారు. మతం పేరుతో ప్రజల మధ్య చిచ్చు పెట్టి రాజకీయం చేస్తున్న మోడీని ఓడించాలన్నారు. రామాలయం పేరుతో ఓట్లు అడగడం సిగ్గు చేట్టన్నారు. ఉత్పత్తిరంగాలు స్థాపిస్తే దేశం అభివృద్ధి చెందిన చరిత్ర చూశాం కానీ ఆలయాల ఏర్పాటుతో దేశం అభివృద్ధి చెందుతుందనడం దేనికి నిదర్శమని ప్రశ్నించారు. రాజ్యాంగాన్ని మారుస్తామంటున్న మోడీని చిత్తుగా ఓడించాలన్నారు. కార్యక్రమంలో మండల కొండల్, మంగ, విజయ్ కుమార్, సుమిత్ర, సూర్యకుమార్, దాస్ గుప్తా, మురలి మోహన్, ప్రభాకర్, మధు, రాజు, వెంకట్, శీను తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయం



- రవాణా శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

నవతెలంగాణ-కీసర

బాటసారుల దాహార్తిని తీర్చేందుకు చలి వేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. కీసర మండల నాయకులు బక్కని నర్సింగ్‌రావు ఏర్పాటు చేసిన చలివేంద్రం కేంద్రాలను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా బక్కని నర్సింగ్ రావును మంత్రి అభినందించారు. కార్యక్రమంలో కీసర మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కృష్ణ యాదవ్, చిర్యాల గ్రామాధ్యక్షుడు మధుయాదవ్, శివలింగాల శ్రీనివాస్ గౌడ్, బక్కని కుమార్, శ్రీనివాస్, అభిలాష్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ రమేష్ గుప్తా, లక్ష్మీనారాయణ, శ్రవణ్ గుప్తా, వేణుగోపాల్, రాజు, అరవింద్, కొండల్ రెడ్డి, హన్మంత్ రెడ్డి, సుమన్ రెడ్డి, జయరాం తదితరులున్నారు.

అభివృద్ధికి ఆకర్షితులై కాంగ్రెస్‌లో చేరికలు



- మేడ్చల్ ఇన్‌చార్జి వజ్రేష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి

నవతెలంగాణ-జవహర్‌నగర్

కాంగ్రెస్ చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్ఎస్, బీజేపీ నాయకులు కాంగ్రెస్‌లో చేరుతున్నారని మేడ్చల్ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి అన్నారు. ఆదివారం జవహర్ నగర్ మున్సిపల్ పరిధిలోని 18వ డివిజన్ గబ్బిలాలపేటలో మేయర్ శాంతి కోటేష్ గౌడ్ ఆధ్వర్యంలో, మూడో డివిజన్ అంబేద్కర్ నగర్‌లో కార్పొరేటర్ బల్లి రోజా శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో బీఆర్ఎస్, బీజేపీ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. వారికి వజ్రేష్ యాదవ్, సుధీర్ రెడ్డిలు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్ రెడ్డి గెలుపునకు ప్రతి ఒక్కరూ ప్రచారంలో పాల్గొని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. పార్టీలో చేరిన వారిలో గబ్బిలాలపేట బీఆర్ఎస్‌కు చెందిన ఉపసర్పంచ్ నరసింహ గౌడ్, రామన్న, నాగన్న, నాగభూషణం, కరాటే రాజు, అంబేద్కర్ నగర్ నాయకులు మాజీ ఎంపీటీసీ విజయరాయ్, శాగంటి వెంకటేష్, మంజ సైదులు, కంకణాల నర్సయ్య, మేడ్రశీను, ఎండీ. అహమ్మద్, శివరాత్రి భాస్కర్, మంద స్వామి, మారయ్య, నరేష్, చందు, రమేష్, హసీన, మంగా సజ్జు లక్ష్మీ, వెంకటయ్య, బీమ్రావ్, యాదగిరి, గజరాజు నరేష్, ఓంకార్ స్వామి, ఉన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ అధ్యక్షులు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్ గుప్తా, కార్పొరేటర్లు కుతాడి సాయికుమార్, బింగి లావణ్య సతీష్ గౌడ్, దమ్మాయిగూడ కాంగ్రెస్ అధ్యక్షుడు ముప్పా రామారావు, సీనియర్ నాయకులు కల్లేపల్లి సదానంద్, కాయిత రాజు యాదవ్, టి కాలేషా, పెద్ది మురళి, బొబ్బిలి మంజుల, రజిత గోపాల్ పాల్గొన్నారు.



నేడే రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి రెడ్ల కృతజ్ఞత సభ

- రెడ్డిలు హాజరై విజయవంతం చేయాలి
- దేవర్ యాంజల్ రెడ్డి సంఘం అధ్యక్షుడు కట్ట శశిధర్ రెడ్డి



నవతెలంగాణ-శామీర్‌పేట

దశాబ్దకాల రెడ్ల పోరాటాన్ని గుర్తించి రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేసిన రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి రెడ్ల కృతజ్ఞత సభను మేడ్చల్ జిల్లా తూంకుంట మున్సిపాలిటీ కేంద్రంలోని మొగుళ్ల వెంకట్ రెడ్డి ఫంక్షన్ హాల్లో నిర్వహించనున్నట్టు దేవర్ యాంజల్ రెడ్డి సంఘం అధ్యక్షుడు కట్ట శశిధర్ రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సభ దేవర్ యాంజల్ రెడ్డి సంఘం ఆధ్వర్యంలో నేడు సాయంత్రం 5గంటలకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. రెడ్ల హక్కుల కోసం పోరాడిన ఉద్యమకారులకు ప్రభుత్వ పెద్దలతో సన్మానం, గుర్తింపు పత్రం బహుకరణ జరుగుతుందని పేర్కొన్నారు. ఈ సభకు రెడ్డి సోదరులందరూ కుటుంబ సమేతంగా విచ్చేసి కృతజ్ఞత సభను జయప్రదం చేయాలని కోరారు.

రజక అభ్యర్థులను గెలిపించాలి



- రజక రిజర్వేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గోపి

నవతెలంగాణ-జవహర్‌నగర్

పార్లమెంట్ స్థానాలకు స్వతంత్రంగా పోటీ చేస్తున్న రజక అభ్యర్థులను గెలిపించాలని రజక రిజర్వేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గోపి అన్నారు. జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని అంబేద్కర్ నగర్‌లో రాష్ట్ర రజక రిజర్వేషన్ సమితి జిల్లా అధ్యక్షులు సాంబరాజు కుమార్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్యఅతిథులుగా రాష్ట్ర అధ్యక్షులు గోపి రజక, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోలిపాక లక్ష్మణ్ హాజరై మాట్లాడుతూ.. మహబూబ్‌నగర్ నుంచి నడిమింటి శ్రీనివాస్ హార్మోనియం గుర్తుతో, భువనగిరి నుంచి బీఎస్పీ అభ్యర్థి అయితరాజు అభయంధర్ ఏనుగు గుర్తుతో, ఖమ్మం పార్లమెంట్ నుంచి స్వతంత్ర అభ్యర్థి ఉల్లెంగల యాదగిరి రోడ్డు రోలర్ గుర్తుతో పోటీ చేస్తున్నారని తెలిపారు. వారికి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. వారు గెలిస్తే బహుజనుల గొంతుకలుగా మన హక్కుల కోసం పోరాటం చేస్తారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర యూత్ కార్యదర్శి కొండ్రాతి రమేష్, రాష్ట్ర యూత్ మీడియా సెక్రటరీ రాపర్తి అజయ్, జిల్లా యూత్ అధ్యక్షులు అర్రొల్ల కన్నయ్యఅలుగునూరి సుభాష్, అలుగునూరి శోభన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీ నృసింహ స్వామి తిరు కల్యాణం



నవతెలంగాణ-కీసర

చీర్యాల లక్ష్మీ నృసింహ స్వామి ఆలయంలో 16వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామి వారి తీరు కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ ఫౌండర్ చైర్మెన్ మల్లారపు లక్ష్మీ నారాయణ చేతుల మీదుగా స్వామివారి తీరు కల్యాణం నిర్వహించారు. ఈ కల్యాణానికి రాష్ట్ర ల్యాండ్ రెవెన్యూ రిజిస్ట్రేషన్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సతీమణి మల్లు నందిని, భువనగిరి ఎమ్మెల్యే కుంభమ అనీల్, రామగుండం ఎమ్మెల్యే మకన్ సింగ్ రాజ్ ఠాకూర్ సతీమణి మనాలి, మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, మేడ్చల్ జిల్లా మాజీ కలెక్టర్ ఎంవీరెడ్డి హాజరై స్వామిని దర్శించకుకున్నారు. స్వామి వారి కల్యాణోత్సవానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. భక్తుల కోసం చిర్యాల లక్ష్మీ నరసింహ స్వామి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిత్యం అన్నదానం, ఉచిత వైద్య శిబిరం, ఈసీఐఎల్ సోలీస్ హాస్పిటల్ వారు మజ్జిగ పంపిణీ చేశారు.





ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డికి జన్మదిన శుభాకాంక్షల వెల్లువ



నవతెలంగాణ-కీసర

మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి జన్మదినం సందర్భంగా మేడ్చల్ జిల్లా రైతు సమన్వయ సమితి మాజీ డైరెక్టర్ గండి అంజయ్య గౌడ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నేతలు కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పుష్ప గుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా సబితా ఇంద్రా రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ పటిష్టతకు పనిచేయాలన్నారు. తనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన బీఆర్ఎస్ నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో భాస్కర్ , బందెల పరమేష్, కొండేటి నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'కిమ్స్' కంటి వైద్యసేవలు అభినందనీయం

- రెండు దశాబ్దాలుగా సమగ్ర చికిత్సలు
- పలువురు కంటివైద్య నిపుణుల ప్రశంసలు
- కొత్త వైద్యులకు సీఎంఈ శిక్షణ
- 300 మందికి పైగా కంటి వైద్యుల హాజరు

నవతెలంగాణ-సిటీబ్యూరో

కిమ్స్ హాస్పిటల్ కంటి వైద్య సేవలు అభినందనీయం అని పలువురు కంటి వైద్య నిపుణులు ప్రశంసించారు. హాస్పిటల్ ఆధ్వర్యంలో కంటి వైద్య సేవలు ప్రారంభించి రెండు దశాబ్దాలు అయ్యిందని ఆప్తాల్మాలజీ విభాగానికి చెందిన క్యాటరాక్ట్ సర్జన్ డాక్టర్ బి.ప్రణతి అన్నారు. గుండెవ్యాధులు, ఊపిరితిత్తుల సమస్యలు ఉన్న వారికి క్యాటరాక్ట్ లాంటి శస్త్రచికిత్సలు అవసరమైనప్పుడు అన్ని విభాగాల వైద్యులు, మత్తు వైద్య నిపుణులు కూడా అందుబాటులో ఉండటం వల్ల కిమ్స్ ఆస్పత్రికే అలాంటి కేసులన్నీ వస్తున్నాయని.. అలాంటి వారికి చికిత్సలు చేసి నయం చేస్తున్నారని తెలి పారు.



కిమ్స్ హాస్పిటల్, హైదరాబాద్ ఆప్తల్మాలజీ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సికింద్రాబాద్‌లోని కిమ్స్ హాస్పిటల్‌లో ఆదివారం సీఎంఈ (కంటిన్యువస్ మెడి కల్ ఎడ్యుకేషన్) కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నగరం నలుమూలల నుంచి అత్యంత సీనియర్ కంటి వైద్యులు హాజరయ్యారు. కొత్తగా కంటి హాస్పిటల్స్ ఏర్పాటు చేయాలనుకునే వైద్యులకు శస్త్రచికిత్సల్లో నైపుణ్యాలు, క్లిష్టమైన కేసుల్లో ఎలా చికిత్స చేయాలన్న విషయాలతో పాటు.. ఆర్థికపరమైన క్రమశిక్షణ, అనుమతులు వివరాల ను తెలిపారు. రిఫ్రాక్టివ్ సర్జరీలు, క్యాటరాక్ట్ సర్జరీలలో తీసుకోవల్సిన జాగ్రత్తపై వైద్య నిపుణులు క్షుణ్ణంగా శిక్షణ ఇచ్చారు. దృష్టి పూర్తి స్పష్టంగా ఉండాలంటే ఏం చేయాలి, ఇప్పటి వరకు తాము ఎదుర్కొన్న వాటిలో సంక్లిష్టమైన కేసు ఏది, క్యాటరాక్ట్ సర్జరీల్లో అనుకోకుండా తలెత్తే సమస్యలు ఏంటి, వాటిని ఎలా పరిష్కరించాలి అనే పలు రకాల అంశాలపై సమగ్రంగా చర్చలు జరిగా యి. అంతక ముందు కిమ్స్ హాస్పిటల్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ సంబిత్ సాహు జ్యోతి ప్రజ్వలనం చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారం భించారు. కిమ్స్ ఆస్పత్రి ఆప్తల్మాలజీ విభాగానికి చెందిన క్యాటరాక్ట్ సర్జన్ డాక్టర్ బి.ప్రణతి, హైదరాబాద్ ఆప్తల్మా లజీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, సరోజినీదేవి కంటి ఆస్పత్రిలో ప్రొఫెసర్ డాక్టర్ మోదినీ పండార్‌పూర్కర్ ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా వ్యవహరించారు. దృష్టి 'ఐ' సెంటర్‌కు చెందిన డాక్టర్ మధుకర్‌రెడ్డి, సరోజినీదేవి కంటి ఆస్పత్రికి చెందిన డాక్టర్ రామన్ యువ వైద్యులకు పలు సూచనలు చేశారు.

రాగిడి గెలుపే లక్ష్యంగా పని చేయాలి : ఎమ్మెల్యే మర్రి



నవతెలంగాణ-అల్వాల్

పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. ఆదివారం అల్వాల్‌లోని 133 డివిజన్ మచ్చబొల్లారం సామల వెంకట రెడ్డి గార్డెన్స్‌లో బూతు కమిటీ కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. కాంగ్రెస్ వైఫల్యాలే బీఆర్ఎస్ విజయానికి నాంది పలుకుతాయన్నారు. బీఆంఎస్ హయాంలో షాదీ ముబారక్, కల్యాణ లక్ష్మీ రైతుబంధు, వికలాంగులకు పెన్షన్ వంటి పథకాల అమలు చేశామని తెలిపారు. ఆ పథకాలే బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపిస్తాయన్నారు. కార్యక్రమంలో రమేష్, పరమేష్, శోభన్‌బాబు, పవన్, వినయ్, అతిక్ పాషా, లక్ష్మణ్ యాదవ్, ప్రశాంత్ రెడ్డి, సందీప్ రెడ్డి, సతీష్, వెంకటేష్ యాదవ్, నార్ల సురేష్, రాజు, తిరుపతిరావు, నాందాస్ రాజేష్, రాంబాబు, సులోచన, శ్రీనివాస్, హరిత, సరిత, రమేష్, సుభాషినీ, వర్ష శ్రీదేవి, బూత్ కమిటీ మెంబర్లు పాల్గొన్నారు.



అల్వాల్‌లోని 134 డివిజన్ లక్ష్మీ నగర్ సాయి నగర్ కాలనీలో కాంగ్రెస్ నాయకులు బలవంతరెడ్డి, శ్రీనివాస్, నాగేశ్వరరావు, ఓంకార్, గణేష్, లావణ్య, కృష్ణ, నిర్మల , తదితరులు పట్నం సునీతారెడ్డిని గెలిపించాలని ప్రచారం చేశారు.

-నవతెలంగాణ-అల్వాల్

రక్తపోటును తగ్గించే సూపర్ ఫుడ్స్..!



ఇటీవల కాలంలో అధిక రక్తపోటు లేదా హైపర్‌టెన్షన్ సమస్య చాలా మందిలో బయటపడుతోంది. ఇది శరీరంలోని ధమనులను ప్రభావితం చేస్తుంది. రక్త నాళాల ద్వారా రక్తం ప్రవహించే శక్తి నిరంతరం ఎక్కువగా ఉన్నప్పుడు ఇది సంభవిస్తుంది. మరో రకంగా చెప్పాలంటే, రక్త నాళాల్లో ప్రవహించే రక్తం ధమనుల గోడలపై అధిక పీడనాన్ని కలుగజేస్తే దాన్ని హై బ్లడ్ ప్రెజర్ అంటాం. అమెరికన్ హార్ట్ అసోసియేషన్ ప్రకారం దీనికి చికిత్స చేయకుండా వదిలేస్తే, రక్త ప్రసరణ వ్యవస్థకు తీవ్ర నష్టం కలుగుతుంది. దీని ఫలితంగా గుండెపోటు, పక్షవాతం, ఇతర సమస్యలకు దారితీస్తుంది. రక్తపోటును కంట్రోల్‌లో ఉంచడానికి ఆరోగ్యకరమైన ఆహారం తినడం చాలా ముఖ్యం. తినే ఆహారం రక్తపోటు నియంత్రణలో ముఖ్య పాత్ర పోషిస్తుంది. మరి రక్తపోటు తగ్గించుకోవడానికి తినాల్సిన కొన్ని ఉత్తమ ఆహారాలు ఏవో చూద్దాం.

అరటి పండ్లు : అరటిపండ్లలో గుండె ఆరోగ్యాన్ని పెంచే, ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గించే అనేక ముఖ్యమైన పోషకాలుంటాయి. రక్తపోటును తగ్గించే న్యూట్రియంట్స్ ఉంటాయి. ఈ పండ్లలో ఉండే పొటాషియం రక్తపోటు పెరగడానికి కారణమయ్యే సోడియం మోతాన్ని తగ్గిస్తుంది.

బీట్‌రూట్ : రోజూ బీట్‌రూట్ తినడం లేదా బీట్‌రూట్ జ్యూస్ తాగడం వల్ల రక్తపోటు తగ్గుతుంది. ఇందులో ఫైబర్, ఫోలేట్, ఐరన్, పొటాషియం, విటమిన్ సి వంటి అవసరమైన పోషకాలు సమృద్ధిగా లభిస్తాయి. .

పెరుగు : రక్తపోటు స్థాయిలను తగ్గించడానికి ప్రతిరోజూ పెరుగు తినటం మంచిది. పెరుగులో రక్తపోటు స్థాయిలను నియంత్రించే విటమిన్లు, ఖనిజాలు, మెగ్నీషియం ఉంటాయి.

బెర్రీలు : ఈ పండ్లలో విటమిన్లు, ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి. ఫైబర్, ముఖ్యంగా నీటిలో కరిగే ఫైబర్, ఆరోగ్యానికి మేలు చేసే ఇతర పోషకాలు కూడా మెండుగా లభిస్తాయి. బెర్రీల్లో యాంటీఆక్సిడెంట్ కాంపౌండ్ అయిన ఆంథోసైనిన్స్ ఉంటుంది, ఇది రక్తపోటు తగ్గించడానికి చాలా అవసరం.

పుచ్చకాయ : వేసవిలో దొరికే పుచ్చకాయల్లో నీటి శాతం ఎక్కువగా ఉంటుంది. పొటాషియం కూడా అధికంగా దొరుకుతుంది. పొటాషియం వంటి ఎలక్ట్రోలైట్లతో హెల్తీగా రక్తపోటును తగ్గించుకోవచ్చు. పుచ్చకాయలో సిట్రులిన్ వంటి అమైనో యాసిడ్స్ పుష్కలంగా ఉంటాయి, ఇవి రక్త నాళాలను వదులు చేసి ధమనులలో ఫ్లెక్సిబిలిటీని పెంచుతాయి, తద్వారా రక్తపోటు తగ్గుతుంది.

ఓట్స్ : పాపులర్ బ్రేక్‌ఫాస్ట్ ఫుడ్ ఓట్స్. ఇందులో ఆరోగ్య ప్రయోజనాలు చాలా ఎక్కువ. హెల్తీ ఫ్యాట్స్ సమృద్ధిగా ఉంటాయి. ఓట్స్‌లోని ఫైబర్ రక్తపోటు, కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గిస్తాయి.



సరిహద్దులు దాటింది

అన్నపూర్ణి రాజ్‌కుమార్... అడ్డంకులు బద్దలుకొట్టింది. 40 ఏండ్ల వయసులో బంగ్లాదేశ్‌లోకి సరిహద్దు దాటిన మొదటి మహిళా ట్రక్కర్‌గా చరిత్రలో తన పేరును లిఖించుకుంది. పురుషులకు మాత్రమే పరిమితమైన డొమైన్‌లో తనకంటూ ఓ స్థానాన్ని దక్కించుకుంది. లింగ మూస పద్ధతులను పగులగొట్టింది. ఆమె బద్దలు కొట్టిన ఈ అడ్డంకులతో పురుషాధిక్య రంగాలలో మహిళల ప్రవేశాన్ని మరింతగా ప్రేరేపిస్తోంది.



అన్నపూర్ణి తమిళనాడు నుండి 10 రోజుల పాటు ప్రయాణం చేసి సుమారు వెయ్యి కిలోమీటర్లు దాటుకుని పెట్రాపోల్ సరిహద్దు చెక్‌పోస్ట్‌కు చేరుకుంది. 'విశాఖపట్నం సెజ్ నుండి కాటన్ నూలుతో కూడిన ట్రక్కును నడుపుకుంటూ గత శనివారం రాత్రి పెట్రాపోల్‌కు చేరుకుంది" అని పెట్రాపోల్‌లోని ల్యాండ్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా (LPAI) మేనేజర్ కమలేష్ సైనీ అన్నారు.

అడ్డంకులను అధిగమించడం

అన్నపూర్ణి తన ప్రయాణ సమయంలో అనేక రవాణా సవాళ్లను ఎదుర్కోవలసి వచ్చింది. జాతీయ రహదారుల వెంబడి మహిళల కోసం రెస్ట్‌రూమ్ సౌకర్యాలు లేకపోవడం ఆమె ఎదుర్కొన్న ఇబ్బందుల్లో ముఖ్యమైనది. 'ఈ అడ్డంకులు ఉన్నప్పటికీ ఆమె తన ట్రక్కును పార్క్ చేసిన హోటళ్లలోనే వసతిని ఏర్పాటు చేసుకుంది' అని సైనీ జోడించారు. అయితే ఈ ప్రయాణంలో వసతికి సంబంధించి ఆమెకు ఎంపికలు చాలా తక్కువే అని చెప్పాలి. ఎందుకంటే ఆమె రోడ్‌సైడ్ ధాబాలలో బస చేయకూడదని నిర్ణయించుకుంది. పురుషుల ఆధిపత్య కారణంతో ఆమె సాధారణంగా డ్రైవర్‌లు విశ్రాంతి తీసుకునే ప్రదేశాలకు దూరంగా ఉంది.

బంగ్లాదేశ్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ సరిహద్దు వేగంగా దాటడానికి అవసరమైన క్లియరెన్స్ తీసుకోగలిగింది. 'ఆమె చేసిన ప్రయాణం మహిళల కోసం రూపొందించిన LPAI మార్గదర్శకాలకు కట్టుబడి ఉంది. మేము బంగ్లాదేశ్ అధికారులతో కలిసి ఆమె ట్రక్ నుండి కాటన్‌ను వెంటనే దించాము. మధ్యాహ్నం 12:30 గంటలకు పెట్రాపోల్‌కు వేగంగా వెళ్లేందుకు వీలు కల్పించాము. సాధారణంగా ట్రక్కులు సరిహద్దులో చాలా సమయం వేచివుండాల్సి వుంటుంది. కానీ ఆమెకు ఆ నిరీక్షణ లేకుండా చేశాము' అని సైనీ వివరించారు. తమిళం మాత్రమే మాట్లాడగలిగే ఆమె హిందీలో కొంత మాట్లాడగలదు. తన సంభాషణ కోసం ఆమె తోటి డ్రైవర్ల సహకారం తీసుకుంది.

లింగ సముపార్జన

బంగ్లాదేశ్ నుండి ఆమె తిరిగి వచ్చిన తర్వాత ఆమెకు ప్రత్యేక సౌకర్యాలతో కూడిన మహిళా వసతి గృహంలో వసతి కల్పించారు. ఇది లింగ పక్షపాతాలను తొలగించడానికి, కస్టమ్స్ క్లియరింగ్, ఫార్వార్డింగ్ ఏజెంట్‌ల వంటి పాత్రలలో స్త్రీ భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడానికి ప్రారంభ ప్రయత్నాన్ని ప్రతిబింబిస్తుంది.



పెట్రాపోల్ సి అండ్ ఎఫ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి కార్తిక్ చక్రవర్తి, ఢిల్లీ నుండి పెట్రాపోల్‌కు ఇటీవలి పర్యటన సందర్భంగా హోం వ్యవహారాల సీనియర్ మంత్రిత్వ శాఖ అధికారులలో అసంతృప్తిని వెల్లడి చేశారు. ఈ రంగాలలో వేళ్లూనుకున్న పురుషాధిక్యతను పరిశీలించారు.

అన్నపూర్ణి సాధించిన ఈ విజయం దీర్ఘకాలంగా ఉన్న లింగ మూస పద్ధతులను సవాలు చేస్తూ, సాంప్రదాయకంగా పురుషాధిపత్య రంగాలలో వృత్తిని కొనసాగించేందుకు మరింత మంది మహిళలకు మార్గం సుగమం చేసింది. కష్టాలను ఎదుర్కునే ఆమె సంకల్పం, పట్టుదల ఇతర మహిళలు అద్దాల పైకప్పులను ఛేదించడానికి అడ్డంకులు లేకుండా వారి కలలను స్వీకరించడానికి ప్రేరేపించాయి.

ఆమె చేసిన ఈ ప్రయాణం ఫలితంగా సాంప్రదాయకంగా పురుషాధిపత్య రంగాలలో మౌలిక సదుపాయాల మెరుగుదలకు, మహిళల భద్రత అంశాలపై దృష్టి సారించేందుకు చర్చను లేవదీసింది. మహిళా డ్రైవర్లకు సరైన సౌకర్యాలు కల్పిస్తే ఈ రంగంలో మరింత మంది మహిళలు వచ్చేందుకు ఆసక్తి చూపుతారని ఆమె ఈ సందర్భంగా పంచుకుంటుంది.

LPAI సభ్యురాలు రేఖా రాయ్కర్ కుమార్, మహిళా కార్మికులకు అనుకూలమైన వాతావరణాన్ని
పెంపొందించాలని కోరుతూ మార్చి 19న పెట్రాపోల్‌లో ఒక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. 'లింగ వైవిధ్యాన్ని ప్రోత్సహించడానికి మేము కట్టుబడి ఉన్నాం. అలాగే సరిహద్దు సంబంధిత వృత్తులలో భాగస్వాములు అయ్యేలా మహిళలను ప్రోత్సహించాలనుకుంటున్నాం. అయితే ముఖ్యంగా చీకటి పడిన తర్వాత మహిళలకు కొన్ని సమస్యలు, ఆందోళనలు మొదలవుతాయి. హోటల్ సిబ్బందిలో అందరూ మగవారు ఉండటమే దీనికి ప్రధాన కారణం' అని రేఖా అంటున్నారు. మరింత సమగ్రమైన కార్యాలయ వాతావరణాన్ని పెంపొందించడానికి జరుగుతున్న ప్రయత్నాల గురించి ఆమె నొక్కిచెప్పారు.

అన్నపూర్ణి సాధించిన ఈ విజయం దీర్ఘకాలంగా ఉన్న లింగ మూస పద్ధతులను సవాలు చేస్తూ, సాంప్రదాయకంగా పురుషాధిపత్య రంగాలలో వృత్తిని కొనసాగించేందుకు మరింత మంది మహిళలకు మార్గం సుగమం చేసింది. కష్టాలను ఎదుర్కునే ఆమె సంకల్పం, పట్టుదల ఇతర మహిళలు అద్దాల పైకప్పులను ఛేదించడానికి అడ్డంకులు లేకుండా వారి కలలను స్వీకరించడానికి ప్రేరేపించాయి.

ఇండియా బ్లాక్ పావులుగా ముస్లింలు

(మొదటిపేజీ తరువాయి)

ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు చెందిన వారు అందరూ బీజేపీవైపే వస్తున్నారన్నారు. ప్రధాని గృహనిర్మాణ పథకం కింద అవసరంలో వున్నవారందరికీ ఇండ్లు కేటాయించడాన్ని ముస్లిం సోదరులు, సోదరీమణులు చూస్తున్నారు. నీటి కనెక్షన్ కానివ్వండి, గ్యాస్ సిలిండర్ కానివ్వండి ప్రతి ప్రభుత్వ ప్రయోజనం అందరికీ ఇస్తున్నామన్నారు. ఎలాంటి వివక్ష లేకుండా ముస్లింలందరూ అన్ని పథకాల ప్రయోజనాలు పొందుతున్నారన్నారు. నిజం తెలుసుకున్నారు కనుకనే ఈ ఓటుబ్యాంక్ రాజకీయాల కాంట్రాక్టర్లకు ముస్లింలు దూరంగా వుంటున్నారని మోడీ అన్నారు. మతం ప్రాతిపదికన రిజర్వేషన్లు వుండొద్దని అంబేద్కర్, జవహర్‌లాల్ నెహ్రూలు చాలా స్పష్టంగా చెప్పారని, కానీ మతం ప్రాతిపదికనే రిజర్వేషన్లు ఇచ్చేందుకు కాంగ్రెస్, ఇండియా బ్లాక్‌లు గట్టి పట్టుతో వున్నాయని మోడీ విమర్శించారు.

ఏపీ డీజీపీపై బదిలీ వేటు

(మొదటిపేజీ తరువాయి)

విమర్శలు మూటగట్టుకున్నారు. ప్రతిపక్షాలపై ఎన్ని దాష్టీకాలు జరుగుతున్నా ఆయన ఏ రోజూ పట్టించుకోలేదు. ప్రతిపక్ష నాయకులు, ప్రభుత్వ విధానాల్ని ప్రశ్నించేవారిని ఉక్కుపాదంతో అణచివేసేందుకు ప్రయత్నించారు. తప్పుడు కేసులు పెట్టి, అక్రమంగా అరెస్ట్‌లు చేయించారు. ప్రభుత్వ వైఫల్యాల్ని ప్రశ్నించినవారి గొంతులు నొక్కారు. సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టినవారినీ కేసులతో వేధించారు. విపక్ష పార్టీలు, ఉద్యోగ సంఘాలు నిరసనకు పిలుపునిచ్చినా గృహ నిర్బంధాలు చేశారు.

డీజీపీ హోదా కలిగిన 11 మంది సీనియర్ ఐపీఎస్ అధికారులను పక్కనపెట్టేసి మరీ కేవీ రాజేంద్రనాథరెడ్డిని ఇన్‌చార్జీ డీజీపీ (పోలీసు దళాల అధిపతి)గా నియమించిన జగన్ ప్రభుత్వం..రెండేండ్లుగా ఆయన్ను అదే హోదాలో కొనసాగించింది. పూర్తిస్థాయి (రెగ్యులర్) డీజీపీ ఎంపిక కోసం అర్హులైన అధికారుల వివరాలతో జాబితా పంపాలని కేంద్ర హోంశాఖ పదే పదే లేఖలు రాసినా ఖాతరు చేయలేదు. డీజీపీ నియామకం విషయంలో సుప్రీంకోర్టు ఆదేశాలను పట్టించుకోలేదు. వడ్డించే వాడు మనవాడైతే అన్నట్టుగా.. సీనియారిటీలో అట్టడుగున ఉన్నప్పటికీ రాజేంద్రనాథరెడ్డిని ఇన్‌చార్జి డీజీపీగా పదవి వరించింది. 1992 బ్యాచ్ అధికారైన ఆయన అదనపు డీజీపీ నుంచి డీజీపీ హోదాకి పదోన్నతి పొందిన కొద్ది రోజుల్లోనే...పోలీసు దళాల అధిపతిగా నియమిస్తూ 2020 ఫిబ్రవరి 15న జగన్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. డీజీపీగా ఉన్న గౌతమ్‌సవాంగ్‌ను ఆకస్మికంగా, అర్థాంతరంగా ఆ పోస్టు నుంచి పక్కకు తప్పించి.. ఆ స్థానంలో ఇన్‌చార్జి డీజీపీగా కేవీ రాజేంద్రనాథరెడ్డిని నియమించిన జగన్ ప్రభుత్వం నిబంధనలను తుంగలో తొక్కింది.

తెలంగాణలో పదికిపైగా స్థానాలు గెలుస్తాం

(మొదటిపేజీ తరువాయి)

లేకుండా పనిచేస్తున్నారని, దీపావళిరోజు జవాన్లతో కలిసి మిఠాయి పంచుకోవడం ఆయన రాజకీయదక్షతకు నిదర్శనమని తెలిపారు. ముస్లీం రిజర్వేషన్లు తప్పా ఇతర తరగతుల రిజర్వేషన్లు రద్దు చేయమని, ముస్లీం రిజర్వేషన్లు రద్దు చేసి ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు కేటాయిస్తామన్నారు. తన వ్యాఖ్యలను తప్పుగా వక్రీకరించి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సైతం ప్రచారం చేశారన్నారు. త్రిపుల్ తలాక్ రద్దుతో ముస్లీం సోదరీమణులు సంతోషంగా ఉన్నారని తెలిపారు. అయోధ్యలోని రామమందిరంలో బాలరాముడిని ప్రతిష్ఠించిన కార్యక్రమానికి కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీని ఆహ్వానించినా ఓవైసీ ఓటు బ్యాంకు కోసం హాజరు కాలేదని ఆరోపించారు. దేశ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఆర్టికల్ 370 తీసేయడంతో కాశ్మీర్ ప్రశాంతంగా ఉందన్నారు. తెలంగాణలో హైదరాబాద్ విమోచన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తామని చెప్పారు. కరోనా లాంటి క్లిష్ట సమయాల్లో సైతం కాంగ్రెస్ రాజకీయాలు చేసిందని, కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒక్కటేనన్నారు. 70 ఏండ్ల కాంగ్రెస్ చరిత్రలో ఏనాడూ రామమందిరం నిర్మాణానికి అడుగులు వేయలేదన్నారు. కాంగ్రెస్ పాలనలో నిత్యం బాంబుదాడులు జరిగేవని, పాకిస్తాన్ ఉగ్రవాదులు భారత్ సరిహద్దులోకి చొరబడి సైనికులను హతమార్చిన ఘటనలకు స్వస్తిపలికేలా బీజేపీ పాలనలో సర్జికల్ స్ట్రైక్స్‌తో ఉగ్రవాదుల ఆగడాలు దూరమయ్యాయన్నారు. దాంతో దేశ భద్రతకు భరోసా కల్పించామన్నారు.

హానికరంగా పదేండ్ల బీజేపీ ట్రైలర్

(మొదటిపేజీ తరువాయి)

ఉన్న భువనగిరి పార్లమెంటు స్థానంలో మాత్రమే పోటీ చేస్తున్నామని, ఇతర ప్రాంతాల్లో ఇండియా కూటమిలో భాగంగా కాంగ్రెస్‌ను బలపరుస్తున్నట్టు తెలిపారు. భువనగిరి పార్లమెంట్ సీపీఐ(ఎం) అభ్యర్థి ఎండీ జహంగీర్‌ను గెలిపించాలని కోరుతూ ఆదివారం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని యాచారం మండలంలోని మంతన్‌గౌరెల్లిలో ప్రారంభమైన ప్రచారం.. మాల్, నల్లవెల్లి, చింతపట్ల, కొత్తపల్లి, నానక్ నగర్, నంది వనపర్తి, చిన్న తుండ్ల, ధర్మన్నగూడ గ్రామాల్లో కొనసాగింది. ఈ సందర్భంగా నిర్వహించిన రోడ్ షోల్లో రాఘవులు పాల్గొని మాట్లాడారు. అనంతరం ఇబ్రహీంపట్నంలోని పాషా నరహరి స్మారక కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలోనూ ఆయన మాట్లాడారు.

పదేండ్ల మోడీ పాలనలో దేశంలో అభివృద్ధి కుంటుపడిందన్నారు. కులాలు, మతాలు, ప్రాంతాల మధ్య చిచ్చుపెట్టి రాజకీయాలను నడిపిస్తోందన్నారు. దేశంలో బీజేపీ అధికారంలో ఉన్నంతకాలం రాజ్యాంగం ప్రమాదంలోకి నెట్టబడుతుందని చెప్పారు తెలుగు రాష్ట్రాలకు విభజన హామీలను అమలు చేయలేదని, రాష్ట్రాల హక్కులను కాలరాసిందని, నీటిపారుదల రంగానికి సహాయం చేయలేదని విమర్శించారు. నిజామాబాద్‌లో పసుపు బోర్డును ఎందుకు ఏర్పాటు చేయలేదని ప్రశ్నించారు. ఉచితంగా రైతులకు ఇస్తున్న కరెంటుకు బదులు వ్యవసాయ బోర్లకు కేంద్ర ప్రభుత్వం మీటర్లను బిగించాలని విశ్వ ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. లక్ష కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన కాళేశ్వరం నేడు నిరుపయోగంగా మారిందన్నారు.

అవినీతి చోటుచేసుకుందని సీపీఐ(ఎం) ముందు నుంచి హెచ్చరిస్తున్నా కేంద్రం పట్టించుకోలేదన్నారు. ఈ అవినీతిలో గత బీఆర్ఎస్ ప్రభుత్వంతో పాటు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి భాగస్వామ్యం ఉందని ఆరోపించారు. నిర్మాణానికి అనుమతులిచ్చిన సెంట్రల్ వాటర్ కమిషన్ ఎందుకు పర్యవేక్షణ చేయలేదని నిలదీశారు. కులగణననూ అంగీకరించట్లేదని తెలిపారు. దళితుల వర్గీకరణ చేస్తామని చెప్పి మందకృష్ణ మాదిగను మోడీ తన బుట్టలో వేసుకున్నారని చెప్పారు. 254 ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటీకరణ చేస్తామని మోడీ 2018లోనే చెప్పారన్నారు. పెట్టుబడిదారులకు రూ.16 లక్షల కోట్ల రుణాలు మాఫీ చేసిన ప్రభుత్వం రైతాంగం పట్ల వివక్ష చూపుతోందన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని రక్షించుకుంటామన్నారు. చట్టసభల్లో నిజమైన ప్రతిపక్షం అవసరమని, ఆ పాత్ర సీపీఐ(ఎం) పోషిస్తుందని చెప్పారు. మతోన్మాదం సృష్టిస్తూ, విభజన రాజకీయాలు చేస్తున్న మోడీకి ప్రస్తుతం భయం పట్టుకుందన్నారు. అందుకే బహిరంగంగా ప్రజల మధ్య వైషమ్యాలు రెచ్చగొడుతున్నారన్నారు.

ఇలాంటి సమయంలో తెలంగాణలో బీజేపీని అడుగుపెట్టనీయబోమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సైతం ఆ ప్రయత్నం చేయాల్సిన అవసరం ఉందన్నారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని కోరారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సైతం పేదలపై నిర్బంధాలు ప్రయోగిస్తున్నదని తెలిపారు. జగిత్యాల మొదలుకొని మహబూబ్‌నగర్ వరకు నిల్వ నీడ కోసం ప్రభుత్వ భూములను ఆక్రమించి ఇండ్లు వేసుకున్న గుడిసెలపై బుల్డోజర్లు పెట్టి ధ్వంసం చేసిందన్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించాలని, లేకుంటే రాష్ట్ర ప్రభుత్వంపై సీపీఐ(ఎం) ఉద్యమిస్తుందని హెచ్చరించారు. ప్రజా సమస్యలపై తన వాణిని, బాణిని వినిపించేందుకే భువనగిరి పార్లమెంటులో సీపీఐ(ఎం) పోటీ చేస్తుందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమాల్లో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జాన్‌వెస్లీ, సీఐటీయూ జాతీయ నాయకులు సాయిబాబు, పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు భూపాల్, జిల్లా కార్యదర్శి కాడిగళ్ల భాస్కర్, రాష్ట్ర సీనియర్ నాయకులు పి.జంగారెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దుబ్బాక రామచందర్, కందుకూరి జగన్, పి.అంజయ్య, శ్రీనివాస్ రెడ్డి, శ్యాంసుందర్, సామెల్, జగదీష్, ఇబ్రహీంపట్నం మండల కార్యదర్శి సీహెచ్ జంగయ్య, యాచారం మండల కార్యదర్శి ఆలంపల్లి నరసింహ, ఆయా మండలాల నాయకులు, ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని మార్చే కుట్ర



(మొదటిపేజీ తరువాయి)

చేస్తున్నారని మమ్మల్ని గోడీ మీడియా ప్రశ్నిస్తోందని తెలిపారు. ఆదివారం ఆదిలాబాద్, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజవకర్గాల ఎన్నికల ప్రచారంలో భాగంగా.. నిర్మల్ జిల్లా కేంద్రం, గద్వాల జిల్లా ఎర్రవల్లి చౌరస్తా దగ్గర నిర్వహించిన ఎన్నికల జనజాతర సభలో రాహుల్ గాంధీతో పాటు సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. ప్రధాని మోడీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా పనిచేస్తున్నారని, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటీకరణ చేయడం అంటే రిజర్వేషన్లను తొలగించడమేనని చెప్పారు. రాజ్యాంగాన్ని కూలగొట్టడం ద్వారా బీజేపీ రిజర్వేషన్ వ్యవస్థను నాశనం చేయాలని చూస్తోందని విమర్శించారు. దేశంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే 50శాతం ఉన్న రిజర్వేషన్లను మరింత పెంచుతామని తెలిపారు. 80శాతం ఉన్న పేదలకు నిధులు అందించడంతో పాటు వారి హక్కులు పరిరక్షిస్తామని భరోసా ఇచ్చారు. తెలంగాణలో ఇప్పటికే ఆరు గ్యారంటీల ద్వారా వివిధ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని, కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే తెలంగాణలో అమలు చేస్తున్న పథకాలను దేశంలోనూ అమలు చేసేలా కృషిచేస్తామని హామీ ఇచ్చారు. కుటుంబంలోని ప్రతి మహిళ ఖాతాలో ఏడాదికి రూ.లక్ష వారి ఖాతాల్లో జమ చేస్తామని హామీనిచ్చారు. ఇందుకు సంబంధించి పేదల జాబితా తయారుచేస్తున్నామని అన్నారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా డిప్లమా, డిగ్రీ, పీజీ చేసిన నిరుద్యోగ యువతకు ఏడాది పాటు శిక్షణ అందించి ప్రభుత్వ రంగాల్లో ఉద్యోగాలు కల్పిస్తామని, బాగా పనిచేసిన వారికి ఉద్యోగాన్ని పర్మినెంట్ చేస్తామని తెలిపారు. తెలంగాణలో ఆదివాసీలకు భూమి మీద సర్వహక్కులు కల్పిస్తామన్నారు. మంత్రి సీతక్క సూచన మేరకు ఉపాధిహామీ చట్టంలో భాగంగా ప్రస్తుతం సగటు కూలి రూ.250వరకు వస్తుందని, తాము అధికారంలోకి రాగానే రూ.400 చేస్తామని చెప్పారు. మహిళల ఆదాయం రెట్టింపు చేస్తామన్నారు. ఆదిలాబాద్ నాగర్‌కర్నూల్ నియోజకవర్గాల్లో అభ్యర్థులను గెలిపించి పార్లమెంటుకు పంపించాలని పిలుపునిచ్చారు.


9 లోపు అందరికీ రైతుభరోసా

(మొదటిపేజీ తరువాయి)

భరోసానిచ్చారు. ఇప్పటికే రాష్ట్రంలో ఆరు గ్యారంటీలు ఐదింటిని అమలు చేశామని గుర్తుచేశారు. ఈ ఎన్నికల్లో బీజేపీకి కర్రుకాల్చి వాతపెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో ఉప ముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్క, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి, మంత్రి సీతక్క, తెలంగాణ జనసమితి అధ్యక్షులు కోదండరాం రెడ్డి, ఎమ్మెల్యేలు వెడ్మబొజ్జు, మేఘారెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, మాజీ కేంద్రమంత్రి వేణుగోపాలచారి, టీపీసీసీ అధికార ప్రతినిధి అద్దంకి దయాకర్, మాజీ ఎమ్మెల్యేలు రాథోడ్ బాపురావు, విఠల్‌రెడ్డి, కోనేరు కోనప్ప, రేఖానాయక్, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్తు మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ అధికారిని ట్రాక్టర్‌తో తొక్కించి..

- మధ్యప్రదేశ్‌లో రెచ్చిపోయిన ఇసుక మాఫియా
- వరుస ఘటనలతో అధికారుల్లో భయాందోళనలు


(ఫైల్)

భోపాల్ : బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ప్రభుత్వఅధికారులకు రక్షణ లేకుండా పోయింది. వారి ప్రాణాలను తీయటానికి కూడా వెనుకాడటంలేదు. తాజాగా మధ్యప్రదేశ్‌లో అక్రమ మైనింగ్‌ను తనిఖీ చేసేందుకు వెళ్లిన ఓ పోలీస్ అధికారిని ట్రాక్టర్‌తో తొక్కి చంపిన ఘటన జరిగింది. సెహ్డాల్ అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ మహేంద్ర బగ్రీ, ఇద్దరు కానిస్టేబుల్స్ ప్రసాద్ కానోజీ, సంజరు దూబేలతో కలిసి శనివారం ఆ ప్రాంతంలో అక్రమ మైనింగ్ తనిఖీకి వెళ్లారు. వేగంగా వస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను ఆపేందుకు యత్నించగా .. ఆయనను తొక్కుకుంటూ వెళ్లడంతో మహేంద్ర బగ్రీ అక్కడికక్కడే మరణించారు. ఈ ఘటన నుంచి కానిస్టేబుల్స్ తప్పించుకోగలిగారని అధికారులు తెలిపారు. డ్రైవర్, అతని సహాయకుడిని అదుపులోకి తీసుకున్నామని, ట్రాక్టర్ యజమాని పరారీలో ఉన్నారని అన్నారు.

ట్రక్కు యజమాని గురించి సమాచారం అందించిన వారికి రు.30 వేల రివార్డు ఇస్తామని పోలీసులు ప్రకటించారు. ఇసుక మాఫియాలో కీలక నిందితులు అశుతోష్ సింగ్, సురేంద్ర సింగ్‌లపై కూడా కేసు నమోదు చేసినట్టు అధికారులు తెలిపారు. మధ్యప్రదేశ్‌లో సోన్ నది నుండి ఇసుక అక్రమ రవాణా దందా జోరుగా సాగుతోంది.

గతేడాది నవంబర్‌లో షెహదోల్ ఇసుక మాఫియాకు చెందిన ట్రాక్టర్‌లో రెవెన్యూ శాఖ అధికారి ఒకరు మృతి చెందిన సంగతి తెలిసిందే.

విషాహార భోజనం...

(మొదటిపేజీ తరువాయి)

యాక్షన్ నెట్‌వర్క్ సీఈఓ దిలీప్ కుమార్ అన్నారు. అలాగే, అధికమొత్తంలోని పెస్టిసైడ్ కలిగి ఉన్న సుగంధద్రవ్యాల దిగుమతి సులభతరం కానున్నదని చెప్పారు. తమకు అందిన పలు విజ్ఞప్తుల ఆధారంగానే పెస్టిసైడ్ పరిమితిని పెంచినట్టు ఎఫ్ఎస్ఎస్ఏఐ తెలిపింది. అయితే, అలాంటి విజ్ఞప్తులు ఎవరు చేశారన్నదాని గురించి మాత్రం సంస్థ వెల్లడించలేదు.

'ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం'

ఈ పరిమాణ పెరుగుదల కారణంగా సుగంధద్రవ్యాలను వినియోగించేవారి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉన్నదని సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ ప్రోగ్రాం సుస్థిరాహారాభివృద్ధి డైరెక్టర్ అమిత్ ఖురానా హెచ్చరించారు. కాగా, సుగంధ ద్రవ్యాల్లో అధిక పెస్టిసైడ్‌ల వినియోగం కారణంగా కొన్ని ప్రముఖ బ్రాండ్లకు చెందిన అమ్మకాలపై హాంగ్‌కాంగ్, సింగపూర్, మాల్దీవులు గతనెల నిషేధం విధించాయి. అయితే, భారత్‌కు చెందిన ఒక కంపెనీ మాత్రం తమ బ్రాండ్ అమ్మకాలపై వచ్చిన ఆరోపణలను తోసిపుచ్చింది.

కష్టంగా నీట్ కెమిస్ట్రీ ప్రశ్నలు

(మొదటిపేజీ తరువాయి)

నిర్వహించారు. పరీక్షను మధ్యాహ్న 2గంటల నుంచి సాయంత్రం 5.20 గంటల వరకు నిర్వహించారు. నీట్ పరీక్ష కోసం 24 లక్షల మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నట్టు ఎన్‌టీఏ వెల్లడించింది. దేశంలో 557 నగరాల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా ఇతర దేశాల్లోని 14నగరాల్లోనూ నీట్ పరీక్షను నిర్వహించింది. రెండు తెలుగు రాష్ట్రాల్లో నీట్ పరీక్షను రాశారు. తెలంగాణలో సుమారు 74 వేల మంది దరఖాస్తు చేసుకోగా, ఆంధ్రప్రదేశ్‌నుంచి 60వేల మంది దరఖాస్తు చేసుకున్నట్టు సమాచారం. నిమిషం ఆలస్యం నిబంధనను అమలు చేశారు.మూడు గంటల ముందు నుంచే పరీక్షా కేంద్రాల్లోకి విద్యార్థులను అనుమతించారు. సాధారణ దుస్తులతోనే పరీక్షకు అనుమతించిన నిర్వాహకులు, మధ్యాహ్నం ఒకటిన్నర తర్వాత విద్యార్థులను పరీక్షా కేంద్రంలోకి అనుమతించలేదు. ఇదిలా ఉండగా ఉదయం 9గంటలకే రిపోర్టింగ్ చేయాలని పేర్కొన్న ఎన్‌టీఏ, స్నాక్స్‌కూడా ఇవ్వక పోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

మోడీ మూడోసారి అధికారంలోకొస్తే

దేశాన్ని అమ్మేస్తారు

బీజేపీని గ్రామాల్లో తిరగకుండా తరిమికొట్టాలి

- ధనబలం, ప్రజాసేవ మధ్య జరుగుతున్న పోటీ : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి



నవతెలంగాణ-చండూరు

మూడోసారి బీజేపీ అధికారంలోకి వస్తే దేశాన్ని స్వదేశీ, విదేశీ కార్పొరేట్ శక్తులకు హోల్‌సేల్‌గా అమ్మేస్తుందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. ఆదివారం నల్లగొండ జిల్లా గట్టుప్పల్ మండలంలోని తేరట్‌పల్లి గ్రామంలో నిర్వహించిన సీపీఐ(ఎం) గ్రామ శాఖ జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పేద, మధ్య తరగతి ప్రజల సంపదను, వాళ్ల శ్రమను దోచి కార్పొరేట్, ప్రయివేట్ వ్యక్తుల చేతిల్లో బీజేపీ ప్రభుత్వం పెడుతోందని అన్నారు. మోడీ మోసపూరిత మాటలతో మత, దేవుళ్ళ సెంటిమెంట్‌తో ప్రజలను మధ్యపెట్టి మరోసారి అధికారంలోకి రావాలని చూస్తున్నారని విమర్శించారు. బీజేపీకి ఎన్నికల్లో అవకాశం ఇస్తే ఎమర్జెన్సీ తలపించే విధంగా పాలన ఉంటుందని తెలిపారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని, పౌరహక్కులను కాపాడుకునేందుకు రేపు జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి తగిన బుద్ధి చెప్పినప్పుడే మనుగడ ఉంటుందన్నారు. రాష్ట్రంలో పదేండ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్.. ప్రజా సమస్యలను విస్మరించి అహంకారపూరితంగా పాలన కొనసాగించిందన్నారు. పూటకో పార్టీలు మార్చే నాయకులను ఓడించాలని, మునుగోడు నియోజకవర్గ వెనకబాటుకు కారణం గత పాలకులే కారణమని అన్నారు. మూసీ నది ప్రక్షాళన చేయాలని పాదయాత్రలతో పాటు సాగు, తాగునీటి కోసం పోరాటాలు నిర్వహించడంలో కమ్యూనిస్టులు కీలకపాత్ర పోషించారని తెలిపారు. మునుగోడు నియోజకవర్గంలో ఇండ్ల స్థలాల కోసం, గీత కార్మికుల సమస్యల కోసం, పేద ప్రజల సమస్యల కోసం నిరంతరం పోరాడింది కమ్యూనిస్టులేనన్నారు. బీజేపీ భువనగిరి పార్లమెంట్ అభ్యర్థిగా ఉన్న బూర నర్సయ్యగౌడ్‌కు.. గత ఎన్నికల్లో ఎంపీగా ఐదేండ్లు అవకాశం ఇస్తే ఏం అభివృద్ధి చేశారని ప్రశ్నించారు. పార్లమెంటు పరిధిలో చేసిన అభివృద్ధిని చూపించి ప్రజలను ఓట్లు అడగాలన్నారు. ఇక బీఆర్ఎస్, కాంగ్రెస్ భువనగిరి పార్లమెంట్ అభ్యర్థులకు నియోజకవర్గంలో ఏ సమస్యలు ఉన్నాయో తెలియదన్నారు. సీపీఐ(ఎం) భువనగిరి ఎంపీ అభ్యర్థి జహంగీర్ మాట్లాడుతూ.. 35 ఏండ్లుగా ప్రజా సమస్యలపై ప్రశ్నించే గొంతుగా ప్రజా ఉద్యమాల్లో ఉండి పోరాడిన తనకు ఒక్కసారి అవకాశం ఇస్తే నాయకునిగా కాదు.. సేవకునిగా పనిచేస్తానన్నారు. మునుగోడు నియోజకవర్గం సీపీఐ(ఎం) పోరాటాల ఫలితంగా పేదలకు భూములు, ఇండ్ల స్థలాలు సాధించిపెట్టారన్నారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండ శ్రీశైలం, ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి కట్ట నర్సింహ, వివిధ మండలాల కార్యదర్శులు నాంపల్లి చంద్రమౌళి, ఏర్పుల యాదయ్య చండూరు మాజీ మండల కార్యదర్శి బొట్టు శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఇండియా కూటమిని గెలిపించాలి

- సీపీఐ(ఎం) ఎన్నికల సభలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

(మొదటిపేజీ తరువాయి)

మధ్య వైషమ్యాలు సృష్టిస్తున్న ఆర్ఎస్ఎస్, బీజేపీని దేశంలో ఓడించాలని కోరారు. రాష్ట్రంలో బీజేపీకి మనుగడ లేదని, అలాగే, బీఆర్ఎస్ దుకాణం మూసుకున్నట్లేనని తెలిపారు. రానున్న ఎన్నికల్లో ఇండియా కూటమి అభ్యర్థి పోరిక బలరాం నాయక్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.

ఇండియా కూటమి పేరు వింటేనే మోడీకి చెమటలు : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య

ఇండియా కూటమి పేరు వింటేనే ప్రధానమంత్రి నరేంద్ర మోడీకీ చెమటలు పడుతున్నాయని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య అన్నారు. పదేండ్లు అబద్ధాలతో అధికారాన్ని నెట్టుకొచ్చిన బీజేపీ.. ఇవాళ ఉద్యోగాలు ఇవ్వకపోగా ఇంటింటికి రాముని బియ్యం అందించి ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వామినాథన్ కమిషన్ అమలు చేస్తామని గత ఎన్నికల్లో వాగ్దానం చేసిన బీజేపీ, దాని అమలు చేయకుండా మద్దతు ధర కోసం ఢిల్లీ నడివీధుల్లో పోరాటం చేసిన 750 మంది రైతులను పొట్టన పెట్టుకుందని అన్నారు. గతంలో దేశ సంపదను దోచుకొని మూటగట్టుకున్న వారిని ఈ దేశం నుండి పారిపోవడానికి అవకాశం కల్పించింది నరేంద్ర మోడీ కాదా అని ప్రశ్నించారు. కిరాతకులని, దేశద్రోహులను నరేంద్ర మోడీ రక్షిస్తే, అయన్ను ఆర్ఎస్ఎస్ రక్షిస్తుందని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను చిత్తుచిత్తుగా ఓడించాలని, ఇండియా కూటమిలో భాగస్వామ్యం ఉన్న కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరారు.

బయ్యారంలో ఉక్కు కర్మాగారాన్ని నిర్మించాలి - సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు జి.నాగయ్య

వరంగల్ కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు కర్మాగారాన్ని నిర్మిస్తే ఇక్కడ వేలాది మందికి ఉపాధి దొరుకుతుందని, పరోక్షంగా లక్షలాది మందికి ఉపాధి ఉంటుందని జి.నాగయ్య ప్రభుత్వాలకు గుర్తు చేశారు. ఇండియా కూటమిలో భాగస్వామ్యంగా ఉన్నా సీపీఐ(ఎం) ఎన్నికల తర్వాత ఈ రెండింటి సాధన కోసం ఉద్యమిస్తుందని, ఈ ఉద్యమానికి ప్రజలు సంఘీభావంగా ఉంటూ పోరాటంలో కలిసి రావాలని తెలిపారు. ఇండియా కూటమిలో భాగస్వామిగా ఉన్న కాంగ్రెస్ అభ్యర్థి బలరాం నాయక్‌ని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సభలో ఎమ్మెల్యేలు డాక్టర్ మురళి నాయక్, డాక్టర్ జాటోత్ రామచంద్రనాయక్, సీపీఐ(ఎం) వరంగల్ జిల్లా కార్యదర్శి సిహెచ్.రంగయ్య, ములుగు జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకటరెడ్డి, ఇల్లందు నియోజకవర్గం ఇన్‌చార్జి దుగ్గి కృష్ణ, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సుర్నపు సోమయ్య, ఆకుల రాజు, గుణగంటి రాజన్న, అలవాల వీరయ్య, కందునూరి శ్రీనివాస్, మండ రాజన్న, బానోతు సీతారాం, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలే మాయే ? : కేసీఆర్

నవతెలంగాణ - జగిత్యాల టౌన్

"ఎప్పుడు గలగల పారే వరద కాలువకు ఏమైందో ఆలోచించాలి.. నీళ్లు లేక పొలాలు ఎందుకు ఎండిపోయినాయో రైతులు గుర్తించాలి.. కరువు తెచ్చిన కాంగ్రెస్‌కు ఈ నెల 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో ఓటుతో బుద్ధిచెప్పాలి" అని బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పిలుపునిచ్చారు.జగిత్యాల జిల్లా కేంద్రంలో పార్లమెంటు ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం రాత్రి నిర్వహించిన రోడ్‌షోలో ఆయన మాట్లాడారు.ఎన్నికల ముందు ఆరు గ్యారంటీలు అని చెప్పి ఓటు వేయించుకుని ప్రజలను ఆగం చేశారని విమర్శించారు.ఆరు గ్యారంటీలను ఒక్కటైనా అమలు చేశారా ప్రశ్నించారు. మహిళలకు రూ.2500 ఇస్తున్నామని నిర్మల్ సభలో రాహుల్ గాంధీ చెబుతున్నారని, రాష్ట్రంలో ఏ మహిళకైన పడ్డాయా అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఏ ఊరికి పోయినా అక్కడి దేవుళ్లపై ఒట్టువేసి ఆగస్టు 15 తరువాత రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని చెబుతూ.. మరోసారి రైతులను మోసే చేసే కుట్ర చేస్తున్నారని అన్నారు. రైతుబంధు నాటువేసి పంట కోసినాక రైతు బంధు వేస్తామని సీఎం అంటున్నారని, తానేమో పెట్టుబడి సాయం కింద రైతుబంధు అందజేస్తే ప్రస్తుత ముఖ్యమంత్రి వరికోసినాక రైతుబంధు అందజేస్తానని అంటున్నాడని, ఇది తలాతోక లేని మాటని ఆరోపించారు. 5 ఎకరాల భూమి ఉంటేనే రైతుబంధు ఇస్తామని చెబుతున్నారని, మిగతా రైతులు ఎక్కడ పోవాలని ప్రశ్నించారు. వానాకాలం వడ్లు పోయి యాసంగి వడ్లు అమ్ముకునే టైమ్ వచ్చిందని, క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇంకెప్పుడు ఇస్తారని నిలదీశారు. తొమ్మిదేండ్లలో నిరంతరాయంగా కరెంట్, మంచినీరు సరఫరా చేశామని, కానీ ఈ నాలుగు నెలల్లో కరెంట్, నీళ్లు ఎక్కడికి పోయాయని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

కేంద్రంలోని మోడీ.. రాష్ట్రానికి ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. మోడీ బలవంతుడయితే రూపాయి విలువ ఎందుకు పడిపోయిందని ప్రశ్నించారు. దేశంలోని దళితులు, మైనార్టీలు, గిరిజనులు, మహిళలకు మోడీ ప్రభుత్వం వల్ల లాభం జరిగిందా అని ప్రశ్నించారు. నరేంద్ర మోడీ గోదావరి నీళ్లను తమిళనాడు, కర్నాటకకు తీసుకుపోతానని అనేక సందర్భాల్లో బహిరంగంగానే చెబుతున్నా.. సీఎం మాత్రం స్పందించడం లేదని ఆరోపించారు. తాను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కూడా ఇదే ప్రపోజల్ వచ్చిందని, తెలంగాణ వాటా తేల్చిన తర్వాతే మాట్లాడుతామని, అప్పటి వరకు ఏం పీక్కుంటావో పీక్కో అని అన్నానని తెలిపారు.

కార్మిక వ్యతిరేక, మతోన్మాద బీజేపీని ఓడించండి

- భువనగిరి సీపీఐ(ఎం) అభ్యర్థి జహంగీర్‌ను గెలిపించండి : సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్



నవతెలంగాణ-జనగామ

కార్మిక వ్యతిరేక, మతోన్మాద బీజేపీని ఓడించి భువనగిరి పార్లమెంట్ సీపీఐ(ఎం) అభ్యర్థి జహంగీర్‌ను గెలిపించేందుకు కార్మిక వర్గం సిద్ధం కావాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ పిలుపునిచ్చారు. ఆదివారం జనగామ జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో 'పార్లమెంట్ ఎన్నికలు-కార్మిక వర్గం కర్తవ్యం' అంశంపై సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బొట్ల శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన సెమినార్‌లో ఆయన మాట్లాడారు. ఈ ఎన్నికలు కార్మికులకు, ఉద్యోగులకు ఎంతో కీలకమైనవని అన్నారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేస్తూ కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబించిందని, కార్మిక హక్కులను కాలరాసిందని విమర్శించారు. మతం పేరుతో మతోన్మాదాన్ని రెచ్చగొట్టి కార్మిక వర్గ ఐక్యతకు భంగం చేస్తూ యాజమాన్యాలకు ప్రయోజనం కలిగించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ అనుసరించిన విధానాల వల్ల ఆర్థిక అసమానతలు పెరిగాయని, అసంఘటిత రంగ కార్మికులకు కనీస వేతన హక్కులు అమలుకు నోచుకోలేదని అన్నారు. నిత్యవసర సరుకుల ధరలు విపరీతంగా పెంచి పేదలపై భారం మోపిందని తెలిపారు. ప్రజా పంపిణీ వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు కుట్రలు చేస్తున్నదని తెలిపారు. కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను యాజమాన్యాలకి అనుకూలంగా సవరణలు చేయడం సిగ్గుచేటన్నారు. సీటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్వీ రమ, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బుర్రి ప్రసాద్ మాట్లాడుతూ.. పదేండ్ల బీజేపీ పాలనలో సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు అంటూ మోసం చేసిందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటు వారికి కట్టబెట్టేందుకు తీవ్రంగా ప్రయత్నం విమర్శించారు. భారత రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని, కార్మికుల హక్కులను కాపాడుకోవాలంటే భువనగిరి పార్లమెంట్ సీపీఐ(ఎం) అభ్యర్థిని గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాపర్తి రాజు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సుంచు విజేందర్, కోడెపాక యాకయ్య, చిట్యాల సోమన్న, అన్నెబోయిన రాజు, జిల్లా కమిటీ సభ్యులు, ప్రజాసంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



నయన్ సారిక, ఆనంద్ దేవరకొండ

పక్కా యాక్షన్ ఎంటర్‌టైనర్

హీరో ఆనంద్ దేవరకొండ తాజాగా నటిస్తున్న చిత్రం 'గం..గం..గణేశ'. ప్రగతి శ్రీవాస్తవ, నయన్ సారిక హీరోయిన్స్‌గా నటిస్తున్న ఈ సినిమాను హై-లైఫ్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై కేదార్ సెలగంశెట్టి, వంశీ కారుమంచి నిర్మిస్తున్నారు. ఉదయ్ శెట్టి ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఆనంద్ దేవరకొండ తన కెరీర్‌లో చేస్తున్న ఫస్ట్ యాక్షన్ మూవీ ఇది కావడం విశేషం. ఈ నెల 31న ఈ సినిమా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రాబోతోంది. ఈ నేపథ్యంలో ఈ చిత్రంలోని సెకండ్ సింగిల్ 'పిచ్చిగా నచ్చాశావే'ను మల్లారెడ్డి కాలేజ్ విద్యార్థుల సందడి మధ్య రిలీజ్ చేశారు.
ఈ సందర్భంగా నిర్మాత వంశీ కారుమంచి మాట్లాడుతూ, 'మీ అందరినీ చూస్తుంటే నేను చెన్నైలో చదువుకున్న రోజులు గుర్తొస్తున్నాయి. ఆనంద్ దేవరకొండ మంచి ఫ్రెండ్, రియల్ లైఫ్‌లోనూ హీరో. ఈ సినిమాలో ఆనంద్ క్యారెక్టర్ మీ రియల్ లైఫ్‌లో ఫ్రెండ్ క్యారెక్టర్‌లా ఉంటుంది. ఈనెల 31న మీ ముందుకు వస్తున్నాం. మూవీని తప్పకుండా చూడండి' అని తెలిపారు.
'ఇదొక మంచి క్రైమ్ కామెడీ మూవీ. మీరు మీ ఫ్యామిలీస్‌తో కలిసి ఎంజాయ్ చేసేలా సినిమా ఉంటుంది. మా మూవీని మిస్ కాకండి' అని దర్శకుడు ఉదయ్ శెట్టి చెప్పారు. హీరో ఆనంద్ దేవరకొండ మాట్లాడుతూ, 'బేబి' సినిమాలో ఎంత ఏడ్చారో ఈ సినిమాలో నన్ను చూసి అంత నవ్వుతారు. స్క్రిప్ట్ డిఫరెంట్‌గా ఉంటుంది. ట్విస్ట్స్, టర్న్స్ ఉంటాయి. క్రైమ్, కామెడీ, యాక్షన్‌తో మీరంతా ఈ మూవీని బాగా ఎంజాయ్ చేస్తారు' అని అన్నారు.

నవచిత్రం

రియల్‌స్టోరీతో రాజుయాదవ్



జబర్దస్త్ ఫేమ్ గెటప్ శ్రీను 'రాజు యాదవ్'తో హీరోగా ఆరంగేట్రం చేస్తున్నారు. ఈ చిత్రం ద్వారా కృష్ణమాచారి దర్శకునిగా పరిచయం అవుతున్నారు. సాయి వరుణవి క్రియేషన్స్, చరిష్మా డ్రీమ్స్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌లపై కె. ప్రశాంత్ రెడ్డి, రాజేష్ కల్లెపల్లి సంయుక్తంగా ఈ ప్రాజెక్ట్‌ను నిర్మించారు. ఈనెల 17న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో మేకర్స్ ఈ చిత్ర ట్రైలర్‌ను విడుదల చేశారు. హీరో తేజ సజ్జా ముఖ్య అతిథిగా హాజరై ట్రైలర్‌ని లాంచ్ చేశారు.
హీరో గెటప్ శ్రీను మాట్లాడుతూ,'దర్శకుడు కృష్ణమాచారి ఈ సినిమా కోసం చాలా కష్టపడ్డారు. ఉదయ్ చాలా మంచి విజువల్స్ ఇచ్చారు. హర్షవర్ధన్ రామేశ్వర్ బ్లాక్ బస్టర్ మ్యూజిక్ ఇచ్చారు. సురేష్ బొబ్బిలి అద్భుతమైన నేపథ్య సంగీతం అందించారు. నిర్మాత ప్రశాంత్ చాలా ప్యాషన్‌తో ఈ సినిమా చేశారు' అని అన్నారు. 'ఈ సినిమా ఒక రియల్ స్టోరీ. చాలా సహజసిద్ధంగా ఈ సినిమాని తీశాం. ప్రేక్షకులు కొత్త అనుభూతి వుంటుంది. ఎమోషన్స్, ఎంటర్‌టైన్‌మెంట్ ఆకట్టుకుంటాయి. ఈనెల 17న అందరూ రాజు యాదవ్ చూసి, సినిమాని పెద్ద హిట్ చేయాలి. ఫ్యామిలీ అంతా కలసి చూసే సినిమా ఇది' అని దర్శకుడు కృష్ణమాచారి చెప్పారు.

ఒకేసారి రెండు సినిమాలు షురూ

'డైరెక్టర్స్ డే' సందర్భంగా ఇద్దరు కొత్త దర్శకులను పరిచయం చేస్తూ ఈస్ట్ వెస్ట్ ఎంటర్టైనర్స్ సమర్పణలో రెండు సినిమాల షూటింగ్స్ ప్రారంభం అయ్యాయి. హైదరాబాద్ ప్రసాద్ ల్యాబ్స్‌లో ఖుషి టాకీస్ బ్యానర్ పై 'సీత ప్రయాణం కృష్ణతో' అనే చిత్రం, మహీ మీడియా వర్క్స్ బ్యానర్ పై 'త్రిగుణి' చిత్రం లాంఛనంగా ముహూర్తం షాట్‌తో మొదలయ్యాయి. ఈ రెండు చిత్రాల ముహూర్తం షాట్స్‌కి తెలుగు చలనచిత్ర దర్శకుల సంఘం అధ్యక్షులు వీరశంకర్ కెమెరా స్విచ్ ఆన్ చేయగా, దర్శకులు దాసరి మారుతి తొలి క్లాప్ కొట్టారు.
ఆ తర్వాత ఈ రెండు చిత్రాల తొలి పోస్టర్లను లాంచ్ చేశారు. ఈ కార్యక్రమంలో విరాట పర్వం దర్శకుడు వేణు ఉడుగుల, తెలుగు నిర్మాతల మండలి కార్యదర్శి టి.ప్రసన్నకుమార్, డార్లింగ్ స్వామి, రుద్రాపట్ల వేణుగోపాల్, రామ్ రావిపల్లి తదితరులు పాల్గొన్నారు.
ఆద్యంతం కడుపుబ్బ నవ్వించే సన్నివేశాలతో నడిచే ఫ్యామిలీ డ్రామా కథాంశంతో రానున్న 'సీత ప్రయాణం కృష్ణ'తో అనే సినిమాలో నాయకానాయికలుగా రోజా ఖుషి, దినేష్ నటిస్తున్నారు. వీరితో పాటు అనుపమ, సుమంత్, వైభవ్ తదితరులు నటిస్తున్నారని దర్శకుడు దేవేందర్ చెప్పారు. 'త్రిగుణి' సినిమాలో హీరోగా కుషాల్, ఒక ప్రత్యేక పాత్రలో రోజా ఖుషి నటిస్తుండగా, మిగిలిన పాత్రలకు అందరూ కొత్త నటీనటులనే పరిచయం



చేస్తున్నామని చిత్ర దర్శకుడు వైతహవ్య వడ్లమాని తెలిపారు. సీత ప్రయాణం కృష్ణతో చిత్రానికి సినిమాటోగ్రఫీ:రవీంద్ర, సంగీతం: హనుమాన్‌త్సవటపల్లి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: చెర్రీ, ప్రొడక్షన్ కంట్రోలర్: రుద్రపట్ల వేణుగోపాల్, చీఫ్ అడ్వైజర్: రామ్ రావిపల్లి, నిర్మాత: రోజా భారతి, డైరెక్టర్ : దేవేందర్. త్రిగుణి చిత్రానికి సినిమాటోగ్రఫీ:సలీం, సంగీతం: హనుమాన్ త్సవటపల్లి, నిర్మాత: మహేశ్వరి, కథ: వంశీ, డైరెక్టర్ : వైతహవ్య వడ్లమాని.

ఐపీఎల్‌లో నేడు
ముంబయి X హైదరాబాద్
వేదిక : ముంబయి , రా॥ 7.30
స్టార్‌స్పోర్ట్స్‌లో ప్రసారం..

ఆటలు

చెన్నై సూపర్‌మచ్చి

- పంజాబ్‌పై ఏకపక్ష విజయం
- రాణించిన జడేజా, తుషార్, సింగ్


చెన్నై 167/9, పంజాబ్ 139/9

చెన్నై సూపర్‌కింగ్స్ అదరహో. గత నాలుగు మ్యాచుల్లో మూడు పరాజయాలు చవిచూసిన సూపర్‌కింగ్స్ ధర్మశాలలో గెలుపు బాట పట్టింది. పంజాబ్ కింగ్స్‌ను చిత్తు చేసి ఏకపక్ష విజయం సాధించింది. 168 పరుగుల ఊరించే ఛేదనలో జడేజా, తుషార్, సిమ్రన్‌జిత్ మ్యాజిక్‌తో పంజాబ్ బ్యాటర్లు చేతులెత్తేశారు. చెన్నై సూపర్‌కింగ్స్ ఏడో విజయం ఖాతాలో వేసుకోగా.. పంజాబ్ కింగ్స్ ఏడో ఓటమిని మూటగట్టుకుంది.

నవతెలంగాణ-ధర్మశాల

రవీంద్ర జడేజా (43, 26 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) (3/20) ఆల్‌రౌండ్ ప్రదర్శనతో మాయజాలం చేశాడు. జడేజా మ్యాజిక్‌తో పంజాబ్ కింగ్స్ చేతిలో వరుస ఐదు ఓటములకు చెన్నై సూపర్‌కింగ్స్ చెక్ పెట్టింది. ధర్మశాలలో పంజాబ్ కింగ్స్‌ను చిత్తు చేసిన సూపర్‌కింగ్స్ 28 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ విజయంతో పాయింట్ల పట్టికలో టాప్-4లోకి ప్రవేశించింది. 168 పరుగుల ఛేదనలో పంజాబ్ కింగ్స్ చతికిల పడింది. ఓపెనర్ ప్రభుసిమ్రన్ సింగ్ (30, 23 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), శశాంక్ సింగ్ (27, 20 బంతుల్లో 4 ఫోర్లు) మినహా టాప్ ఆర్డర్ బ్యాటర్లు అందరూ విఫలమయ్యారు. జానీ బెయిర్‌స్టో (7), రొసో (0), కరన్ (7), జితేశ్ (0), ఆషుతోశ్ (3) విఫలమయ్యారు. చెన్నై బౌలర్లు జడేజా (3/20), తుషార్ (2/35), సిమ్రన్‌జిత్ సింగ్ (2/16) మెరవటంతో పంజాబ్ కింగ్స్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 139 పరుగులే చేసింది. తొలుత బ్యాటింగ్ చేసిన చెన్నై సూపర్‌కింగ్స్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 167 పరుగులు చేసింది. రవీంద్ర జడేజాకు తోడు కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ (32, 21 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్), డార్లీ మిచెల్ (30, 19 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. ఎం.ఎస్ ధోని (0) గోల్డెన్ డక్‌గా వెనుదిరిగాడు. పంజాబ్ బౌలర్లలో హర్షల్ పటేల్ (3/24), రాహుల్ చాహర్ (3/23), అర్షదీప్ సింగ్ (2/42) రాణించారు.

జడేజా షో : టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు వచ్చిన సూపర్‌కింగ్స్‌కు ఆశించిన ఆరంభం దక్కలేదు. అజింక్య రహానె (9) మరోసారి నిరాశపరిచాడు. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ (32), డార్లీ మిచెల్ (30) రెండో వికెట్‌కు కీలక భాగస్వామ్యం నమోదు చేశారు. పంజాబ్ బౌలర్లు కట్టుదిట్టంగా బంతులేసినా క్రమం తప్పకుండా బౌండరీలు బాదారు. శివం దూబె (0), మోయిన్ అలీ (17) నిరాశపరచటంతో చెన్నై 101/5తో కష్టాల్లో కూరుకుంది. ఈ సమయంలో రవీంద్ర జడేజా (43) ఆదుకున్నాడు. మూడు ఫోర్లు, రెండు సిక్సర్లతో మెరిశాడు. మిచెల్ శాంట్నర్ (11), శార్దుల్ ఠాకూర్ (17) తోడుగా డెత్ ఓవర్లలో రాణించాడు. ఎం.ఎస్ ధోని (0) తొలి బంతికే



నిష్క్రమించగా అభిమానులు నిరాశకు లోనయ్యారు. పంజాబ్ కింగ్స్ బౌలర్లు హర్షల్ పటేల్, రాహుల్ చాహర్, అర్షదీప్ సింగ్‌లు సూపర్‌కింగ్స్ బ్యాటర్లను సమర్థవంతంగా నిలువరించారు. చెన్నై సూపర్‌కింగ్స్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 167 పరుగులే చేసింది.



ఖతర్నాక్ కోల్‌కత

- లక్నోపై 98 పరుగుల తేడాతో గెలుపు
- కోల్‌కత 235/6, లక్నో 137/10


లక్నో : కోల్‌కత నైట్‌రైడర్స్ ఐపీఎల్ 17వ సీజన్ ప్లే ఆఫ్స్ బెర్త్‌కు చేరువైంది. ఆదివారం లక్నోలో జరిగిన మ్యాచ్‌లో లక్నో సూపర్‌జెయింట్స్‌పై 98 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. బ్యాట్‌తో, బంతితో తిరుగులేని ప్రదర్శన చేసిన కోల్‌కత నైట్‌రైడర్స్ సీజన్లో ఎనిమిదో విజయం నమోదు చేసింది. 236 పరుగుల రికార్డు ఛేదనలో లక్నో 16.1 ఓవర్లలో 137 పరుగులకే కుప్పకూలింది. మార్కస్ స్టొయినిస్ (36), కెఎల్ రాహుల్ (25) మినహా లక్నో బ్యాటర్లు అందరూ తేలిపోయారు.

తొలుత బ్యాటింగ్ చేసిన కోల్‌కత నైట్‌రైడర్స్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 235 పరుగులు చేసింది. పించ్ హిట్టర్ సునీల్ నరైన్ (81, 39 బంతుల్లో 6 ఫోర్లు, 7 సిక్స్‌లు) ధనాధన్ అర్థ సెంచరీతో దంచికొట్టాడు. 27 బంతుల్లోనే అర్థ సెంచరీ బాదిన సునీల్ నరైన్..నైట్‌రైడర్స్‌కు మరోసారి భారీ స్కోరు అందించాడు. ఓపెనర్ ఫిల్ సాల్ట్ (32, 14 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్)తో కలిసి అదిరే ఆరంభం అందించిన సునీల్ నరైన్.. యువ బ్యాటర్ రఘువంశీ (32, 26 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్)తో కలిసి సైతం కీలక భాగస్వామ్యం నమోదు చేశాడు. అండ్రీ రసెల్ (12), రింకూ సింగ్ (16) నిరాశపరిచినా.. శ్రేయస్ అయ్యర్ (23), రమన్‌దీప్ సింగ్ (25 నాటౌట్) మెరవటంతో కోల్‌కత 235 పరుగులు చేసింది. లక్నో పేసర్ నవీన్ ఉల్ హక్ (3/49) ఆకట్టుకున్నాడు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

బజరంగ్ పూనియా సస్పెన్షన్ వేటు

- నాడా ఆరోపణను ఖండించిన రెజ్లర్



న్యూఢిల్లీ: పారిస్ ఒలింపిక్స్‌కు సిద్ధమవుతున్న కుస్తీ యోధుడు, ఒలింపిక్ పతక విజేత బజరంగ్ పూనియాపై 'నేషనల్ యాంటీ డోపింగ్ ఏజెన్సీ (నాడా)' సస్పెన్షన్ వేటు వేసింది. డోపింగ్ పరీక్షకు మూత్ర నమూనాను ఇవ్వనందునే బజరంగ్‌పై చర్య తీసుకున్నట్లు భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) నియమించిన తాత్కాలిక కమిటీ పేర్కొంది. మూత్ర నమూనా ఇవ్వడానికి తాను ఎన్నడూ నిరాకరించలేదని పునియా స్పష్టం చేశారు. నాడా చేసిన ఆరోపణను ఆయన ఖండించారు. కాలం చెల్లిన పరికరాలను డోప్ టెస్టులో ఎందుకు ఉపయోగిస్తున్నారని తాను అడిగితే నాడా నుంచి సమాధానం లేదని ఆయన అన్నారు. అంతకుముందు నాడా ఒక ప్రకటన చేస్తూ మార్చి 10న సోనిపట్‌లో అంతర్జాతీయ వేదికల్లో పోటీపడే అథ్లెట్లు, రెజ్లర్ల నుంచి యూరిన్ శాంపిల్స్ కోరామని, నిర్దిష్ట గడువలోగా పునియా మూత్ర నమూనాలను ఇవ్వలేదని పేర్కొంది. అంతేకాదు శాంపిల్స్ ఇచ్చేందుకు అతడు విముఖంగా ఉన్నాడని కూడా నాడా ట్విటర్ (ఎక్స్) వెల్లడించింది. నాడా ఈ సస్పెన్షన్ వేటు వేయడం ద్వారా ఏప్రిల్ 24న వారణాసిలో జరిగిన పారిస్ ఒలింపిక్స్ ట్రయల్స్‌లో పాల్గొనేందుకు వీలులేకుండా చేసింది. పునియా ఇచ్చే సమాధానాన్ని బట్టి సస్పెన్షన్ ఎంతవరకు ఉంటుందనేది ఆధారపడి ఉంటుందని నాడా తెలిపింది.

ప్రారంభ రౌండ్‌లో రోహిత్ కుమార్‌తో జరిగిన మ్యాచ్‌లో పునియా ఓటమిపాలయ్యాడు. ఇప్పుడీ సస్పెన్షన్ వేటుతో పారిస్ ఒలింపిక్స్‌కు అవకాశాలు మూసుకుపోయినట్టేనని పరిశీలకులు భావిస్తున్నారు.మహిళా రెజ్లర్ల పట్ల కీచకుడిగా వ్యవహరించిన బిజెపి ఎంపి, రెజ్లింగ్ ఫెడరేషన్ అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్‌పై చర్య తీసుకోవాలని కోరుతూ ఒలింపిక్ పతక విజేత సాక్షి మాలిక్, వినేష్ పోగట్‌లతో కలసి ఢిల్లీలో ధర్నా చేసిన పునియా తన పద్మ శ్రీ అవార్డును, ఇతర పతకాలను వాపసు చేశారు అందుకే ప్రభుత్వం కక్ష సాధిపు చర్యలో భాగంగా ఈ సస్పెన్షన్ వేటు వేసిందని పలువురు భావిస్తున్నారు. బ్రిజ్‌భూషణ్ సింగ్ పై చర్య తీసుకోవడానికి బదులు అతని కుమారుడికి బిజెపి కైసర్‌గంజ్ లోక్‌సభ టికెట్ ఇచ్చింది.

పూరీ కాంగ్రెస్ అభ్యర్థిగా జై నారాయణ్ పట్నాయక్

పూరీ : ఒడిశాలోని పూరీ నియోజకవర్గానికి ఇంతకు ముందే ఖరారైన సుచరిత బదులు జై నారాయణ్ పట్నాయక్‌ని అభ్యర్థిగా కాంగ్రెస్ ప్రకటించింది. ఈ మేరకు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కె.సి వేణుగోపాల్ ప్రకటన విడుదల చేశారు. మాజీ ఎంపి బ్రజామోహన్ మహంతీ కుమార్తె, మాజీ జర్నలిస్టు అయిన సుచరితా మహంతిని కాంగ్రెస్ పార్టీ పూరీ నియోజకవర్గానికి తొలుత ప్రకటించింది. అయితే తన దగ్గర డబ్బుల్లేవంటూ ఎన్నికల్లో పోటీ చేయనని తేల్చి చెప్పారు.

తనకు అధిష్టానం ఆర్థిక సహకారం నిరాకరించిందని.. దీంతో తాను ఈ ఎన్నికల్లో పోటీ చేయనని కెసి వేణుగోపాల్‌కు లేఖ రాశారు. సుచరిత పోటీ నుంచి తప్పుకోవడంతో ఆమె స్థానంలో నారాయణ్ పట్నాయక్ బరిలో నిలిచారు. కాగా పూరీ లోక్‌సభ స్థానానికి ఆరోవిడతలో మే 25న పోలింగ్ జరగనుంది. నామినేషన్లకు చివరి గడువు మే 6 వరకు ఉంది

ఎన్నికల సిబ్బందికి రక్షణ కల్పించాలి


- మ్యాన పవన్ కుమార్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ప్రతి జిల్లాలో ఉష్ణోగ్రతలు 46 డిగ్రీలకు పైన నమోదవుతున్న నేపథ్యంలో ఎన్నికల సిబ్బందికి ఎండలతీవ్రత నుంచి రక్షణ కల్పించాలని తెలంగాణ రాష్ట్ర కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మ్యాన పవన్ కుమార్ ఎన్నికల కమిషన్ కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో ఈనెల 13న జరగనున్న లోక్‌సభ ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగ ఉపాధ్యాయులకు అన్ని సదుపాయాలు కల్పించాలని కోరారు. అధిక ఉష్ణోగ్రతల దృష్ట్యా ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రంలో ఎక్కువ కౌంటర్లు ఏర్పాటు చేయాలనీ, ఎన్నికల సిబ్బందిని పోలింగ్ స్టేషన్‌లో తీసుకెళ్లే వాహ నాలు ఎక్కువ సంఖ్యలో అందుబాటులో ఉంచాలనీ, రిసెప్షన్ సెంటర్లో ఉద్యోగ, ఉపాధ్యా యులకు అవసరమైన వైద్య సదుపాయాలు కల్పించాలని సూచించారు. ప్రతి ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రంలో, పోలింగ్ స్టేషన్‌లో తప్పనిసరిగా కూలర్లు, చల్లని త్రాగునీరు, ఓఆర్ఎస్ అందుబాటులో ఉండే విధం గా అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ఎన్నికల సమ యాన్ని పెంచిన దృష్ట్యా సిబ్బంది రాత్రి సమయంలో సొంత ప్రాంతలకు వెళ్లే విధంగా వాహనాల సౌకర్యం కల్పించాలని మ్యాన పవన్ కుమార్ విజ్ఞప్తి చేశారు.

పిడుగు పాటుకు మహిళ మృతి



నవతెలంగాణ-ఆమనగల్

రంగారెడ్డి జిల్లా ఆమనగల్ పట్టణ సమీపంలో ఆదివారం పిడుగు పాటుకు గురై మహిళా రైతు మృతిచెందింది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆమనగల్ పట్టణానికి చెందిన కావటి లక్ష్మయ్య భార్య కావటి పద్మమ్మ (45) రోజు మాదిరిగా గొర్రెలు మేపడానికి పొలానికి వెళ్లింది. గుర్రంగుట్ట సమీపంలోని తమ వ్యవసాయ పొలంలో గొర్రెలు మేపుతుండగా ఈదురుగాలులతో అకాల వర్షం కురవడంతో సమీపంలోని చెట్టు కిందికి వెళ్ళింది. అదే సమయంలో చెట్టుపై పిడుగు పడటంతో చెట్టు కింద ఉన్న పద్మమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలికి భర్త లక్ష్మయ్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. పిడుగుపాటుకు గురై మృతి చెందిన పద్మమ్మ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

వడదెబ్బతో ఒకరు మృతి

నవతెలంగాణ - జమ్మికుంట

కరీంనగర్ జిల్లా జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లిలోని ఆదర్శ కాలనీ దగ్గర ఆదివారం ఉదయం ఎండ తీవ్రత ఒక వ్యక్తి మృతిచెందారు. ఇల్లందకుంట మండలం చిన్న కోమటిపల్లి గ్రామానికి చెందిన ముడేడ్ల రాజయ్య (50) మతిస్థిమితం కోల్పోయి ఊరూరా తిరుగుకుంటూ భిక్షాటన చేసుకుంటూ, ప్లాస్టిక్ బాటిల్స్ ఏరుకుంటూ జీవిస్తున్నారు. ఆదివారం కొత్తపల్లిలో ఆదర్శ కాలనీలో రైల్వే ట్రాక్ పక్కన ఎండ తీవ్రతకు చనిపోయినట్టు పట్టణ సీఐ వరగంటి రవి తెలిపారు.

'రైల్ రోకో' లో మహిళా రైతు మృతి

పటియాలా : పంజాబ్ రాష్ట్రంలోని పాటియాలాలోని శంభు రైల్వే స్టేషన్‌లో నిర్వహిస్తున్న 'రైల్ రోకో' నిరసనలో ఆదివారం మహిళా రైతు మరణించింది. ఇందుకు సంబంధించిన వివరాల ప్రకారం.. ఫిబ్రవరి 13 నుంచి కిసాన్ మజ్దూర్ సంఘర్ష్ కమిటీ ఆధ్వర్యంలో రెండవ దశ రైతుల నిరసనలు ప్రారంభమయ్యాయి. ఈ కమిటీలో తర్న్ తరణ్ జిల్లాకు చెందిన బల్వీందర్ కౌర్ (55) అనే మహిళా రైతు కూడా ఉన్నారు. ప్రస్తుతం గోధుమ పంట చేతికి వచ్చే కాలం కావడంతో మగవారు పంట కోత పనుల్లో ఉండ టంతో మహిళా రైతులు నిరసనలో పాల్గొంటున్నారు. ఈ క్రమంలో నిరసన లో పాల్గొన్న బల్వీందర్ శంభు రైల్వే స్టేషన్‌లో 'రైల్ రోకో' నిరసనలో మరణిం చింది. కాగా నిరసన ప్రారంభమైనప్పటి నుంచి మరణించిన మొదటి మహిళా రైతు ఆమె.

గాజా మారణహోమానికి వ్యతిరేక ఆందోళనపై ఉక్కుపాదం

- అమెరికా విశ్వవిద్యాలయాల నిరసనలపైన బైడెన్ సర్కార్ అణచివేత



అమెరికా : పాలస్తీనా అనుకూల నిరసనలను అరికట్టడానికి పోలీసు హింసకు అధ్యక్షుడు జో బైడెన్ తెలిపిన ఆమోద ప్రభావం అమెరికా విశ్వవిద్యాలయాల్లో కొనసాగుతూ ఉంది. కొలంబియా విశ్వవిద్యాలయం, సిటీ కాలేజ్ ఆఫ్ న్యూయార్క్, పోర్ట్‌లాండ్ విశ్వవిద్యాలయం, విస్కాన్సిన్ విశ్వవిద్యాలయం, టేనస్సీ విశ్వవిద్యాలయం, ఇతర క్యాంపస్‌లలో గురువారం 300 మంది విద్యార్థులను అరెస్టు చేశారు. ఈ భారీ పోలీసు దాడులు ఆ మధ్యాహ్నం బైడెన్ చేసిన మూడు నిమిషాల ప్రసంగాన్ని అనుసరించాయి. ఆ ప్రసంగంలో అతను శాంతియుత నిరసనలను "హింసాత్మకం", "యూదు వ్యతిరేకం" అని ప్రకటించాడు. "ఆర్డర్ తప్పనిసరిగా గెలవాలి" అని చెప్పాడు.

బైడెన్ మాట్లాడటానికి కొన్ని గంటల ముందు, లాస్ ఏంజిల్స్ పోలీసులు యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా క్యాంపస్‌లో ప్రవేశించి 137 మందిని అరెస్టు చేశారు. బుధవారం రాత్రి నిద్రిస్తున్న నిరసనకారులపై జియోనిస్ట్ ఫాసిస్టులు చేసిన దాడులను ఆపటానికి పోలీసులు ఏమీ చేయలేదు. శుక్రవారం న్యూయార్క్ పోలీస్ డిపార్ట్‌మెంట్ ది న్యూ స్కూల్, న్యూయార్క్ విశ్వవిద్యాలయం వద్ద నిరసన శిబిరాలను కూల్చివేసింది. ది న్యూ స్కూల్‌లో 43 మందిని, న్యూయార్క్ విశ్వవిద్యాలయంలో 13 మందిని పోలీసులు అరెస్టు చేశారు. కొలంబియాలోని హామిల్టన్ హాల్‌ను శాంతియుతంగా ఆక్రమించిన విద్యార్థులపై దాడి చేస్తున్న సమయంలో పోలీసుల్లో ఒకరు తన ఆయుధాన్ని "అనుకోకుండా ప్రయోగించారని" న్యూయార్క్ పోలీస్ డిపార్ట్‌మెంట్ అంగీకరించింది. తుపాకీ డిశ్చార్జ్‌పై మూడు రోజుల మౌనానికి పోలీసు ప్రతినిధి ఎటువంటి కారణం చెప్పలేదు.

అయితే నిరసనకారులను "హమాస్ టెర్రరిస్టులు", "బయటి ఆందోళనకారులు" అని దుమ్మెత్తిపోయడానికి డెమోక్రాట్లు, రిపబ్లికన్‌లు చేస్తున్న ప్రయత్నాలకు అనుగుణంగా శుక్రవారం ఉదయం అరెస్టు చేసిన నిరసనకారులు విద్యార్థులని అంగీకరించిన తర్వాత న్యూయార్క్ పోలీస్ డిపార్ట్‌మెంట్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ ఆపరేషన్స్ కాజ్ డాట్రీ ఇలా అన్నాడు : ఈ ఉద్యమం వెనుక ఎవరో ఉన్నారు... దీనికి ఎవరో నిధులు సమకూరుస్తున్నారు. మా విద్యార్థులను ఎవరో తీవ్రవాదం వైపు మరలిస్తున్నారు. మా డిప్యూటీ కమిషనర్ ఆఫ్ టెర్రరిజం, ఇంటెలిజెన్స్ విభాగం అది ఎవరో కనుగొంటారు. అలా చేసినప్పుడు మేము వారిని కొన్ని ప్రశ్నలు అడుగుతాము.

శుక్రవారం కూడా, చాపెల్ హిల్‌లోని యూనివర్సిటీ ఆఫ్ నార్త్ కరోలినా వద్ద గాజాలో ఇజ్రాయెల్ జరుపుతున్న మారణహోమాన్ని ఆపాలని డిమాండ్ చేయడానికి ట్రాఫిక్‌ను నిలిపివేసిన ప్రదర్శనను పోలీసులు అనేక వందల మందితో విచ్ఛిన్నం చేశారు. పోలీసులు కనీసం 30 మందిని అరెస్టు చేశారు. విస్కాన్సిన్-మాడిసన్ విశ్వవిద్యాలయం విద్యార్థులు తదుపరి వారం ఫైనల్స్ ప్రారంభానికి ముందు నిరసన శిబిరాన్ని ముగించాలని డిమాండ్ చేసింది. విద్యార్థుల డిమాండ్లకు మద్దతుగా సోమవారం అధ్యాపకులు వాకౌట్ చేస్తారని యుడబ్ల్యూ-మాడిసన్ వద్ద నిరసన కారులు ప్రకటించారు. చికాగో విశ్వవిద్యాలయం అధ్యక్షుడు పాల్ అలివిసాటోస్ ఏప్రిల్ 29న విద్యార్థులు ఏర్పాటు చేసిన శిబిరాన్ని తీసివేయాలని బెదిరించాడు.

క్యాంపస్ కాలేజ్ గ్రీన్‌లో ఏప్రిల్ 25 నుంచి కొనసాగుతున్న నిరసన శిబిరం త్వరలో మూసివేస్తారని పెన్సిల్వేనియా విశ్వవిద్యాలయ పాలనా యంత్రాంగం శుక్రవారం హెచ్చరిక జారీ చేసింది. వాక్ స్వాతంత్ర్యం, రాజకీయ వ్యక్తీకరణ హక్కుల ఉల్లంఘనలను న్యాయపరంగా సవాలు చేయటానికి పాలస్తీనియన్లకు మద్దతుగా నిరసన తెలిపిన తర్వాత ఇండియానా యూనివర్సిటీ క్యాంపస్ నుంచి నిషేధించబడిన ముగ్గురి తరపున అమెరికన్ సివిల్ లిబర్టీస్ యూనియన్ బ్లూమింగ్టన్ ఇండియానాలో శుక్రవారం కోర్టును ఆశ్రయించింది. ప్రొఫెసర్ బెంజమిన్ రాబిన్సన్, గ్రాడ్ విద్యార్థి మడేలిన్ మెల్‌డ్రమ్, బ్లూమింగ్టన్ నివాసి జాస్పర్ విర్ట్ షాఫ్టర్ అనే ముగ్గురు వ్యక్తులు నిరసనల కోసం నిర్దేశించబడిన 20 ఎకరాల క్యాంపస్ స్థలమైన డన్ మేడో వద్ద ప్రదర్శనలు చేస్తున్నారు, వారిని అరెస్టు చేసి తర్వాత నిషేధించారు.

గాజాలో పాలస్తీనియన్లపై ఇజ్రాయెల్ చేస్తున్న సామూహిక హత్యాకాండను వ్యతిరేకిస్తున్న నిరసన కారులపైన జరుగుతున్న పోలీస్ దాడులకు బైడెన్ పాలన, అమెరికాలోని రెండు పాలక పార్టీలతో పాటు అమెరికా సామ్రాజ్యవాద నాయకత్వంలోని నాటో కూటమి దేశాల మద్దతు ఉంది. అయినప్పటికీ, విద్యార్థులు, కార్మికులు సాహసోపేతంగా తమతమ నిరసన కొనసాగిస్తున్నారు. కొలంబియా, యూనివర్సిటీ ఆఫ్ క్యాలిఫోర్నియా, లాస్‌ఏంజలిస్, ఇతర అమెరికా విశ్వవిద్యాలయ విద్యార్థులు తీసుకున్న వైఖరి స్ఫూర్తితో విద్యార్థుల నిరసన శిబిరాలు ప్రపంచవ్యాప్తంగా విస్తరించడం ప్రారంభించాయి. లండన్, ప్యారిస్, రోమ్, సిడ్నీ, టోక్యో, బీరూట్‌లలో విద్యార్థుల నిరసనలు వెల్లువెత్తుతున్నాయి.



ప్రజాశ్రేయస్సు కోసం పరితపించే..

జహంగీర్‌ను గెలిపించండి

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మల్లు లక్ష్మి

నవతెలంగాణ-తుంగతుర్తి

ఉద్యమాలే ఊపిరిగా, ప్రజాశ్రేయస్సే తన ధ్యేయంగా, నిరంతరం ప్రజా సమస్యలపై అలుపెరుగని పోరాటం చేస్తున్న సీపీఐ(ఎం) భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి ఎండీ జహంగీర్ గెలుపు కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మల్లు లక్ష్మి పిలుపునిచ్చారు. ఆదివారం సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం అన్నారం గ్రామంలో ఆ పార్టీ అభ్యర్థి ఎండీ జహంగీర్ గెలుపు కోసం ఇంటింటి ప్రచారం నిర్వహించి మాట్లాడారు. తుంగతుర్తి గడ్డ కమ్యూనిస్టుల అడ్డా అని, ఈ ప్రాంతంలో భీమ్‌రెడ్డి నర్సింహారెడ్డి, మల్లు స్వరాజ్యం ఎంతో అభివృద్ధి చేశారన్నారు. ప్రజా సమస్యలపై పోరాడే కమ్యూనిస్టులకే ఓటు అడిగే నైతికహక్కు ఉందన్నారు. వీర తెలంగాణ సాయుధ పోరాట అమరవీరుల ఆశయ సాధన కోసం సీపీఐ(ఎం) పనిచేస్తుందన్నారు. బూర్జువా పార్టీలు మతం, కులం, ప్రాంతం అడ్డుపెట్టుకొని రాజకీయాలు చేస్తున్నాయని విమర్శించారు. ఉపాధి పరిశ్రమలు, మౌలిక రంగాల్లో అత్యంత వెనుకబడ్డ పార్లమెంట్ నియోజకవర్గం భువనగిరి అని అన్నారు. బీబీనగర్ మండలంలోని ఎయిమ్స్ వైద్యశాలలో 48 విభాగాలు ఉండగా 24 విభాగాలు మాత్రమే పనిచేస్తున్నాయని, ఇది బీజేపీ చేతగానితనం కాదా అని ప్రశ్నించారు. గిరిజనసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్మానాయక్ మాట్లాడుతూ.. భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో పోటీ చేస్తున్న సీపీఐ(ఎం) అభ్యర్థి జహంగీర్ సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుపై ఓటేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. సీపీఐ(ఎం) జిల్లాకార్యదర్శి వర్గసభ్యులు కొలిశెట్టి యాదగిరిరావు మాట్లాడుతూ.. సీపీఐ(ఎం)ను గెలిపిస్తే ప్రజల హక్కులతో పాటు వారి సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆపార్టీ జిల్లా కమిటీ సభ్యులు బుర్ర శ్రీనివాస్, సీనియర్ నాయకులు తాటి విజయమ్మ రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి పల్లా సుదర్శన్, నాయకులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

రూ.58లక్షల నగదు పట్టివేత

- ఆదిభట్లలో పోలీసుల తనిఖీలు



నవతెలంగాణ-ఆదిభట్ల

రంగారెడ్డి జిల్లా ఆదిభట్ల మున్సిపల్ పరిధిలో పోలీసులు వాహనాల తనిఖీలు చేస్తుండగా అనుమతి లేకుండా తరలిస్తున్న రూ.58లక్షల నగదు పట్టుకున్నారు. ఆదిభట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఆదిభట్ల మున్సిపల్ పరిధిలోని ఔటర్ రింగ్ రోడ్డు శ్రీశ్రీ ఏరో సీటి సమీపంలో పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టారు. ములుగు జిల్లా కన్నాయి గూడెం మండలం సింగారం గ్రామానికి చెందిన పల్లా శ్రీకాంత్ వాహనంలో డబ్బులు తరలిస్తున్నాడు. ఆ వాహనాన్ని తనిఖీ చేయగా రూ.58లక్షల 46వేలు పట్టుబడ్డాయి. వాటికి సంబంధించి ఎలాంటి పత్రాలు లేకపోవడంతో డబ్బును సీజ్ చేశారు. డబ్బులు వండర్‌లా నుంచి బొంగులూరు మీదుగా తరలిస్తున్నట్టు గుర్తించారు. డీటీఓ వద్ద డబ్బు డిపాజిట్ చేశారు. పూర్తి విచారణ కోసం జిల్లా గ్రీవెన్స్ సెల్, ఐటీ విభాగానికి సమాచారం ఇచ్చారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు. ఈ తనిఖీల్లో ఆదిభట్ల ఎస్ఐ వెంకటేష్, సిబ్బంది పాల్గొన్నారు.

చర్చలకు నెతన్యాహునే అడ్డంకి

- హమాస్ విమర్శ
- అల్‌జజీరా కార్యాలయాల మూసివేత

జెరూసలెం/గాజా : కాల్పుల విరమణపై ఒప్పందం కోసం జరుగుతున్న యత్నాలను నెతన్యాహు ఉద్దేశపూర్వకంగానే అడ్డుకుంటున్నారని హమాస్ విమర్శించింది. గాజాలో ఇజ్రాయిల్ ఆక్రమణకు స్వస్తి పలికేలా సమగ్ర కాల్పుల విరమణ ఒప్పందం కుదుర్చుకోవాలని హమాస్ నిజాయితీగా కృషి చేస్తోందని, హమాస్ చీఫ్ ఇస్మాయిల్ హనీయే చెప్పారు. కైరోలో ఇరు పక్షాల మధ్య చర్చలు పునరుద్ధరించాల్సి వుంది, అందుకోసం ప్రతినిధి బృందాన్ని పంపించాల్సి వుంది. రఫా నగరంపై మిలటరీ దాడిని ఇజ్రాయిల్ ప్రారంభించదని అమెరికా గ్యారంటీ ఇవ్వాలని హమాస్ కోరుతోంది. ఒప్పందం కుదురుతుందా లేదా అన్నదానితో సంబంధం లేకుండా దాడి జరిగి తీరుతుందని నెతన్యాహు చెబుతున్నారు. కాల్పుల విరమణకు నెతన్యాహు అంగీకరించాలని, ఒప్పందంలో భాగంగా గాజాలోని బందీలను విడిపించాలని ఇజ్రాయిల్‌లో ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనకారులు కోరుతున్నారు. బందీలను విడుదల చేయాలంటే గాజాలో యుద్ధానికి ఇక స్వస్తి పలకాలని హమాస్ చేస్తున్న డిమాండ్‌ను నెతన్యాహు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.

అల్‌జజీరా కార్యాలయాల మూసివేతకు ఆదేశం

ఇదిలావుండగా, ఇజ్రాయిల్‌లో అల్ జజీరా కార్యాలయాలన్నింటినీ మూసివేయాలని నెతన్యాహు ప్రభుత్వం ఆదేశించింది.

కార్పొరేట్‌లకు బీజేపీ కొమ్ము కాస్తోంది

- జీఎస్టీ తెచ్చి నిత్యావసర ధరలు పెంచింది
- అదానీ, అంబానీలను కుబేరులు చేసింది
- కాంగ్రెస్‌కు ఓటు వేస్తే మళ్లీ మోసపోతాం : ఆర్ఎస్ ఆశీర్వాద సభలో మాజీ మంత్రి హరీశ్‌రావు



నవతెలంగాణ - చందుర్తి

బీజేపీ కార్పొరేట్ కొమ్ముకాస్తూ అదానీ, అంబానీలను కుబేరులను చేసిందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. కేసీఆర్‌కు తిట్లు, దేవుని మీద ఓట్లు అంటూ రాష్ట్ర ముఖ్యమంత్రిని విమర్శించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి, రుద్రంగి మండలాల్లో ఆదివారం నిర్వహించిన బీఆర్ఎస్ ఆశీర్వాద సభలో ఆయన మాట్లాడారు. ప్రజలు మార్పు కోసం ఆశ పడ్డారని, కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు కరెంట్ సక్రమంగా ఉండేదని, కేసీఆర్ కిట్టు, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ వచ్చేదన్నారు. కానీ ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక ఏ ఒక్కటీ రాకుండా చేసిందని విమర్శించారు. ఆరు గ్యారంటీలను హామీ ఇచ్చి అధికారంలోకి రాగానే రూ.2 లక్షల రుణ మాఫీ చేస్తామని చెప్పి మాట తప్పారని ఆరోపించారు బాండ్లు బౌన్స్ అయ్యాయని అన్నారు. మహిళలకు నెలకు రూ.2500 ఇస్తామని చెప్పారని, ఈ నాలుగు నెలల్లో ఎంతమంది మహిళలకు ఇచ్చారని ప్రశ్నించారు. బీజేపీ సిలిండర్ ధర పెంచిందని, బీడీ కట్టపై పుర్రె గుర్తు తెచ్చి బీడీ కార్మికుల పొట్టకొట్టి ఉపాధి లేకుండా చేసిందన్నారు. కేంద్రంలో మన సమస్యలపై పోరాడాలంటే కారు గుర్తుకు ఓటు వేసి బోయినిపల్లి వినోద్ కుమార్‌ను గెలిపించాలని విజ్ఞప్తిచేశారు. మళ్లీ అబద్ధాల కాంగ్రెస్‌కు ఓటు వేసి మోసపోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ అభ్యర్థి వినోద్ కుమార్, వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చలిమెడ లక్ష్మి నరసింహారావు, జెడ్పి చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ రాఘవరెడ్డి, తుల ఉమ, ఏనుగు మనోహర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు మ్యాకల ఎల్లయ్య, నాయకులు పాల్గొన్నారు.

సభకు వచ్చిన మహిళకు రోడ్డు ప్రమాదం..

బీఆర్ఎస్ ఆశీర్వాద సభకు వచ్చిన మహిళకు రోడ్ ప్రమాదంలో కాలు విరిగింది. సభ ముగియగానే ఒక్కసారిగా జనం గుంపులుగా రోడ్డు దాటుతుండగా కోరుట్ల నుంచి వేములవాడకు వెళుతుండగా ఎన్‌గల్ గ్రామానికి చెందిన మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. దాంతో ఆమెను నాయకులు ఓ ప్రయివేట్ వాహనంలో వేములవాడ ఓ ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు.

కాంగ్రెస్‌ను ప్రజలు నమ్మట్లేదు

- మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

కాంగ్రెస్ పార్టీని ప్రజలు నమ్మట్లేదని మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య విమర్శించారు. ఆదివా రంనాడిక్కడి తెలంగాణ భవన్‌లో జరిగిన విలేకరుల సమా వేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్రజల ఓట్లు దండు కోవడం కోసమే రాహుల్ గాంధీ, ప్రధాన మోదీ ప్రసంగాలు ఉంటున్నాయన్నారు. కులగణన, సామాజిక న్యాయం గురించి జాతీయ నాయకులు మాట్లా డుతున్నారనీ, రాష్ట్రంలో ఆపార్టీలు 17 పార్లమెంట్ సీట్లలో చేసిన సామాజిక న్యాయం లేదన్నారు. కేవలం ఎన్నికల టార్గె ట్‌గా సామా జిక న్యాయం అనే మాటలు ప్రస్తావి స్తున్నారని ఆక్షేపిం చారు. కాంగ్రె స్‌పార్టీ రాష్ట్రం లో ఇచ్చిన హామీలకే దిక్కు లేదనీ, ఇక దేశంలో ఏం అమలు చేస్తారని ఎద్దేవా చేశారు. రాష్ట్రానికి ఏం చేశారో చెప్పుకొ నేందుకు మోడీ వద్ద ఎలాం టి సమాధానాలు లేవన్నారు. రెండు జాతీయ పార్టీలకు తెలంగాణ ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

జార్ఖండ్ రాజకీయాలపై కల్పన సోరెన్ ముద్ర

- తన భర్త, మాజీ సీఎం హేమంత్ అరెస్ట్‌తో అనూహ్యంగా పొలిటికల్ ఎంట్రీ
- గాండే అసెంబ్లీ ఉప ఎన్నికల్లో పోటీ
- అక్రమ కేసులపై బీజేపీ, మోడీకి పదునైన విమర్శనాస్త్రాలు

జె.జగదీష్



జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ భార్య కల్పన సోరెన్ (48) లోక్‌సభ ఎన్నికల వేళ అనూహ్యంగా రాజకీయాల్లోకి ప్రవేశించారు. ఉన్నత విద్యావంతురాలైన కల్పన, బీజేపీకి, ప్రధాని మోడీకి సంధిస్తున్న ప్రశ్నలు, హెచ్చరికలు జార్ఖండ్‌నే కాదు యావత్ జాతినే ఆలోచింపజేస్తున్నాయి. కచ్చితంగా జార్ఖండ్ రాజకీయాల్లో కల్పన మార్క్ కనిపిస్తోందని విశ్లేషకులు చెబుతున్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం తన భర్త హేమంత్ సోరెన్‌ను అక్రమంగా జైలుకు పంపిన తరువాత కల్పన ప్రత్యక్ష రాజకీయాల్లోకొచ్చారు. తన భర్త ఆశయాలను, లక్ష్యాలను ముందుకు తీసుకెళ్లేందుకే రాజకీయాల్లోకొచ్చానంటున్నారు. గాండే అసెంబ్లీ స్థానానికి జరుగుతున్న ఉప ఎన్నికల్లో పోటీ చేసేందుకు జేఎంఎం అభ్యర్థిగా కల్పన సోరెన్ నామినేషన్ దాఖలు చేశారు. రాష్ట్రంలో పార్లమెంట్ ఎన్నికలతో పాటు ఈ స్థానానికి కూడా మే 20న పోలింగ్ జరగనుంది. జెఎంఎం ఎమ్మెల్యే సర్ఫరాజ్ అహ్మద్ రాజీనామా చేయడంతో గిరిది జిల్లాలోని గాండే స్థానం ఖాళీ అయింది. ఎంటెక్, ఎంబీఏ వంటి ఉన్నత విద్యను పూర్తి చేసిన కల్పన మొన్నటి వరకు గృహిణిగా ఉన్నారు. ఒడిషాలోని మయూర్‌భంజ్ జిల్లాలో బరిపడలో పాఠశాల విద్యను పూర్తి చేసి, భువనేశ్వర్‌లో ఇంజనీరింగ్, ఎంబిఎ డిగ్రీలను పొందారు.

హేమంత్ లేని లోటు పూడ్చేందుకే..

'నా భర్త అరెస్ట్ ఊహించని విధంగా జరిగింది. ఈ ఘటనతో జేఎంఎం పార్టీ, కుటుంబ సభ్యులు షాక్ కు గురయ్యారు. హేమంత్ అరెస్టు తరువాత పార్టీ కార్యకర్తలు ముందుకు రావాలని కోరారు. వాళ్ల నాయకుడిపై ఉన్న ప్రేమ చూసి, హేమంత్ జీ తిరిగి వచ్చే వరకు ఈ లోటును పూడ్చడం నా నైతిక బాధ్యత అని అనుకున్నాను. అందుకే నేను రాజకీయాల్లోకి ప్రవేశించాను. వంగి నమస్కరించడం గిరిజనుల డీఎన్ఏలో లేదు. హేమంత్ సోరెన్ మరింత బలపడతారు. హేమంత్ సోరెన్ అమాయకుడు, నిర్దోషి. బీజేపీ ప్రభుత్వం ముందస్తుగా ప్లాన్ చేసిన కుట్రలో బాధితుడయ్యారు. బీజేపీపై జార్ఖండ్ ప్రజలు ఆగ్రహంతో ఉన్నారు. రాష్ట్రంలోని అపార ఖనిజ సంపదను దోచుకుంటున్న ఈ నిరంకుశ, కార్పొరేట్ శక్తులను వారు నిర్మూలిస్తారు" అని కల్పన అన్నారు.

ఎన్‌డీఏలో చేరనందుకే అరెస్ట్

"న్యాయ వ్యవస్థపై మాకు పూర్తి విశ్వాసం ఉంది. ఆయన బెయిల్‌పై బయటకు వచ్చి లోక్‌సభ ఎన్నికల ప్రచారం కోసం ఎదురుచూస్తున్నాం.

పేదలు, గిరిజనులు, దళితుల కోసం పనిచేసే ప్రతిపక్ష నేతలను అరెస్టు చేస్తే రాజ్యాంగం ఎలా పరిరక్షించబడుతుంది. బీజేపీ అబద్ధాలు మాత్రమే చెబుతుంది. నా భర్త 90 రోజులకు పైగా జైలులో ఉన్నారు. ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల్లో మాత్రమే ఈడీ ఎందుకు చర్యలు తీసుకుంటుందో నాకు ఒక ప్రశ్న ఉంది" అని కల్పన అన్నారు. "నేను అన్యాయానికి, నియంతత్వ శక్తులకు వ్యతిరేకిని. నేను నా భర్త అడుగుజాడల్లో నడుస్తాను. ఆయన తన విలువలతో రాజీ పడలేదు. బదులుగా జైలు మార్గాన్ని ఎంచుకున్నారు. నా భర్త అరెస్టు రాజకీయ ప్రేరేపితం. మమ్మల్ని బిజెపి కూటమిలో చేరమని బలవంతం చేశారు. అందుకు నిరాకరించడంతో ఆయనను కేంద్ర ప్రభుత్వం అరెస్టు చేసింది" అని కల్పన సోరెన్ విమర్శించారు.

ఆది నుంచీ కమలం కుట్రలు

2019లో హేమంత్ సోరెన్ నేతృత్వంలో జార్ఖండ్‌లో సంకీర్ణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి బీజేపీ కుట్ర పన్నింది. అందులో భాగంగానే ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ ను అరెస్టు చేసి జైలుకు పంపారు. దీంతో మార్చి 4న జరిగిన జెఎంఎం 51వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకల్లో కల్పన రాజకీయ ప్రయాణం ప్రారంభమైంది. తన భర్త జైలుకు వెళ్లిన తరువాత పార్టీకి కొత్త ముఖంగా అవతరించిన కల్పన.. బీజేపీని నిరంకుశ శక్తిగా అభివర్ణిస్తూ.. ప్రతిపక్షాలను అణిచివేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయాలు ఎప్పుడూ తను ఎంచుకోలేదని, పరిస్థితులు తనను వాటిల్లోకి నెట్టాయని అన్నారు.